# భీమసేనుడి వీలునామా

నవల

– తాడేపల్లి శివరామకృష్ణారావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 166

కౌముది మాసపత్రికలో

జూన్ 2016 సంచిక నుంచి డిసెంబర్ 2016 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

మనిషి ఎలా నడుచుకోవాలో రామాయణం చెబుతుంది. ఎలా నడుచుకోకూడదో మహాభారతం విశదీకరిస్తుంది. మహాభారతంలోని అన్ని పాత్రలకంటే విలక్షపాత్ర భీమసేనుడిది. అతనంత ఆవేశంగల పాత్ర మరొకటి లేదు. ఆ ఆవేశాన్ని అన్న ధర్మరాజు ఆదేశాలపై ఎన్నోమార్లు అణచుకున్నా యుద్ధరంగమంటే అతడు అమృతం తాగినంత ఆనందపడిపోతాడు. ఒక పక్క ఆవేశం, మరోపక్క అన్నగారి మాటకాదనలేక దాన్ని తనలోనే అణచుకోవటం నిజంగా విలక్షణమే! అన్నమాట కాదనలేక తన ఆవేశాన్ని అణచుకుంటూ అతను పొందిన మానసిక సంఘర్షణ మనకు భారతంలో అనేకచోట్ల కనబడుతుంది.

అంతటి ఆవేశం వున్న మనిషిలో ఒక్కసారిగా ప్రశాంతత బయటపడితే...? అటువంటి మనిషిలో కూడా శాంతియుత ఆలోచనలు, భక్తిపూర్వక వినయం.. వెరశి ఆధ్యాత్మిక చింతనకు దారితీస్తే పరిణామం ఎలా వుంటుంది? ఈ ఆలోచనకు ప్రతిరూపమే ఈ పుస్తకం. ఎటువంటి వ్యక్తినైనా అవసానదశ తప్పనిసరిగా భగవంతుడివైపు పయనింపజేస్తుంది, అతడు నాస్తికుడైనా సరే.

అసలు భారతం నుంచి మనం నేర్చుకోవలసినది ఏమిటి?

ఒక్కొక్క పాత్ర మనకు చెబుతున్నదేమిటి?

ఎన్నో పాత్రలు, ఒక్కొక్క దానికొకటి సంబంధం లేనివి. అవి మనల్ని ఎలా ప్రభావితం చేస్తాయి?

మన జీవితాలకు ఆ పాత్రల తీరు తెన్నులను ఎలా అన్వయించుకోవాలి?

విభిన్న పాత్రలు.. ఒక్కొక్క వ్యక్తిలోని వ్యక్తిత్వం మనల్ని మేల్కొలిపి చైతన్యం కలిగించే మనస్తత్వం కలిగి వున్నవే. మనిషికి సన్మార్గ అవసరాన్ని, విశిష్టతను ప్రతి ఒక్కపాత్రా వ్యక్తం చేస్తుంది. అందుకే మన నడత, నడక ఎలా వుండాలో నిర్దేశించే బృహత్తర మానవతా గ్రంథం "మహాభారతం". మనలో మెదిలే సద్బుద్ధికి, సత్ప్రవర్తనకు దిశానిర్దేశం చేయటం ఎలా? ఏ మార్గం అనుసరణీయం? ఏది విసర్జనీయం?

వీటన్నింటికీ సమాధానమే ఈ "భీమసేనుడి వీలునామా"

చరిత్రలో అంతవరకూ కనీవినీ ఎరుగని రీతిలో జరిగిన యుద్ధంలో దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన వీరులు పాల్గొన్నారు. లక్షలాదిమంది ఈ యుద్ధంలో అసువులు బాశారు. వారిలో చాలామందికి కౌరవులతోగాని, పాండవులతోగానీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వైరం లేదు. అప్పటి పరిస్థితుల మేరకు వారు ఏదో ఒకవైపు చేరవలసి వచ్చింది.. ఇందుకు మూల్యం రెండు పక్షాలవారూ చెల్లించుకున్నారు.

ప్రస్తుతం మనిషిలో విజృంభించిన స్వార్థం, అవినీతి, అసమర్థత ఎటువైపు తీసుకెళ్తున్నాయో ఎవరూ పట్టించుకోవడంలేదు. 'ఎవరికివారే యమునాతీరే' అన్నట్లుగా వున్న మానవజీవితాన్ని చక్కదిద్దే ప్రయత్నం, మార్గం కానరావడంలేదు. ఇలాగే కొనసాగితే మానవజీవితానికి అసలు అర్థమే లేకపోగా సర్వ అనర్థాలకు దారితీసే ప్రమాదం పొంచి వుంది.

బ్రతుకు నాశనమవుతున్నా పట్టించుకోవటం మనిషి మానేశాడు. బుద్ధి పెడదోవ పట్టిన ఫలితం మనిషి బ్రతుకుపై స్పష్టంగా కనబడుతోంది. మహాభారత యుద్ధం వల్ల ఎవరికి లాభం కలిగిందో ఆలోచించుకోవటం ముఖ్యం.

అందుకే మనిషి ఎలా నడుచుకోవాలో, బ్రతుకును ఎలా పండించు కోవాలో భీముడి మాటల్లో చెప్పాలనే ఆలోచనే ఈ "భీమసేనుడి వీలునామా"కి నాంది పలికించింది. నాటి ప్రతి సంఘటనలోనూ భీమసేనుడి ప్రత్యక్ష ప్రమేయం వున్నది. కలియుగంలో జరుగుతున్న దారుణాలన్నింటికీ మనిషి ఒక్కడే కారణం కావటంతో కల్పితమైనప్పటికీ భీమసేనుడి వీలునామా పేరుతో ఆయన అంతరంగాన్ని భారతంలోని ఏ పాత్రనూ కించపరచకుండా ఆవిష్కరించే ప్రయత్నం చేశాను.

# (ప్రారంభం)

***నేను..కౌంతేయ మధ్యముడను... భీమసేనుడను.***

పాండవుల్లో ద్వితీయుడను. వృకోదరుడు, బాహుబలుడు అన్నవి నా నామాంతరాలు.

ధర్మక్షేత్రమైన కురుక్షేత్ర యుద్ధం ముగిసింది. యుద్ధంలో అశువులు బాసిన బంధుమిత్రులకు తిలోదకాది కార్యక్రమాలు నిర్వహించి వారి ఆత్మలకు శాంతి చేకూర్చిన తరువాత మీతో మాట్లాడుతున్నాను. అనేకమంది బంధువులు, మిత్రుల మృతికి కారణమయ్యామనే ఆవేదన మా సోదరులు ఐదుగురినీ ఆవరించి వున్నది. అయినా, ఇందులో మా తప్పు అణుమాత్రమైనా లేదని, యుద్ధం రాకుండా వుండేందుకు, సంధి కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా దుర్యోధనాది కౌరవ సోదరులు వినిపించుకోని దుష్పరిణామ ఫలితమిదని గట్టిగా విశ్వసిస్తున్నాను. ఇందులో మా ప్రమేయమున్నదని చెప్పడాన్ని సుతరామూ అంగీకరించను. ఇదే అంశంలో మా అగ్రజుడు అజాత శత్రువు బాధపడుతుండగా, అతడిని దాన్నుంచి బయటికి తీసుకొచ్చేందుకు మిగిలిన నలుగురం ఎన్నో ప్రయత్నాలు చేశాం. అంత సులువుగా ఆయనకు నచ్చచెప్పలేకపోయాం. మేము మా అనుచరులతో గంగానది ఒడ్డున సేదతీరుతుండగా తపశ్శీలుడు, వేదాధ్యయన నిరతుడు, త్రిలోకజ్ఞుడు నారదుడు విచ్చేశాడు.

"ఓ మునివరా! వాసుదేవుని కృపాకటాక్షాలు, విప్రోత్తముల అనుగ్రహం, భీమార్జునుల అమిత బలపరాక్రమాల వల్ల రాజ్యం వశమైంది" అంటున్న ధర్మజుని చూస్తూ నారదుడు "ధర్మజా! మీరిక త్వరగా రాజ్యభారం చేపట్టి మీ పై ఎన్నో ఆశలు పెట్టుకున్న పరిపాలించాలి. యుద్ధకారణంగా కోట్లాది మంది మరణాన్నుంచి వారి ఆత్మలు శాంతిపొందేందుకు, పరిస్థితులు అనుకూలమయ్యేందుకు వీలుగా సాధ్యమైనంత త్వరలో అశ్వమేథయాగం నిర్వహించాల్సిన బాధ్యత తీసుకోవాలి కూడా." అన్నాడు.

నారదుని మాటలకు ధర్మజుడు నిరాసక్తిగా చూశాడు.

అది గమనించి "అంతా విజయవంతమైంది కదా! ఇంకా ఎందుకు నీలో నిరాసక్తి అగ్రజా?" అని అడిగాను.

"నాకిక రాజ్యపాలనపై వ్యామోహం లేదు. ఇక్కడే పవిత్ర గంగానది ఒడ్డున నెలరోజులు విశ్రాంతి తీసుకుని ఇటునుంచి ఇటే వానప్రస్తానికి వెళ్ళాలని వుంది. పవిత్ర నదిలో స్నానమాచరించడమేగా గంగ గంగ అని స్మరిస్తే చాలు, సకల పాపాలు నశించి అనంత పుణ్యఫలాలు కలుగుతాయని" అన్నాడు ధర్మజుడు.

ఆ మాట విన్న మేమంతా ఒక్కసారి వులిక్కిపడ్డాం.

"అదేం నిర్ణయం?" ఎవ్వరం మాట్లాడలేకపోయాంగానీ మా అందరిలో ఒకేసారి ఈ ప్రశ్న ఉదయించింది. రాజ్యం కోసం ఎన్నో కేశాలు చెప్పలేని మనోవేదనలు ఇంకెన్నో అవమానాలు, అనుమానాలు ఎదుర్కొని వీరోచితంగా రాజ్యాన్ని సాధించుకున్న తరువాత అన్నగారి ఈ సంకోచానికి, వేదనకు కారణం మాకెవరికీ ఒక పట్టాన అర్థ కాలేదు. ఆయన వైరాగ్యానికి కారణమేమై వుంటుందా అని మాలో మేము మథన పడుతున్న సమయంలో మళ్ళీ ఆయనే చెప్పాడు.

"ఇంత విధ్వంసానికి ఏకైక కారకుణ్ణి నేను. ఇన్ని క్లేశాలు తెచ్చి పెట్టి మళ్ళీ వాళ్ళందరికీ ముఖం ఎలా చూపగలను? ఒకవేళ చూపినా పరిపాలన ఎలా చేయగలను?"

యుధిష్ఠురుని సంశయాలను తీర్చగలిగే శక్తి మాకెవరికి లేదు. ఎందుకంటే ఆయన ఒక ధర్మమూర్తి. సత్యసంధుడు, అజాతశత్రువు. సాక్షాత్తు ధర్మమూర్తిగా కీర్తింపబడుతున్న ఆయన సంశయం తీర్చగలిగే శక్తి ఎవరికున్నది? అలాంటి అగ్రజుని సంశయాలను మేమెలా తీర్చగలం? ఎలా నచ్చజెప్పగలం?

"అవును. నా మాటల్లోని నిజాలను నిలకడగా అర్థం చేసుకోండి సోదరులారా" మా ఆలోచన గ్రహించినవాడిలా ఆయన అన్నాడు.

ఇక ఆగలేకపోయాను. ఆయన్ని సమీపించి, "అరివీర భయంకరుడు, శత్రువుల పాలిటి సాక్షాత్తు యముడైన మా అగ్రజుడేనా ఇలా పలుకుతోంది? మీలో ఎందుకింత మార్పు? ఎందుకింత బేలతనం? అంతా అయిన తరువాత చేతికి ముద్ద అందే సమయంలో ఇలా ఎందుకు భావిస్తున్నారు? ఇది నిజంగా మీ మనసులో నుండి వచ్చినదేనా? లేక ఇంకెవరైనా మీ వెనుక నుండి ఇలా పలికిస్తున్నారా?" అనుమానదృక్కులతో చుట్టూ పరికిస్తున్న నన్ను చూచి పాండవాగ్రజుడు మళ్ళీ ఇలా అన్నాడు. ఆయన మాటల్లో నిర్లిప్తిత తొలిగిపోలేదు, అలాగే వుంది.

"అనుమానం అక్కరలేదు కౌంతేయ మధ్యమా! ఇందులో ఎవరి ప్రమేయం లేదు. అంతా నా స్వనిర్ణయమే. ఇతరులనెవరినీ తప్పుపట్టాల్సిన పనిలేదు. అనుమానించవలసిన అవసరమూ లేదు. ఎవరి కర్తకు ఎవరూ బాధ్యులు కారులు."

అప్పటివరకూ ప్రేక్షకపాత్ర పోషించిన నారద మహర్షి కల్పించుకుని, "యుధిష్టిరా! నీ సంశయాల్లో వాస్తవం లేదు. శక్తిచూపకుండా ఏ భూమీశ్వరుడూ రాజ్యాన్ని సంపాదించలేదు. శక్తిలేకుండా ఏ రాజూ పరిపాలన చేసిన దాఖలాలు లేవు. అందువల్ల నీ సంశయాలన్నీ వాస్తవదూరాలే. కాబట్టి నీ మాటే వేదవాక్కుగా, నీలో తమ దైవాన్ని చూసుకునే నీ సహోదరులు, ధర్మపత్ని కోసమైనా బేలతనాన్ని విడిచిపెట్టు. నువ్వు లేకుండా వాళ్ళు రాజ్యానికి ఎలా వెళ్తారని అనుకున్నావు?" అనడంతో నారదుడిని చూచాడు ధర్మరాజు. ఆయన కళ్ళలో నీళ్ళు.. గొంతులో బేలతనం.

"మీరు చెప్పేది మీ వరకు బాగానే వుంది. నా ఆలోచనే మీకు అర్థం కావడంలేదు. నలుగురు తమ్ముళ్ళను ఎంతో బాధ పెట్టాను. కేవలం నేను అగ్రజుడనైనందుకే నా మీద వున్న గౌరవంతో ఎన్నో క్లేశాలు అనుభవించినా పల్లెత్తుమాట నన్ననలేదు. స్వాభిమానాన్ని చంపుకుని నా కోసం పడరాని పాట్లు పడ్డారు. వారి జీవితాన్ని సంతోషమయంగా ఎక్కడ గడపనిచ్చాను? వారితో పాటు కట్టుకున్న ఇల్లాలిని.. ఇలా నాకు, నా వాక్కుకు గౌరవమిచ్చిన ఎవరినీ నేను పట్టించుకోలేదు. ఎవరి గురించి ఆలోచించలేదు. ఆజ్ఞాపిస్తే పాటించే సహోదరులు, వలదంటే ఇష్టమున్నా లేకున్నా నామాట మీదే గురిపెట్టుకున్న ఇల్లాలు, మమ్మల్ని కన్న దౌర్భాగ్యానికి ఎక్కువకాలం ఎడబాటుతో తల్లడిల్లిన తల్లి. ఈ విధంగా అందరూ కష్టపడడానికి కారణం నేను కాదా! ఈ బాధ నన్ను జీవిత పర్యంతం విడిచి పెట్టదు. దీనికి ప్రాయశ్చిత్తం, పశ్చాత్తాపం ప్రకటించాల్సిన బాధ్యత నాపై లేదా? మళ్ళీ నేనే రాజునై సోదరులు, భార్య చేత వూడిగం చేయించుకోవడం భావ్యమా? గతంలో అంటే శత్రువులున్నారు కాబట్టి మాలో ఐకమత్యం అవసరమైంది. ఇప్పుడా సమస్యా లేదుకదా!" అంటున్న పాండవాగ్రజుడిని అక్కడున్న భీమార్జున నకుల సహదేవులు, కుంతి, ద్రౌపది, శ్రీకృష్ణుడు, నారదుడు, వ్యాసుడు అందరూ చూస్తూనే వుండిపోయారు. అతనిలోని సంఘర్షణ అందర్నీ కదిలించింది.

***ఒక మనిషిపై మరొకరు విశ్వాసం చూపితే ఎంతటి త్యాగానికైనా సిద్ధపడతాడు.*** ఇదే మా అన్నదమ్ముల మధ్య సఖ్యతను, ఒకరంటే మరొకరికి ప్రేమానురాగాల్ని పంచేటట్టు చేసింది. పెద్దల పట్ల గౌరవం, పెద్దల్ని వ్యతిరేకించకపోవటం వంటి సలక్షణాలతో పెరిగిన వాళ్ళం కాబట్టి అన్నమాట మీరకుండా ప్రవర్తించటంలో మేమెలాంటి తొట్రుపాటు చూపించలేకపోయాం. ఇందులో గొప్పతనం ఏమున్నదో మాకు అవగతం కావడం లేదు.

కానీ ఇప్పుడు ధర్మజుడు అస్త్రసన్యాసం చేసి సన్యాసాశ్రమం స్వీకరించేందుకు సిద్ధమవుతున్నాడు. అతడు లేకుండా మేమెలా మనగల మనేదే ప్రస్తుతం మా మనసుల్ని వేధిస్తున్న ప్రశ్న. చిన్నప్పటినుంచి ఇప్పటివరకు మమ్మల్ని వదిలి ఆయనా వుండలేదు ఆయన ఎడబాటును మేమూ ఊహించలేదు. నిరంతరం మాకోసమే తానున్నానని మమ్మల్ని అనుక్షణం కనిపెట్టుకుని వుండి కంటికి రెప్పలా కాపాడిన అగ్రజుడు ఇప్పుడు 'సన్యాసం స్వీకరిస్తాను, మీ సంగతి మీరు చూచుకోండి' అంటున్నాడు. ఇది కలలో కూడా ఊహించని పరిణామం. ఇలాంటి పరిస్థితి వస్తుందని ఏనాడూ అనుకోలేదు. దీన్ని అధిగమించడం ఎలా? అన్నగారిని కర్తవ్యోముఖుడ్ని చేయడం ఎలా? అన్నది ప్రస్తుతం మమ్మల్ని పీడిస్తున్న సమస్య. ఇది నా ఒక్కడి ఆలోచనే కాదు, మిగిలిన వారిది కూడా.

ఇదే పరిస్థితి దుర్యోధన సోదరులకూ వస్తే ఏం చేసేవారు? కౌరవ సోదురులు నూరుగురు. మేమా ఐదుగురమే. మేమెలా అన్నగారికి సేవలు చేస్తూ, ఆయన మాటకే విలువ ఇచ్చి గడిపామో ఆ నూరుగురూ ఒకే మాటపై నిలబడ్డారు. తప్పో ఒప్పో ఆలోచించలేదు. వారిలో అగ్రజుడైన దుర్యోధనుడు నిప్పుల్లో దూకమంటే కళ్ళుమూసుకుని వెనకాముందూ ఆలోచించకుండా దూకేవారేగానీ ఎందుకని అడిగే అలవాటు లేనివాళ్ళు. అందుకే దుర్యోధనుడు ఆడింది ఆటా పాడింది పాటా అయింది. మేము పరమాత్ముడిని నమ్ముకుని ధర్మనిరతులుగా వుంటే వారు అధర్మహితులుగా వున్నారు. 'ధర్మో రక్షితి రక్షితః' కాబట్టి మేము విజయులమయ్యాం. ధర్మనిరతులకు విజయం తప్పదని పరమాత్ముడైన శ్రీకృష్ణుడు రుజువు చేశాడు. నూరుగురు సోదరులు ఏకమై మా ఐదుగురు సోదరుల చేతిలో హతలయ్యారు. వారంతా ఏకమైనా సాధించిందేమున్నది?

గతంలో అరణ్యవాస సమయంలో దుర్యోధనుడు తన దర్పాన్ని, తానునుభవిస్తున్న సంపదను చూపడం ద్వారా మమ్మల్ని కించపరచాలని ఘోషయాత్ర పేరుతో చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది కూడా. మత్సరం చూపే వ్యక్తికి అంతా అపజయమేకానీ అనుకున్నది సాధించలేడన్నది రుజువైంది. అప్పుడు దుర్యోధనుడిని గంధర్వుడు బంధించి తీసుకెళ్తుంటే "కాగల కార్యం గంధర్వులే చేశా"రని తాను ఎగతాళిగా వ్యాఖ్యానించినప్పుడు అన్నగారు తనను మందలించారు.

"తప్పు నాయనా! మనలో మనం కాట్లాడుకునే సమయంలో ఒకరికొకరు సహకారం అందించుకోవాలి. గుర్తుంచుకో" అని సుద్దులు చెప్పి తమ చేతనే దుర్యోధనుడిని బంధవిముక్తుడిని చేయించారు.

ఇపుడా సంఘటలన్నీ ఒక్కటొక్కటీ గుర్తుకొస్తున్నాయి. చేతనావస్థనుంచి అచేతనంలోకి జారిపోతున్నట్టుగా వుంది నా పరిస్థితి. ధర్మజుడు లేని పాండవులు అరక్షణం మనగలరా? ధర్మజుడు లేకుండా మేము హస్తినాపురానికి వెళ్ళి ప్రజలకు ఏమని జవాబు చెప్పుకోగలం? అరణ్యవాసానికి వెళ్ళినప్పుడే మమ్మల్ని వదిలి వుండలేక ఊళ్ళకు వూళ్ళే మాతో కదిలివచ్చాయి. వాళ్ళకు నచ్చజెప్పి వెనక్కి పంపేసరికి తల ప్రాణం తోకకు వచ్చినంత పనైంది.

"ధర్మనందనా! ఇంత విరక్తుడివి కావడం నీకు ధర్మం కాదు. సర్వధర్మాలు తెలిసిన నీకు చెప్పవలసినది ఏమీలేదు. కాస్త ప్రశాంత చిత్తుడవై ఆలోచించు. నీ సోదరుల్ని వదిలి నువ్వు మాత్రం వుండగలవా? ఇందరి మరణానికి నువ్వు కారకుడివనే భీతితో ధర్మహీనతకు పాల్పడవద్దు. జన్మించిన వారిలో మరణించిన వారెవ్వరు? ప్రతి ఒక్కరూ ఏదో ఒకరోజున మరణించవలసిందే! (స్వకర్మవశతః సర్వజంతూనాం ప్రభవాప్యయౌ! విజానన్నప్య విద్వాన్యః కథం శోచతి బాంధవాన్!!... అధ్యాత్మ రామాయణం: అయోధ్యకాండ: 7-100 - తమ తమ కర్మానుసారమే ప్రాణులన్నింటికీ జనన మరణాలు సంభవిస్తుంటాయి. ఇందులో ఎవరి ప్రమేయం వుండదు. కానీ, అజ్ఞానులు ఇది తెలిసి కూడా తమ బంధువుల కోసం విలపిస్తుంటారు.) నిందలేనిదే బొందిపోదన్నట్లు వీళ్ళందరూ మీ చేతుల్లో మరణించాలని రాసిపెట్టి వుంది. ఇందుకు ఒకరు కారనం కాదు. ఇదో కాలచక్రభ్రమణం. దీన్ని కాదని ఎవరూ జీవించలేరు. కాలచక్రం తిరగకుండా ఆపగలిగే శక్తి పరమాత్ముడికేలే"దని నారదుడు నచ్చజెప్పే యత్నం చేశాడు. అయినా ధర్మజుని మోములో కాంతి కనిపించలేదు.

"మీరన్నది నిజమే మహర్షీ. కాలచక్రమహిమను నేనూ అడ్డుకోలేను. కానీ ఇందరి మరణానికి కర్తనయ్యాను కదా అన్నదే నా క్షోభ. మేము ఐదుగురం మరణం నుంచి తప్పించుకోగలిగాం. మా పుత్రులు అభిమన్యాదుల్ని కూడా కాపాడుకోలేకపోయాం. ద్రౌపది వంటి ఎందరో కులకాంతలకు కడుపుకోత మిగిల్చి ప్రజాపాలన పేరుతో గద్దెనెక్కి సంతోషంగా ఎలా వుండగలను? చివరకు మా జేష్ఠుడు కర్ణుడిని కోల్పోయాం కదా! అతడు మరణించిన తరువాత గానీ కర్ణుడి జన్మరహస్యం మా జనని మాకు చెప్పలేదు." ధర్మజుని గొంతు వణికింది.

ధర్మరాజును చూస్తుంటే ప్రస్తుతం ఆయన దేహ భ్రాంతిలో మునిగిపోయాడని అనిపించింది నాకు. ఇది దేహభ్రాంతి కాకపోతే అనుజుడిలా విరాగిలా మారి విలపించడమేమిటి?

కురుక్షేత్ర యుద్ధసమయంలో అర్జునుడిని కృష్ణపరమాత్మ ఎలా కర్తవ్యోన్ముఖుడిని చేశాడో అదేవిధంగా ఇప్పుడూ ధర్మరాజుకూ కర్తవ్యబోధన అవసరమనిపించింది నాకు. కృష్ణ పరమాత్ముడి బోధ గురించి యుద్ధ పరిసమాప్తి తరువాత మా అందరికీ పార్థుడు వివరించాడు. ఆ సమయంలో తాను భవబంధాలనే అజ్ఞానంలో ఎలా మునిగిపోయాడో తెలిపాడు. అప్పటివరకూ శ్రీకృష్ణుడు ఆపద్బాంధవుడిగానే చూచిన నేను ఆయనలోని పరమాత్మతత్వాన్ని అర్జునుడి ద్వారా అప్పుడే తెలుసుకోగలిగాను.

ఆత్మ, పరమాత్మ రెండూ వేర్వేరు కాదని, రెండూ ఒకటేనని పరమాత్ముడు చెప్పిన అంశం గుర్తుకొచ్చింది. ప్రాణకోటిలో విశిష్టమైన మనిషి తనలోని జ్ఞానాన్ని మరిచి అంతా నాదేనని, అంతా తానేచేశానని భ్రమస్తుంటాడని వాసుదేవుడు చెప్పినట్లు విజయుడు చెప్పిన మాటల అర్థం ఇప్పుడు తెలిసింది.

దేహాభిమానం విడనాడితేనే సర్వసమస్యలు పరిష్కారమవుతాయి. దేహంపై అభిమానం వున్నంతవరకు అహంకారం వుంటుంది. ఐశ్వర్యంపై ఆశ వుంటుంది. ఐచ్ఛిక కోరికలుంటాయి. మాయ కమ్మేస్తుంది. వాస్తవం తెలుసుకునే జ్ఞానం రానివ్వదు. (సుఖస్య దుఃఖస్య న కో పి దాతా పరో దదాతీతి కుబుద్ధిరేషా! అహం కరోమీతి వృధాభిమానః స్వకర్మ సూత్రగ్రథితోహిలోకః!!.... ఆధ్యాత్మ రామాయణం: అయోధ్యకాండ:6-6- జనులకు ఈ సుఖదుఃఖాదులు కలిగించేది నేనేనని ఎవరైనా విర్రవీగితే అది దురహంకారం. తాము చేసుకున్న సుకృత దుష్కృతాల వల్లే అవి వారికి లభిస్తుంటాయి. ఈ లోకమంతా కర్మపాశంలో బంధింపబడి వున్నది.)

"కర్మ చేయకుండా కర్మనుంచి మానవుడు విముక్తి పొందలేడు. సన్యాసం స్వీకరించినంత మాత్రాన పరిపక్వత లభింపదు. పుట్టిన ప్రతి వ్యక్తీ ఏదో ఒక పని చేస్తూనే వుంటాడు. అతనిలోని గుణగణాలకు వివశుడై పనిచేయక తప్పదు. విద్యుక్తమైన కర్మను శ్రద్ధతో చేయాలి. కర్మచేయకుండా వుండడం కంటే ఏదో ఒక కర్మచేయడం మేలు. కర్మ చేయకుండా మానవుడు దేహాన్ని పోషించుకోలేడు. (కర్మమున బుట్టు జంతువు; కర్మమునన్ వృద్ధిబొందు కర్మమున జెడున్; గర్మమెజనులకు దేవత, సుఖదుఃఖములకు గారణ మధిపా!... భాగవతం 10-882 - జీవులు తమ తమ కర్మల చేతనే బుట్టి కర్మచేతనే వృద్ధిచెంది కర్మచేతనే లయిస్తారు. అందుచేత కర్మమే జనుకు దేవత, కర్మమే సుఖదుఃఖాలకు కారణం) అర్జునిడితో చెప్పిన కృష్ణుడి భగవద్గీత సారాంశం ఇప్పుడు బోధపడుతోంది. ఆ భావంతోనే పార్థుడిని చూశాను. సరిగ్గా అతడూ నన్నప్పుడే గమనిస్తున్నాడనిపించింది. కృష్ణుడి బోధలోని భావం ఇప్పుడు ధర్మజునికి అవసరమన్నట్లుగా వుందాచూపు.

నారదుడు కొనసాగిస్తున్నాడు. "పాండుకుమారా! ఈ భూమిని ఎందరు రాజులు పరిపాలించలేదు. వారిలో పరులను బాధించకుండా పరిపాలన చేసిన భూసురుడెవ్వరున్నారు? అంధకారబంధురమైన ఈ ప్రపంచాన్ని సర్వేశ్వరుడు జ్వలింపచేస్తున్నాడు. ఆయనే వర్ణాశ్రమ ధర్మాలను అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుతున్నాడు. యజ్ఞాలు, ధర్మానుసరణ అన్నింటికీ ఆ సర్వాంతర్యామి ఒక్కడే ప్రేరేపకుడు. అంతేగానీ, ఒక కార్యం పూర్తిచేయడంలో ఎవరిగొప్ప వుండదు. ఇంకెవరి బాధ్యత వుండదు. అన్నింటికీ ఆ పరమేశ్వరుడే

బాధత వహిస్తాడు. అందుకని చేసిన కర్మను చూచి వగచి, చేయాల్సిన కర్మను వదిలిపెట్టడం సరికాదు." (జాతస్యహి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ! తస్మాద పరిహార్యే ర్థే న త్వంశోభితు మర్హసి!!. భగవద్గీత 2-27 - పుట్టిన ప్రతివానికి మరణం తప్పదు. మరణించిన వానికి తిరిగి పుట్టక తప్పదు. తప్పనిసరైన ఈ అంశంలో శోకింప తగదు.) నారదుని మాటలను అందుకునే బాధ్యత తీసుకున్నాను. అన్నగారిని ఎలాగైనా నిర్ణయం మార్చుకునేలా చేయడమే మా కర్తవ్యం. అందుకు అవసరమైతే కొంచెం నిష్ఠూరంగా మాట్లాడినా దోషం లేదనే అనుకున్నాను. ఎందుకంతే అన్నగారి వియోగం అన్నిటికన్నా దుఃఖభరితమైనదని మాకు తెలుసు.

నేను మాట్లాడదామనుకుంటుండగానే అన్నగారే అందుకున్నారు.

"మునీంద్రా! మీరు చెప్పిన దానిలో అనృతం, త్రోసివేయవలసిన మాట ఒక్కటంటే ఒక్కటి కూడాలేదు. అది అందరికీ అనుభవపూర్వకమే. పరమాత్ముడి ఆజ్ఞను కాదనేటంతటి అవివేకిని కాను. అలాంటి సుస్సాహసానికి ఎన్నడూ పాల్గొనలేదు. పరంధాముడిక్కడే వున్నాడు కదా! ఆయన అభిప్రాయం కూడా తెలుసుకుందా"మని అంటున్న ధర్మజుని నవ్వుతూ చూచాడు శ్రీకృష్ణపరమాత్మ. ఆ నవ్వులో వేలవేల అర్థాలు కనబడ్డాయి. నీకు మాత్రం తెలియదా ధర్మజా అన్నట్టుగా వుందానవ్వు.

అదే సమయంలో "పై పై వస్తువుల్ని విసర్జించినంత మాత్రాన అది కర్మపరిత్యాగం కాగలదా? మాకు తండ్రివి, తల్లివి, హితుడవు, సోదరుడవు, ఆప్తుడవు, దైవం, ఆత్మీయుడవు అన్నీ నువ్వే"నని విజయుడన్నాడు ధర్మజుని చూస్తూ.

"ధర్మనిరతిలో, సత్యవాదంలో, వుచితానుచిత నివేదనలో నీకంటే అధికులెవరున్నారిక్కడ? అన్నీ తెలిసి, అందరిలో అధికుడవై వుండి కర్మనుంచి ఇలా పారిపోవాలనుకోవడం తగదు ధర్మజా! నీకు ఈ ధైర్యహీనధోరణి న్యాయమేనా? ***దైన్యం మనిషిని కర్తవ్యం నుంచి పారిపోయేలా చేస్తుంది. విచక్షణను పారదోలుతుంది. పొరపాటున తాకినా, కావాలని తాకినా అగ్నికాలకమానదు. అంతటితో ఆగదు. నిర్వంశానికీ వెనుకాడదు. అలాగని అగ్నిని తప్పుపడతామా?*** కౌరవ సోదరులకు సరిగ్గా ఇలాగే జరిగింది. నీ క్రోధాగ్నిజ్వాలల నుంచి తప్పించుకోలేక పరలోకం చేరుకున్నారు. 'చేసుకున్నవారికి చేసుకున్నంత' అన్నారు కదా!" అర్జునుడి మాటల్లో వాస్తవం తనకూ తెలుసన్నట్టు తలూపాడు అగ్రజుడు.

ఇప్పుడు అవకాశాన్ని ద్రౌపది తీసుకున్నది. "వస్త్రాపహరణ సమయంలో ఏకవస్త్రనని ఎంత చెప్పినా, కులకాంతనని కూడా కుటిల దుర్యోధనుడు వినిపించుకోలేదు. సొంతసోదరుడు వికర్ణుడు స్పష్టంగా చెప్పినా పట్టించుకోలేదు. పైపెచ్చు తన అంకపీఠాన్ని చూపాడు నాకు. అలాంటి ఘోరాపరాధిని తమ్ముడని చూడకుండా శిక్షించావు. ఇదే స్వకీయ ధర్మమంటే. తప్పు ఎవరు చేసినా శిక్షించడం రాజధర్మం. కౌరవుల వధతో నీ కుటుంబానికి, నీ వంశానికి ఘనకీర్తిని కట్టబెట్టావు. ఇందులో చింతించాల్సినదేమిటో అర్థంకావడం లేదు. పేదలు, సాధువులు, తాపసులు, ద్వాదశాదిత్యులకు నృపతి దండనీతి వల్లనే న్యాయం కలిగి ధర్మం చేకూరుతుంది. సముచిత దండనతో ప్రజాపాలన చూడకుండా భూపతులకు శమదమాది నీతివాక్యాలతో కూడిన బ్రాహ్మణ ధర్మం క్షత్రియులకు వుచితమా?" అని ప్రశ్నించింది.

**ధర్మజుని మోములో** కొంత మార్పు కానవచ్చింది. అప్పటివరకు చిరునవ్వుతో అందరి వాదప్రతివాదనలు వింటున్న పరమాత్ముడు కల్పించుకున్నాడు.

"ధర్మజా! సమస్త ధర్మరహస్యాలు తెలిసీ ఏమిటీ బేలతనం? 'రాజ్యంతే నరకం ధ్రువం' అన్నమాట మరచావా? రాజ్యకాంక్ష లేదని, భిక్షుక వృత్తిలో శేషజీవితాన్ని గడుపుతానని చెబుతున్నావు. ఆ పని కూడా ఏక చక్రపురంలో కర్తవ్యదీక్షతో కొనసాగించిన సంగతి

మరిచావా? ఏ సమయంలో ఏ కార్యం చేపట్టాలో అదే చేయాలి. అన్య ఆలోచనలు, అన్యకార్యంపై దృష్టి ధర్మసమ్మతం కాబోదు. శమం, దమం, త్యాగనిరతి.. అనేవి శాశ్వత పరబ్రహ్మానంద ప్రాప్తికి ఏకైక హేతువులని నీకు తెలియనిది కాదు. అభివృద్ధి, పతనం, సంయోగం, వియోగం, జన్మం, మృతి, సుఖం, దుఃఖమూ జీవకోటికి సహజగుణాలు. మిత్రులవల్ల సుఖం, శత్రువుల వల్ల దుఃఖం, ధనరాశులవల్ల భోగం అన్నిటికీ దైవప్రేరణే కారణంగా నిలుస్తుంది. దైవానుగ్రహం వుంటే అనుకున్నది సాధిస్తాడు. ప్రతికూలిస్తే విఫలమవుతాడు. విజయం సాధించినప్పుడు విర్రవీగడం, అపజయం కలిగినప్పుడు నీరసపడడం తగదు. మానవుడెంత శక్తిమంతుడైనా ప్రతికూల పరిస్థితుల్లో ఏమి సాధింపగలడు? కాబట్టి నీ మనస్సును స్వాధీనంలోకి తెచ్చుకో. నువ్వు చేయాల్సిన అసలైన కర్మను చేపట్టు. కర్మచేయడం వరకే నీవంతు. ఫలితం ఆశించకు" (కర్మణ్యే వాధికారస్తే మా ఫలేచు కదాచన! మా కర్మఫల హేతుర్భూర్మాతే స్తో స్త్వ కర్మణి!!.. భగవద్గీత 2-47 - నీకు కర్మ చేయడానికే అధికారం వున్నది. చేసిన కర్మఫలాన్ని ఆశించడంలో ఏనాడూ అధిఖారం వుండదు. కర్మఫలానికి నువ్వు కారణభూతుడవు కావు. అలాగని కర్మచేయడం మానరాదు) అని కృష్ణభగవానుడు చెప్పటంతో అప్పటికి ధర్మజుడు శాంతించాడు.

ఒకసారి తీసుకుని నిర్ణయం ఎంత కఠినమైనదైనా ధర్మపరిరక్షకులు వెనక్కి తీసుకోవడానికి ఎంతో ఆవేదన చెందుతారని నాకు అర్థమైంది. ఇంత కఠోర నిర్ణయం తీసుకోవటంలో ధర్మజుని మనస్సు ఎంత వ్యాకులత చెంది వుంటుందో అవగతమైంది. ధర్మరాజు వంటి ధర్మపరిపాలకులను వ్యాకులత కలిగించే సంఘటనలు చోటుచేసుకోవడం చివరకు మనోనిబ్బరాన్ని కూడా దెబ్బతీస్తుందని తెలుసుకున్నాను.

ఇంతవరకు నేను చూచిన ధర్మజుడు వేరు, ఇప్పుడు చూస్తున్న వ్యక్తి వేరని అనిపించింది. గతంలో ఆయనకు కొన్ని విషయాల్లో ఎంత నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఋజుమార్గాన్ని అనుసరించమని చెప్పేవాడేగానీ మా మాటల్ని పట్టించుకునేవాడు కాదు. చివరకు విరాటుని కొలువులో సైరంధ్రి రూపంలో వున్న ద్రౌపదిని చెరబట్టేందుకు ప్రయత్నించిన సమయంలో కీచకుడి దుర్మార్గాన్ని ఎదిరించేందుకు నేను ప్రయత్నించినప్పుడు ఇదే ధర్మరాజు వారించాడు. అజ్ఞాత వాస ముగింపు సమయంలో దుందుడుకు పనులు వద్దని వారించి, ఆ తరువాత నర్తనశాలలో కీచకుడిని వధించడం అంతా రహస్యంగా జరిగిపోవడాన్ని ఆయనే అభినందించాడు.

జన్మజన్మాంతరాల నుంచి కొనసాగుతున్న నిరంతర సంసారసాగర ప్రయాణాల్లో చిరస్థాయిగా నిలిచివారెవ్వరు? ఎవరు తమ తల్లిదండ్రుల్ని నిలుపుకోగలిగారు? భార్యాసుతులు, అన్నదమ్ములు, ఆత్మీయులతో కలవటం, విడిపోవటం మానవజనం రహస్యం తెలిసిన మహనీయుడికి ఏమిటి నిరాశావాదం. ఎందుకీ బేలతనం? తన తనువే అశాశ్వతమని తెలిసిన మహానుభావుడి బంధువులు మాత్రం శాశ్వతమనుకుంటాడా? మరణించిన వారికోసం దుఃఖించడం వల్ల మరణించిన వారెవ్వరైనా రాగలరా? ఆత్మ శాశ్వతమని, సమస్త ప్రాణకోటిలో వుండే ఆత్మ ఎప్పుడూ చంపబడదని, ఏ ప్రాణి కోసం విలపించడం తగదని అన్ని తెలిసిన పర ధర్మాచార పరాయణుడైనా ధర్మరాజుకి మాత్రం తెలియనివి కాదుకదా!

ఏ వ్యక్తిపైనైనా అతను పుట్టి పెరిగిన వాతావరణం ప్రభావం వుంటుంది. అన్నగారి సాహచర్యం వల్లనే మాకు పరమాత్ముని దివ్యస్వరూప సుగుణాలు అవగతమయ్యాయి. ఆయన ధర్మస్వరూపుడు కాబట్టే మమ్మల్నీ అలాగే తీర్చిదిద్దారు. ఎవరైనా మా పట్ల అనుచితంగా ప్రవర్తించినా పట్టించుకోవద్దని చిన్నప్పటి నుంచి మాకు బోధించారు. ఆయన ఒడిలో పెరిగిన మేము ఆయనంత ధర్మమూర్తులం కాకపోయినా కుటిలత్వాన్ని మాత్రం అలవరుచుకోలేదు. చిన్నతనం నుంచి ధర్మం వైపు నిలిచి నిస్సహాయులకు సాయం చేయటంలోను, పరోపకార ప్రవృత్తిని అన్నగారి నుంచే అలవరుచుకున్నాం. చివరివరకూ వాటిని విడిచిపెట్టి వుండలేము.

మా ప్రవర్తనే మమ్మల్ని పరమాత్ముడికి దగ్గర చేర్చింది. ప్రతి విషయంలోనూ మమ్మల్ని వెన్నంటి వుండి నడిపిస్తూ ఆపద్బంధువుగా ఆదుకున్నాడు వాసుదేవమూర్తి. ఆయన పేరు తలిస్తేనే తనువు కనీవినీ ఎరుగని రీతిలో జలదరిస్తోంది. మనస్సు కృతజ్ఞతాభావంతో

నిండిపోయింది. నా పరిస్థితి ఎదురుగానే వున్న పరమాత్ముడికి బహుశా తెలిసే వుంటుంది. ఆయన సర్వాంతర్యామి కదా! మన మనస్సులో జరిగే ఆకర్షణ వికర్షణాది భావాలు ఆమాత్రం గ్రహింపలేడా?

మేము ఆపదల్లో వున్నప్పుడు మమ్మల్ని ఆపదల సంద్రం నుంచి ఒడ్డుకు చేర్చే యత్నంలో ఒక్కసారి కూడా ఆయన వెనుకడుగు వేయలేదు. పాండవ పక్షపాతి అని ఎందరు నిందించినా వెనకాడలేదు. పైగా అదో బాధ్యతగా భావించాడు.

అరణ్యవాస సమయంలో అర్జునుడికి పాశుపతాస్త్రం పొందే తరుణోపాయం బోధించి అరణ్యవాసాన్ని మాకు ప్రయోజనకారిగా చేయగలిగాడు. రాజసూయయాగం ద్వారా కూడా మాకు కీర్తి కట్టబెట్టేందుకే ప్రోత్సహించినట్టుగా భావిస్తాను. లేకపోతే శిశుపాలవధ మా గడపలో జరిగేది కాదు. కృష్ణమాయ అందరికీ అవగతమయ్యేదికాదు. కృష్ణభక్తులకు ఎన్నటికీ చెరుపు కలగకుండా కాపాడుతానని ఆయన చెప్పకనే చెప్పాడు.

లక్క యింటిలో ఆశ్రయం కల్పించడం, దాన్ని దహనం చేసి మమ్మల్ని మట్టుబెట్టాలన్న కుట కౌరవులదైతే, సమయానికి హెచ్చరించి కాపాడిన ఘనత పరమాత్ముడిది. దాయాదులు అడుగడుగునా మమ్మల్ని మట్టుబెట్టేందుకు చేస్తున్న ప్రతి కుటిలయత్నం నుంచి కాపాడడమే నియమంగా పెట్టుకున్నాడు.

అదేమిటోగానీ, జన్మించినది లగాయితు కష్టాల సంద్రంలోనే పెరిగాం. ప్రతి అడుగు కష్టాల సుడిగుండాన్నే తలపించేది. ఒక్కక్షణం కూడా సంతోష సుఖాలు అనుభవించిన అదృష్టవంతులం కాము మేము.

మానవజన్మ ఎంత ఉత్కృష్టమైనదో, ధర్మమార్గంలో చరించటం ఎంత కఠినతరమైనదో మా జీవితాలే అందరికీ ఆదర్శాలవుతాయి. మానవుడు అదృష్టాన్ని నమ్మటం మానుకుని ధర్మాన్ని విశ్వసించడం ఎంత అవసరమో అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాం. కేవలం శక్తినే గాకుండా బుద్ధిని, వికాసాన్ని కూడా ప్రకటించాల్సిన అవసరం మాద్వారా సర్వులకూ అవగతమైనదని నేను భావిస్తున్నాను.

కౌంతేయ మధ్యముడిగా పూర్తిగా భుజబలంపై మాత్రమే కేంద్రీకృతం చేసే నన్ను కూడా మా సోదరుడి సాహచర్యం ధర్మానుసరణ మార్గాన్ని అనుసరించేలా చేసింది. ఆవేశపరుడైన నాకు బుద్ధిబల అవసరాన్ని పరమాత్ముడు చెప్పగలిగాడు.

మగధాధీనుడు జరాసంధుడి వధతో ప్రారంభమైన మా కర్తవ్య నిర్వహణ ఆ తరువాత నిరాటంకంగా కొనసాగింది. అన్నిటా మాకు విజయం చేకూర్చింది పరమాత్ముడే కావడం విశేషం. ప్రతికార్యంలోనూ ఆయన పరోక్షంగానో, ప్రత్యక్షంగానో జోక్యం చేసుకున్నాడు. (దేశేదేశే కళత్రాణి, దేశేదేశే కళత్రాణి, దేశేదేశే చ బాంధవాః తంతు దేశం నపశ్యామి, యత్ర భ్రాత సహోదర. వాల్మీకి రామాయణం: యుద్ధకాండ 102:12,13 - ఇతరులకు ద్రోహం చేయాలనుకునేవాడి కుటిల యత్నాలన్నీ నిష్ఫలమవుతాయి.)

జరాసంధ, బకాసుర, దుర్యోధనాది దుర్జనతల వ్యక్తుల చావు నా చేతుల్లోనే వుంటుందని తెలిసిన కృష్ణపరమాత్మ వారి పీడ వదిలించడానికి నన్నే ఎందుకు ఎంచుకున్నాడో తరువాత గాని అవగతం కాలేదు.

దుర్మార్గపు ఆలోచనలు దుర్మార్గులను ఎంత నైచ్యానికైనా పురిగొల్పుతాయి. కన్నూమిన్నూగానని అహంకారంతో దుర్మార్గులు తమ చావును తామే ఆహ్వానిస్తారు. తమ దుర్మార్గపు చేష్టలతో మంచి చెడులను విస్మరించి ప్రవర్తించటం ద్వారా తమ చావుకు తామే ముహూర్తం పెట్టుకుంటారు. ద్రౌపదీ వస్త్రాపహరణ సమయంలో తన ఉరులు చూపించి ఆమెను దుర్యోధనుడు ఆహ్వానించకపోతే నేను భీషణప్రతిజ్ఞ చేసివుండేవాడినా? దుర్యోధనుడి తనువెల్లా వజ్రఖచితమని నాకు తెలియదు కదా! అతడలా ఆహ్వానింపకపోతే ఉరులను విరగ్గొడతానని నేనెలా ప్రతిన సలిపేవాడిని?. అహంకారం అన్నివిధాల అనర్థదాయకమని తెలియని గాంధారీ సుతుడు తాను తీసుకున్న గోతిలో తానేపడ్డాడు. కాదు. కాదు. అలా పడేలా పరమాత్ముడే చేశాడు. అతని ఉరులు మినహా మిగిలిన శరీరమంతా వజ్రదృఢమని

బయటివారెవ్వరికీ తెలియదు, ఒక్క పరమేశ్వరుడికి తప్ప. అది తెలిసినవాడు కాబట్టే దుర్యోధనుడిని మట్టుబెట్టేందుకు ఈ అవకాశం నాకు కల్పించాడు. నా చేత అసంకల్పితంగా ప్రతిజ్ఞ చేసేలా దుర్యోధనుణ్ణి రెచ్చగొట్టి పురిగొల్పాడు. లేకపోతే నూరుగురు కౌరవుల్లో వికర్ణుడు తప్ప మిగిలిన వారంతా ప్రేక్షక పాత్ర వహిస్తారా? అధర్మాన్ని ఒక్క వికర్ణుడు మాత్రమే ప్రశ్నింపగలిగాడు. అయినా అతని మాటకు చెల్లుబాటు ఎక్కడ?

"ఇది ధర్మం కాదు. మద్యపానం, జూదం, వేట, అతిగా తినటం. ఈ నాలుగు దుర్వ్యసనాలు. ఈనాలుగు పనులు చేసిన మనిషి ధర్మంగా ప్రవర్తింపలేడు. ఇలాంటి సమయంలో చేసేపనులు ధర్మ సమ్మతం కాదు" అని వికర్ణుడు ఎంతగా వేదన చెందినా, పాకులాడినా వినిపించుకున్న వారెవరు? అయినా చెవిటివాడి ముందు శంఖం వూదితే ప్రయోజనమేముంటుంది? అధర్మవర్తనులకు ధర్మపన్నాలు ఏ విధంగా తలకెక్కుతాయి? కోయిల పాట కాకులకు కఠోరంగా వుంటుంది. హంసలను చూస్తే కొంగలు పరిహసిస్తాయి. ఇది సహజమే కదా! అలాగే సచ్చరిత్రులను చూచి నీచులు అవహేళన చేస్తారు.

దైవలీలలు ఎంత విచిత్రమైనవి? కాకపోతే నిరంతరం ఆగ్రహావేశాలు మినహా మరేమీ తెలియని నేను ఇలా శాంతియుతంగా సింహావలోకనం చేసుకోవడాని ఎందుకు ప్రయత్నిస్తాను? నేనొర్చిన నా కర్తవ్యనిర్వహణ గురించి ఇంత ప్రశాంతంగా చర్చించేందుకు ఎందుకు ప్రయత్నిస్తాను? అంతా భగవన్నిర్ణయమే. కాకపోతే అరివీర భయంకరుడు, శాంతమనే మాటను ఏనాడూ ప్రస్తావించని భీమసేనుడి నోట నేడు ఈ శాంతి ప్రవచనాలేమిటి? ఇది నిజంగా లోకానికి కనీవినీ ఎరుగని విడ్డూరం కాదా? మనలో నిద్రాణమై వున్న ఆత్మ అంతరంగిక ప్రేరణతో జాగృతి చెందినప్పుడు ఆధ్యాత్మికత వున్నత శిఖరాలను చేరుకుంటుందిట. దానితోనే ప్రపంచంలోనే అరుదైన వాటినీ సాధించవచ్చునట. సరిగ్గా ఇప్పుడు నా స్థితి ఇలాగే వుంది. ఆధ్యాత్మిక భావాలకు నాలో ప్రేరణ మొదలైందా? ఏమో చెప్పలేను. భీముడంటే శత్రువుల పాలిట యముడు; భీముడంటే అమిత బలపరాక్రమవంతుడు; కౌంతేయ మధ్యముడి పేరే శక్తిసంపన్నతకు చిహ్నం అలాంటి నేనా ఇంత ప్రశాంతతతో మీతో సంభాషిస్తోంది? అహా కాలమెంత గడుసుది? ఒక్కరోజులో మనిషిని ఎంతగా మార్చగలుగుతుంది.

నిన్నటి వాయునందనుడికి, నేటి భీమసేనుడి అంతరంగానికి మధ్య ఎంత అంతరం? ఇంతలో ఎంతమార్పు? ఇదెలా సమకూరింది?

"ఓ పరమాత్మా! ఎంతగొప్పవాడయ్యా నువ్వు? నిజంగా నీ అండదండలే లేకుంటే ఇన్ని మహత్కార్యాలు చేయగలిగేవాడినా? నువ్వు ప్రేరేపించకపోతే కీచకుడు మరణించేవాడా? బకాసురుడిని మట్టబెట్టగలిగేవాడినా? లేక దుర్యోధనుడు అంతమయ్యేవాడా? చేసింది నేనైనా ప్రేరణ నువ్వే కదా!"

"ఇటుచూడండి. ఇన్ని మహత్కార్యాలు చేయడానికి కారణమైనవాడు ఆ ప్రక్కన చిరునవ్వులు చిందిస్తూ నావైపు ఎలా చూస్తున్నాడో? నా ఆలోచనలు ఆయనకు అవగతమవుతున్నట్టున్నాయి. అందుకే ఆ చిరునవ్వులు ఆ ఓరచూపులు. పరమాత్మా! పరంధామా! నీ లీలలు ఎన్నని వర్ణింపగలం. ఎంతని ప్రస్తుతింపగలం? పాండవుల విజయసారధివి నిజంగా నువ్వేకదా! అవును మరి ధర్మసంస్థాపకుడివి నిజంగా!"

పుట్టిన ప్రతిజీవికి మరణం తథ్యం. సాక్షాత్తు భగవంతుడు కూడా దాన్ని తప్పింపలేడు. మనం చేసే పనులపై, మనం ఒనరించే కార్యాలపై మన మరణం ఆధారపడి వుంటుందనడానికి కౌరవులే ఉదాహరణగా నిలుస్తారు. దుర్మార్గపు ఆలోచనలతో నిత్యం దౌష్ట్యాలతో పాపకార్యాలనే ఆశ్రయిచారు కాబట్టే అంత ఘోరంగా మృత్యువు కబళించింది. వారివల్ల బ్రతికున్నంతకాలం ఇక్కట్లు పడిన వాళ్ళబాధ మొత్తం మరణించేముందు దుర్యోధనాది దుర్మార్గుల కళ్ళలో ప్రస్ఫుటంగా కనబడే వుంటుంది. వారు చేసిన దుష్కృత్యాలు ఆ

సమయంలో వాళ్ళకు అవగతమై వుంటాయి. చెడుపనుల ఫలితం వాళ్ళకు తెలిసే వుంటుంది, కాకపోతే చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్న చందంగా! ఆ సమయంలో కర్ణుడు, దుర్యోధనుడు, శకుని, దుశ్శాసనుడు అనుభవించిన బాధ పగవాడికి కూడా రాకూడదని పరమాత్ముడిని వేడుకుంటున్నాను. అది వారు కోరుకున్నదే అయినా భవిష్యత్తులో అలాంటి దుర్మార్గులకు చోటులేని లోకాన్ని సృష్టించమని పరమేశ్వరుడిని ప్రార్థిస్తున్నాను.

"ఓ కృష్ణా! వింటున్నావా నా ప్రార్థన? భీముడంతటి వాడిలో ఈ బేలత్వమేమిటనుకుంటున్నావా? దుర్మార్గుల భరతం పట్టడంతోనే భీముడి బాహుబల అవసరం తీరిందనుకో. ఇక ఇప్పుడు పరాక్రమంతో పనేమిటి? శత్రువుల కనుమరుగయ్యారు. మిగిలింది మానసిక, శారీరక గాయాలతో బంధుజనులు మాత్రమే. ఇపుడిక వారికి స్వాస్థ్యత చేకూర్చడమే నా ధర్మం. అందుకోసమే పూర్తి సమయాన్ని వినియోగిస్తాను. ఈ కార్యం పూర్తిచేయడంలో ఇక ముందు కూడా నాకు సహకరించమని ప్రార్థిస్తున్నాను. భీముడంటే శత్రువులకు సింహస్వప్నమే కాదు, ఆర్తులకు ఆనందం కల్పించేవాడని కూడా రుజువు చెయ్యి" ఇలా పరిపరివిధాల ఆలోచనలు నా భవిష్యత్తు మార్గాన్ని నిర్దేశించడంలో ముప్పిరిగొంటున్నాయి.

ఈ సమయంలో ఒక్కసారి ధర్మజుడు చెప్పిన ధర్మసూత్రం గుర్తుకొస్తోంది. "ఒక చెట్టుమీద రెండు పక్షులున్నాయి. అందులో ఒకటి ఆ చెట్టుకుండే ఫలాలను తింటూ వాటిలోని తీపిని, చేదును అనుభవిస్తోంది. రెండోపక్షి కళ్ళుమూసుకుని తనకేం పట్టనట్లుగా వుంది. అదే మన జీవితసారమట. మా అన్నగారు చెప్పినప్పుడు అందులోని సారం తెలియలేదుగానీ, ఈ సమయంలో సంపూర్ణంగా అవగతమవుతోంది. మానవ ఐహిక సుఖదుఃఖాల అనుభవానికి మొదటి పక్షి ఉదాహరణ అని, రెండో పక్షి తన అంతరంగంలోని ఆత్మశోధనలో నిమగ్నమై వుందని తెలుసుకున్నాను. ఐహిక బంధాల మాయలో పడి మానిషి అశాశ్వతాల కోసం ఎలా పరుగులు తీస్తున్నాడో అర్థమవుతోంది. ఇకనుంచి నా భవిష్యత్తును శాశ్వతానందం కోసమే వెచ్చిస్తాను. ఆశీర్వదించవా పరమాత్మా!"

నా ఆలోచనలు నాకే వింతగా అనిపిస్తున్నాయి.

సరే.. నా జీవిత సింహావలోకనంలో మరికొన్ని పుటలు తెరుద్దాం.

అసలు చిన్నప్పటి నుంచి నాది దుందుడుకు స్వభావమే.

నేను పుట్టిన కొద్దిరోజులకు అందరినీ దిగ్భ్రాంతి కలిగించే సంఘటన ఒకటి జరిగిందట. మా అమ్మ ఒకసారి నాకు చెప్పింది దీనిగురించి. నేను రోజుల బిడ్డగా వున్నప్పుడు మా తండ్రి పాండురాజుతో కలిసి అమ్మ గుడికి బయలుదేరింది. పొత్తిళ్ళలో వున్న నన్ను తీసుకుని వెళ్తుండగా గుడి సమీపంలోకి రాగానే పక్కనే వున్న పొదనుంచి పెద్దగా గాండ్రిస్తూ పులి అమ్మమీదకి దూకిందట. అమ్మ హడలిపోయి మైకంలోకి వెళ్ళిందట. అంతలో నాన్న తన చేతిలోని వింటినుంచి బాణాలు సంధించి పులిని హతమార్చారట. అమ్మ చేతిలో వున్న నేను అక్కడున్న పెద బండపై పడి నవ్వుతున్నానట. నేను పడిన బండ పిండి పిండి అయి వుండడం గమనించి అందరూ ఆశ్చర్యపోయారట. తేరుకున్న అమ్మ ఇంటికి రాగానే నాకు దృష్టి తీయడం పదేపదే నన్ను ముద్దుపెట్టుకోవడం భలే బెదిరిపోయిందిట.

చిన్నతనంలో మా దాయాదుల్ని ఎంత బెదరగొట్టేవాడినో లెక్కలేదు. మేము ఐదుగురం. దాయాదులు నూరుగురు. సంఖ్యాపరంగా ఎక్కువగా వున్నామనో, లేక కురుసార్వభౌముని కుమారులమన్న అహంభావమో తెలియదుగాని, మా ముందు కౌరవ కులోద్ధారకుడు దుర్యోధనుడు దర్పం ప్రదర్శించేవాడు. అది నాకసలు నచ్చేదికాదు. వాళ్ళు ఎక్కువేంటి?మేం తక్కువేంటి? అందుకే అందరిలోనూ వాళ్ళను ఏడిపించటమే పనిగా పెట్టుకున్నాను. ఆటల సమయంలో వాళ్ళు చెట్టెక్కి దాక్కుంటే వాళ్ళ వెనకనుంచి చెట్టుకొమ్మను పట్టుకుని ఊపేవాణ్ణి. అసలే బలశాలినేమో, పైగా బలంగా లాగేవాడినేమో. వాళ్ళంతా చెట్టునుంచి పూలూ, పళ్ళూ రాలినట్లుగా కిందపడిపోయేవారు. కాళ్ళూ చేతులూ కొట్టుకుపోయి ఏడుస్తున్న వాళ్ళను చూచి పెద్దగా నవ్వేవాడిని. దుర్యోధనుడు ఉక్రోషంతో చూచేవాడు.

పదమంది కౌరవ సోదరుల కాళ్ళు పట్టుకుని గబుక్కున లాగి ఈడ్చుకెళ్ళేవాడిని. దాంతో వాళ్ళంతా లబోదిబో ఇలాంటి దుందుడుకు పనులతో వాళ్ళను ఎంతగా బెదరగొట్టానో చెప్పనక్కర్లేదు.

"చూడు ధర్మజా! తమ్ముళ్ళను కనిపెట్టుకుని వుండటం పెద్దవాడిగా నీ బాధ్యత. వారికెలాంటి ఆపదలు రాకుండా చూడటం నీ కర్తవ్యం. నీ తమ్ముళ్ళు నలుగురిలో భీమసేనుడిపై మరికాస్త ఎక్కువ దృష్టిపెట్టు. అసలే దుందుడుకువాడు. కోరికోరి ఆపదల్లో చొరబడతాడు. ఒకసారి అనుకున్నాడా ఇక అతడిని వెనక్కి తీసుకురావటం ఎవరివల్లాకాదు. మిగిలిన వారు నిన్నుకాదని ఏమీచేయరు." ఇలా అమ్మ ధర్మజుడికి కర్తవ్యబోధ చేస్తుండేదట. అమ్మమాట జవదాటని అగ్రజుడు ఆమె చెప్పినట్లే నన్నంటే వుండేవాడు. దుందుడుకు పనులు చూచి నన్ను మందలించేవాడు.

నామీద కక్షతీర్చుకోవాలంటే ధర్మజుడుండగా కుదిరేపని కాదనుకున్నాడు దుర్యోధనుడు. నిరంతరం కవచంలా కాపాడే ధర్మజుడు నాకు రక్షకుడిగా వుండటం దుర్యోధనుడికి కొరకరాని కొయ్యగా తయారైంది. నన్ను చూస్తేనే కౌరవులు భయంతో పరుగులు తీస్తున్నారాయె. నా నుంచి తమ్ముళ్ళను కాపాడుకునేదెలా? నాకు గుణపాఠం చెప్పేదెలా? అని ఆలోచించి పథకాలు పన్నటం మొదలెట్టాడు.

ఒకరోజు భాగీరథి ఒడ్డున కుటీరాలు ఏర్పాటు చేయించాడు. మమ్మల్ని కలుపుకుని నదిలో ఈతలు, కేరింతలు కొట్టించాడు. ఉత్సాహంతో నదిలో ఆటలాడి అలసిన మాకు కుటీరంలో సేదతీరే ఏర్పాట్లు చేశాడు. అలా సేద తీర్చుకుంటూ నిద్రాదేవిని ఆశ్రయించిన నన్ను పదిమందితో ఎత్తి నదిలో పడేయించాడు. కదలకుండా కాళ్ళూచేతులు కట్టేయించాడు. అసలే వాయుపుత్రుడనాయె. ఆపై ఏనుగు బలమాయె. నీళ్ళు తగలగానే నిద్రమత్తు వదిలింది. కళ్ళుతెరిచి చూస్తే పరిస్థితి అర్థమైంది. ఒక్క పట్టున కట్లు తెంచుకోవడం, ఒడ్డుకు చేరుకోవడం అంతా క్షణాల్లో జరిగిపోయింది.

అప్పుడు నాపై మొదలైన కక్ష పెద్దవాళ్ళమైనా దుర్యోధనుడికి తగ్గలేదు.

నా బాల్య చేష్టల ప్రభావం అతనిపై అంత బలీయంగా పడుతుందని నేనూహించలేదు. చిన్నతనంలో చేసిన దుందుడుకు పనుల్ని సహజంగా ఎవరైనా బాల్యచేష్టలుగానే పరిగణిస్తారు. కానీ దుర్యోధనాదులు మాత్రం వాటిని మరిచిపోలేదు. దుష్టులతో మైత్రితెచ్చే అపాయాలు అప్పటికి కానీ నాకు తెలియలేదు.

పరుగుపందెం, లక్ష్యాన్ని ఛేదించటం, మృష్టాన్న భోజనం ఏదైనా సరే నాతో పోటీపడి గెలవగలిగేవాళ్ళు లేరు. బహుశా మేమంటే (పాండవులం) మత్సరం పెరగడానికి ఇదే తొలికారణమని అనుకుంటున్నాను. చిన్నపిల్లవాడి దుడుకు పనుల పట్ల మత్సరం పెంచుకోవటం మూర్ఖత్వం కాకపోతే మరేమనుకోవాలి?

తండ్రిలేని పిల్లలమనో లేక మాలో కనిపించే ధర్మనిరతి, పెద్దల్ని గౌరవించే లక్షణం. వంటి వాటివల్లో తెలియదుగానీ, కురువృద్ధుడు, తాత భీష్ముడు, గురువు ద్రోణాచార్యుడు, హితాభిలాషి విదురుడు మేమంటే అత్యంత అభిమానాన్ని చూపేవారు. కౌరవుల మత్సరానికిదో కారణం కావచ్చు.

ఒకరోజు గాఢనిద్రలో వున్న నన్ను విషనాగులతో కౌరవ సోదరులు కురిపించారు. భగవంతుని దయవల్ల ఆ అపాయం నుంచి బయటపడ్డాను. విందుభోజనం పేరుతో విషాన్నాన్ని పెట్టినా లొట్టలేసుకుంటూ తిన్నాను. అదీ నన్నేమీ చేయలేకపోయింది. అదృష్టవంతులకు ఆపదలు కూడా మంచినే చేస్తాయి. పరమాత్ముని ఆశీస్సులు, ఆశీర్వాదం వుండటం మా అదృష్టమే.

ఆ విధంగా భగవంతుని పట్ల మాకు చిన్నతనం నుంచి విశ్వాసం పెరుగుతూ వచ్చింది. అదే మాకు రక్షయింది. మా భక్తితత్పరతే కృష్ణ పరమాత్మను మరింత దగ్గరకు చేర్చి సాన్నిహిత్యం పెంచగలిగిందని భావిస్తున్నాను.

భగవానుడు సజ్జనుల పక్షపాతిగానే వుంటాడు, దుర్జనుల దరికెన్నటికీ చేరడు. ధర్మరక్షకులెవరో, ధర్మభక్షకులెవరో ఆయన తేలికగా గ్రహింపగలడు. ధర్మరక్షకుల కోసం ఆయనెప్పుడూ వెతుకుతూనే వుంటాడు. భక్తులను తన దగ్గరికి పిలిపించుకోడు. తానే భక్తులను వెతుక్కుంటూ వెళ్తాడు.

అన్నగారికి నా శక్తి సామర్థ్యాలపై చిన్నప్పటి నుంచీ నమ్మకం వుండేది.

అమ్మకూ అంతే. కృష్ణపరమాత్మ సూచన మేరకు ఏకచక్రపురంలో భిక్షాటన ద్వారా మేము సంపాదించిన భోజనాన్ని ఐదుభాగాలు చేసి నాలుగు భాగాలను నాకు ఇచ్చి, మిగిలిన ఆ ఒక్క భాగంతోనే తాను, నలుగురు గడిపేవారు. అలాచేస్తే శక్తిని చాటాల్సిన సమయంలో నా పరాక్రమం ఎంతో ఉపయోగపడుతుందని శ్రీకృష్ణుడి బోధ. అప్పటినుంచి నా భోజనం విషయంలో ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతూనే వున్నాయి.

మా సోదరులకు, కౌరవ సోదరులకు గురువుగా ద్రోణాచార్యులు సకల విద్యల్లో శిక్షణనిచ్చారు. మా అందరిలోనూ అర్జునుడి సమర్థత గుర్తించి ప్రియశిష్యునిగా స్వీకరించి ప్రత్యేక శిక్షణనివ్వడం కుటిల కౌరవులకు కంటకప్రాయమైంది. దానికితోడు శిక్షణకాలం పూర్తయి అస్త్రవిద్యాప్రదర్శన సమయంలో పాండవుల ప్రతిబ వారిని మరింత దౌష్ట్యానికి పాల్పడేలా చేసింది. ఇప్పుడు వారికి పాండవులంటే శత్రువులుగానే కనబడుతున్నారు. సోదరులుగా కాకపోయినా కనీసం స్నేహితులుగా కూడా ఎన్నడూ భావింపలేదు. నాకు సరిజోడుగా తానున్నానని మురిసిపోయే దుర్యోధనుడు పార్థునికి సరైన ఉజ్జీకోసం వెతికేవాడు.

సరిగ్గా అలాంటి సమయంలోనే అస్త్రవిద్యా ప్రదర్శన వారికో అవకాశాన్నిచ్చింది. పరీక్షలో పాల్గొనేందుకు రాజ్యాధికారం లేని కర్ణుడికి అర్హత లభింపలేదు. దాంతో అక్కడికక్కడే అతడిని అంగరాజుగా పట్టాభిషేకాన్ని కౌరవ సమ్రాట్టు అంబికేయుడు జరిపించాడు. దాంతో మా కీర్తి నలుదెసలా వ్యాపించింది. ఎక్కడకు వెళ్ళినా అశేష స్వాగత సత్కారాలే. పొగిడేవారే. ఫలితం దుర్యోధనుడికి బెంగపట్టుకుంది. తన తండ్రికి దృష్టిదోషం కారణంగా పినతండ్రి పాండురాజు రాజ్యాన్ని పరిపాలించాడు. పినతండ్రి మరణం తరువాత రాజ్యభారాన్ని మోయటానికి, ప్రతిజ్ఞ ఉపసంహరించుకోవడానికి కురువృద్ధుడు భీష్ముడు ససేమిరా అనడంతో సింహాసనాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో ధృతరాష్ట్రుడే అధిష్టించాల్సి వచ్చింది. ఇప్పుడు ధృతరాష్ట్రుడి కుమారులకంటే పాండవాగ్రజుడు ధర్మరాజు పెద్దవాడు కావటంతో రాజ్యభారం పాండవులకు లభించే అవకాశమున్నది. కురుపెద్దల సలహా మేరకు దుర్యోధనుడి కంటే కూడా పెద్దవాడు అయిన కారణంగా ధర్మజుడే యువరాజుగా పట్టాభిషిక్తుడు అయ్యాడు. ధర్మరాజు యువరాజయ్యాడు. నేను విక్రముడయ్యాను. సోదరుడు అర్జునుడిని అందరూ మహావీరునిగా కీర్తిస్తున్నారు. దుర్యోధనుడిలో మత్సరం పుట్టింది. కౌరవుల అధర్మప్రవర్తనకు అంకురార్పణ జరిగింది.

నెమ్మదిగా తండ్రి దగ్గరికి వెళ్ళాడు. ఒంటరిగా వున్న సమయంలో కలవమని శకుని, కర్ణ సలహా మేరకు ఒంటరిగా దృతరాష్ట్రుడిని కలిసి చెవులు కొరికాడు. "తండ్రీ! కథ మళ్ళీ మొదటికి వస్తోంది. నీ కుమారుడిగా నీ అంతరం రాజ్యాన్ని అధిష్టించాల్సిన వాడను నేను. కురువృద్ధుడు భీష్ముడు, గురువు ద్రోణాచార్యుడు, ధర్మనిరతుడిగా కీర్తింపబడుతున్న విదురుడు మాయోపాయంతో ధర్మరాజును యువరాజుగా చేయించారు. వారిమాట కాదనలేక నువ్వు మౌనంగా వున్నావు. ఇవాళ యువరాజైన ధర్మజుడినే తరువాత చక్రవర్తిగా ప్రకటిస్తారు. అంటే బ్రతికి వున్నంతకాలం దాయాదులమైన మేము వారికి సేవకులుగా వుండిపోవలసిందేనా?" అంటున్న కుమారుడిని చేతిని తీసుకున్నాడు అంధరాజు.

"దీనికి తరుణోపాయంగా నాకో మార్గం కనిపిస్తోంది. ఏదో మిషపై పాండవుల్ని వారుణావతానికి పంపించు. అక్కడి నుంచి వారు తిరిగిరాని విధంగా నేను చూస్తాన"ని చెప్పడంతో తలుపాడు రాజు.

ధృతరాష్ట్రుని సూచన మేరకు వారుణావత నగరికి మేం బయలుదేరాం. అక్కడ మాకు విడిదిగా కేటాయించిన ఇంటిని చూచి ధర్మజునికి సందేహం తలెత్తింది. ఇంటిని తరచి తరచి చూచిన ధర్మజుడు నన్ను పిలిచి, "చూడగా ఇదేదో మాయలా వుంది. ఇల్లంతా లాక్షాపరిమళం వెదజల్లుతోంది. ఇందులో తప్పకుండా కుటిల కౌరవుల పన్నాగం వున్నట్టు తోస్తోంది. హఠాత్తుగా దీనికి అగ్నిప్రమాదం సంభవిస్తే? అందుకే ముందుగా మనల్ని విదురుడు హెచ్చరించి పంపాడు" ధర్మరాజు అనుమానంలో నిజం కనిపించింది నాకు.

"భీమా! ఇక మా రక్షణభారాన్ని పూర్తిగా నువ్వే తీసుకోవాలి. నీ శక్తిపైనే మా భద్రత ఆధారపడివుంది. జాగ్రత్త."

అన్న అనుజ్ఞ తీసుకుని రహస్యంగా భవనం లోపలి నుండి బిలమార్గం ప్రారంభించాను. ఈ సంగతి మాకు తప్ప మరోకంటికి తెలియకుండా జాగ్రత్తపడ్డాం. నలుగురు సోదరులు, తల్లిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ బిలమార్గాన్ని పూర్తిచేశాను.

ఈ సంగతి అన్నకు చెప్పి ఆయన ఆశీస్సులు అందుకున్నాను. ఆయన ముఖంలో కాంతిరేఖలు. తన తమ్ముడు మహాపరాక్రమవంతుడిని ఆయన ప్రశంసించాడు. అనంతరం కృష్ణ చతుర్దశినాడు నా పథకాన్ని అమలు చేస్తానని అన్నగారితో చెప్పి అనుమతి తీసుకుని అమలు చేశాను. లాక్షాగృహాన్ని నేనే అంటించాను. మా కుటుంబం మొత్తాన్ని మూపున వేసుకుని సొరంగ మార్గం ద్వారా అడవిలోకి చేర్చాను. అక్కడ అడవిలో కటిక నేలపై నిద్రిస్తున్న వారిని చూచి నా హృదయం మూగవోయింది.

"ధరణీతలాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలగల సమర్థుడు, ధర్మాన్ని తుచ తప్పకుండా అనుసరిస్తాడని ప్రజాదరణగల చక్రవర్తి సమానుడు ధర్మజుడు సాధారన మనిషిలా కటికరాతి నేలపై చేతినే తలగడ చేసుకుని నిద్రిస్తున్న వైనం నన్ను కలచివేసింది. విధి వైపరీత్యం కాకపోతే మరేమిటి? ఇక కుంతి వాసుదేవుని తండ్రి వసుదేవుని సహోదరి, కుంతీభోజుని కుమార్తె, పాండవ కులానికి అలంకారప్రాయమై ప్రకాశించిన పాండునందనుని పట్టమహిషి, పరమ ధర్మాత్ములు, అరివీర భయంకరులని వినుతికెక్కిన కుమారులకు వీరమాత, పరిశుభ్రమైన హంసతూలికాతల్పంపై పరుండవలసిన పడతి... కాలం కలిసి రాకపోవడంతో ఇలా అప్రక్రమ పరాక్రమవంతులైన కుమారులతో కటిక నేలపై నిద్రిస్తున్నది. ఎంతటివారికి ఎంతటి దుస్థితి పట్టింది? నా కన్నుల నీరు ఆగడంలేదు. తల్లీ సహోదరులనీ స్థితికి తెచ్చిన వారిపై పగతీర్చుకోవాలన్న పట్టుదల బలపడింది.

" ధృతరాష్ట్రుడు దుష్టాత్ముడు. పుత్రులతో కలసి దుశ్చర్యకు ఒడిగట్టాడు. కావాలనే మమ్మల్నిక్కడకు పంపాడు. అంతటితో శాంతింపక మమ్మల్ని సజీవ దహనం చేయాలని పన్నాగం పన్నాడు. ఆహా! పెద్ద తండ్రివై వుండి తమ్ముడి పిల్లలను ప్రేమతో సాకాల్సినవాడవు. ఇలా మట్టుబెట్టి బాపుకునేదేముంటుందో అర్థంచేసుకో. ఈ పాపం నిన్ను వూరికే వదలదు. అన్నెం పున్నెం ఎరుగని అపర ధర్మావతారులనిలా ఇక్కట్ల పాల్జేసినందుకు ఫలితం అనుభవిస్తావు. నీ కుమారులను ఊరికే విడిచిపెట్టను..." నా మనస్సు పరిపరివిధాల పరితపిస్తున్నది.

కానీ విధిని తప్పించటం ఎవరివల్లా కాదుకదా! కాలం కలిసి రానప్పుడు తలవంచక తప్పదు. ధర్మవర్తనులను ఇక్కట్లు తాత్కాలికమేగానీ శాశ్వతంగా అంటిపెట్టుకుని వుండవని నన్ను నేను ఓదార్చుకున్నాను.

మనిషి ఆశాజీవి. మాకూ మంచిరోజులొస్తాయి. అప్పటివరకు వేచి చూడక తప్పదు. అంతా దైవానిదే భారం అనుకున్నాను.

**అల్లుడని** తెలిసిన తరువాత విరోధితో ఎప్పుడూ కలిసిమెలిసి వుండరాదన్నది తొలిపాఠంగా తెలుసుకున్నాను. చెట్టూచేమతో పచ్చదనం, పరిమళాలతో విలసిల్లే మహారణ్యాన్ని దహించివేసేందుకు ఒక్క అగ్నికణం సరిపోతుంది కదా?

శకుని మాయాద్యూత పరిణామానంతరం మేము అరణ్యవాసానికి బయలుదేరినప్పుడు మాతో పన్నాలుగువేల రథాల్లో బంధుమిత్రులు, మమ్మల్ని అభిమానించే రాజులు వెన్నంటి వచ్చారు. వారంతా మాకు వీడ్కోలు పలుకుతారని ధర్మజుడితో పాటు మిగిలిన

నలుగురు అన్నదమ్ములం భావించాం. రోజులు గడుస్తున్నా వారిలో మమ్మల్ని వదిలే ఆలోచనలు కనిపించకపోయేసరికి ధర్మరాజు మనస్సులో వ్యాకులత మొదలైంది.

"అధికారంలో వున్నప్పుడు ఎంతమందికైనా ఆతిధ్యం ఇవ్వడానికి ఇబ్బంది పడేవాళ్ళంకాదు. రోజుకు పదివేలమంది బ్రాహ్మణులు భోజనం చేసిన తరువాత శేషపదార్థాలను ప్రసాదంగా స్వీకరించేవాళ్ళం. మరిప్పుడు సకల రాజలాంఛనాలను వదులుకుని కట్టుబట్టలతో అరణ్యవాసానికి వచ్చాం. అడవుల్లో దొరికే కందములాల్ని స్వీకరిస్తూ గడపటం మినహా మరో అవకాశం లేనప్పుడు ఇంతమందిని రాజోచిత సత్కారాలు, ఆహారాన్ని వదులుకుని కందములాలతో సేవిస్తామనటం ఎంత అగౌరవసూచకం? ఒకవేళ వారందుకు అంగీకరించినా మనమెలా సమ్మతిస్తాం?" ధర్మజుని మనస్సు పరిపరివిధాలా ఆలోచిస్తోంది.

చివరకు వాళ్ళందరికి నచ్చచెప్పి వెనక్కి తిరిగి పంపడమే మార్గంగా భావించాం. అదే విషయాన్ని వారితో ప్రస్తావించాడు పాండవాగ్రజుడు.

"ఓ రాజ శ్రేష్ఠులారా! మా మీద మీకున్న అభిమానానికి ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియటంలేదు. మీరు చూపిన అభిమానానికి, వాత్సల్యానికి ఐదుగురు సోదరులమెంతో ఆనందిస్తున్నాం. మేం కందమూలాలతో కాలం గడపాలని నిశ్చయించుకునే అరణ్యవాసానికి తరలివచ్చాం. మాతోపాటు మిమ్మల్నీ అలాగే గడపమనటం ధర్మసమ్మతం కాదు. అందువల్ల మీరంతా తిరిగి హస్తినాపురానికి మరలి పోవలసినదిగా మనవి" అని చెప్పటంతో అక్కడ కనిపించిన దృశ్యం మాకు నోటమాటరాని స్థితి కలిగించింది.

ధర్మజుని మాట పూర్తయిన వెంటనే రాజుల కళ్ళవెంట నీళ్ళు కనిపించాయి. వారంతా డగ్గుత్తిక గొంతుతో "మా ఆహారపానీయాలే మీతో గడిపేందుకు సమస్య అనుకుంటే అందుకు చింతించవలసిన అవసరం లేదు. ఎందుకంటే మీరు అరణ్యవాసానికి ఎప్పుడైతే సిద్ధపడ్డారో అప్పుడే మీతోనే ఈ పదమూడేళ్ళు గడపాలని మేమూ స్థిరనిశ్చయులయ్యాం. అందుకే మాకు అవసరమైన సంభారాలతోనే మీ వెంట వున్నాం. మా గురించి దిగులు వద్దు. దయచేసి మమ్మల్ని వెళ్ళమని చెప్పొద్దు. మా భోజన ఏర్పాట్లు మేమే చేసుకుంటాం. అవసరమైతే మీకూ ఏర్పాట్లు చేస్తా"మనటంతో మా నోటమాటరాలేదు. వారి అభిమానానికి మా స్వరాలు బొంగురు పోయాయి.

"మాతో వనవాసం చేయాల్సిన అవసరం మీకేముంటుంది? వనవాసకాలంలో మా ఏర్పాట్లను మీచేత చేయించుకోవడాన్ని లోకం హర్షింపదు. పైగా ఇక్కడ కూడా రాజసేవలు చేయించుకుంటూ వుంటే ఇక వనవాసమెందుకు? వనవాస నియమాలెందుకు? కౌరవులు మమ్మల్ని మరింత తప్పుపడతా"రని ధర్మజుడు ఎంతగా నచ్చచెపేందుకు యత్నించినా వారు పట్టువీడలేదు.

ఈ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో తెలియక సతమతమవుతున్న సమయంలో ఎవరో పిలిచినట్టు శౌనక మహర్షి వచ్చారు. దైవమే ఆయన రూపంలో దర్శనమిచ్చిందని భావించి ఈ విషయాన్ని ఆయన ముందుంచాం.

"ఈ స్థితిలో మీరే మాకు తరుణోపాయం చెప్పండి మహర్షీ! ఎన్నో క్రూర జంతువులకు ఆలవాలమైన ఈ అడవిలో వీరందరికీ రక్షణ ఏర్పాట్లు ఎలా చేయగలం? వీరేమో మమ్మల్ని వదిలి వెళ్ళేందుకు ఒప్పుకోవటంలేదు" అని ధర్మనందనుడు మహర్షి వైపు చూచాడు.

"ధర్మపాలకా! పాండవ శ్రేష్టా! ధర్మజా! నీకు తెలియని నియమాలు, సంప్రదాయాలు లేవు. అతిథి అభ్యాగతులను గౌరవించటంలో నిన్ను మించిన వారు మరొకరు లేరు. ఇప్పుడు నిన్ను కలిచివేస్తున్న సమస్య చాలాచిన్నది. దీనికోసం ఇంత వ్యాకులత చెందాల్సిన అవసరం కనిపించటంలేదు. అడుగడుగునా ఎదురయ్యే దుఃఖం, ఆపదల్ని చూసి మూర్ఖుడే భయపడతాడు. వాటికి అతడు బెదిరిపోవాలిగానీ, నీలాంటి ధర్మనిరతుడు ఇటువంటి వాటిని చూచి బెదిరిపోరు. వ్యాకులత అసలు చెందరు. వ్యాధి, శ్రమ, అనిష్ట వస్తుసంబంధం, ఇష్టవస్తు వియోగం - ఈ నాలుగూ శారీరక దుఃఖానికి ప్రధానమైనవి. అగ్నిజ్వాలను అదుపు చేయాలంటే నీటిసాయం

ఎలా అవసరమో అలాగే, వివేకం వల్ల మాత్రమే మానసిక దుఃఖాలు ఉపమిస్తాయి. విషయాసక్తే సమస్త మానసిక రుగ్మతలకు కారణమవుతోంది." మహర్షి మాటల్ని అక్కడున్న వారంతా ఆసక్తిగా వింటున్నారు. అందులోని వాస్తవాన్ని గ్రహించేందుకు ప్రయత్నిస్తున్నారని చూచిన వారందరికీ అవగతమవుతోంది.

మహర్షి తన మాటల్ని కొనసాగిస్తూ "ఈ విపరీతాసక్తే ధనంపై వ్యామోహం, మమకారం పెరగడానికి కారణమవుతోంది. ఈ వ్యామోహం, మమకారాన్ని విడనాడి పరమాత్మపట్ల విశ్వాసం చూపేవారిని ఎలాంటి మానసిక రుగ్మతలు అంటవు. తామరాకు మీద నీటిబొట్టు ఎలా నిలవదో ఇది తెలుసుకున్న వారిలో విపరీతాశ కనబడదు. మోహం వల్ల రాగం, దానివల్ల కామం, క్రోధం, తృష్ణ పుట్టుకొస్తాయి. అవే సమస్త పాతకాలకు కారణమవుతాయి. అందుకోసమే దుఃఖాలు కాచుక్కూర్చుంటాయి. తృష్ణ తొలగించుకుంటే మానసిక ఆనందంతో నిత్యసంతుష్టులై వుండవచ్చు" మహర్షి బోధతో ధర్మరాజు ముఖంలో సంతోషచ్ఛాయలు కనిపిస్తున్నాయి.

"చెట్టుతొర్రలో అగ్నికణం పుడితే ఆశ్రయమిచ్చే వృక్షాన్నే దహించి వేస్తుంది. ధనాశాపీడితులు కూడా ఇదే మాదిరి నశిస్తారు. విపరీత ధనకాంక్ష ఎవరికీ సుఖాన్నివ్వదు. మృత్యుభీతి, పరమాత్మ పట్ల విశ్వాసం లేకపోవడం మనిషిని అనేక అపమార్గాల్లో పయనించేలా చేస్తోంది. ఆకాశంలో ఎగిరే పక్షులు, నీటిలో సంచరించే జలచరాలు, భూమిపై తిరిగే క్రూరమృగాలు ఆయా ప్రాంతాల్లో తమకు చిక్కిన జంతువునో, మరో ప్రాణినో పట్టుకుని ఆకలి తీర్చుకుంటాయి. అది మృగధర్మం. ధనవంతుడికి మరోరకమైన అనుభవం ఎదురవుతుంది. ధనం అధికమైతే లోభత్వం, గర్వం, అహంకారం, భీతి, ఆందోళన సహజం. అన్ని అనర్థాలకు కారణం అర్థమే (ధనమే)! మాయావ్యామోహాన్ని, మనిషిని అపమార్గాలు పట్టించేది ఈ ధనవ్యామోహమే. ధనార్జన వ్యామోహం లేనివాడే అదృష్టవంతుడు. ఎందుకిలా దురదృష్టాన్ని వెతుక్కుంటూ మనిషి పరుగులు తీస్తున్నాడో తెలుసుకోవడం అసాధ్యం. యవ్వనం, వైభవం, ఐశ్వర్యం క్షణభంగురాలన్న వాస్తవాన్ని గ్రహించాలి. కాబట్టి ధర్మజా! అనవసర శంకలు పెట్టుకోవద్దు. అన్నిటికీ పరమాత్ముడే దారి చూపుతాడు" మహర్షి మాటలకు ఆలోచనలో పడ్డాడు పాండవ కులశ్రేష్ఠుడు.

"కానీ, మహర్షీ! ఆశ్రమధర్మాల్లో గృహస్థాశ్రమమే శ్రేష్ఠమని చెబుతారు. కేవలం మనకోసమే బ్రతకకూడదు. ఇతరులను పట్టించుకోవాలి. యజ్ఞయాగాదులు కోసమే తప్ప మరోకారణంతో పశుహింసకూడదు. సమస్త ప్రాణులూ సంతృప్తి జీవనం గడిపేలా గృహస్థుడు వ్యవహరించాలి." ఈ సమయంలో తన సందేహాన్ని, అసలు సమస్యను మహర్షికి మరోసారి విన్నవించుకున్నాడు ధర్మరాజు.

"మహారాజా! అనవసర సంకోచాలతో సమయాన్ని వృథాచేసుకోవడం, సంశయాల బారినపడడం నీవంటి ధర్మమూర్తులకు తగదు. ఇంద్రియాలను స్వాధీనం చేసుకున్నామని, తమవంటి సుగుణ సంపన్నులు మరొకరు లేరని ఎంతగా విర్రవీగినా భోగలాలస అంటిపెట్టుకునే వుంటుంది. ఎంతటి వివేకవంతుడైనా మోహంలో పడకతప్పదు. ఇందుకు పూర్వజన్మ సుకృతం, పూర్వజన్మ వాసనలే కారణం. వాటిపై ఆధారాపడే వ్యామోహం కమ్ముతుంది. ఆయా విషయాలను ప్రేరేపిస్తుంది. ఈ భోగలాలస అనేది దహించే జ్వాలలాంటిది. ఈ జ్వాలే శలభాలను ఆకర్షించిన విధంగా మనిషినీ ఆకర్షిస్తుంది. యాతనలమయం చేస్తుంది. పురాకృతకర్మే కారణం కావటంతో ఆత్మజ్ఞానాన్ని విస్మరించి అజ్ఞానమనే అంధకారంలో సూక్ష్మాతిసూక్ష్మమైన కీటకం నుంచి మహా తెలివిగలవాడినని విర్రవీగే మనిషి వరకు సంసార చక్రంలో పరిభ్రమించక తప్పటంలేదు. అదే సృష్టి రహస్యమని తెలుసుకోలేక సతమతమవుతున్నాం."

"కానీ, అష్టాంగ మార్గాలనబడే సంకల్పత్యాగం, ఇంద్రియ నిగ్రహం, అహింస, గురుసేవ, ఆహారనియమం, వేదాధ్యయనం, కర్మసన్యాసం, చిత్తవిరోధం.. ఈ సంసారసాగరాన్ని దాటించే సాధనాల"ని ఉపదేశించిన అనంతరం మహర్షి అక్కడున్న రాజన్యులను, సామాన్యులను ఉచితరీతిన సముదాయించి కరినగరికి తిరిగివెళ్ళేలా అంగీకరింపచేశారు.

ఇలా అరణ్యవాసం మొదలై మూడురోజులు గడిచింది.

అరణ్యంలో పాండవులెంతగా ఇక్కట్ల పాలవుతున్నారోనని మా పెదతండ్రి ధృతరాష్ట్రుడు వ్యాకులత పడ్డాడట. విదురుని రావించి ఈ అంశాన్ని ప్రస్తావించాడట. విదురుడు "రాజా! ఇప్పటికైనా మించిపోయింది లేదు. నీ కుమారుడు చేస్తున్న అకృత్యాలను అడ్డుకోకపోతే నీ వంశమే నిర్వ్యంశం కాకతప్పదు. ఇప్పుడైనా వివేకంతో బుద్ధిమంతులైన పాండవులను రప్పించి వారి రాజ్యం వారికిస్తే ఈ అనర్థాలింతటితోనైనా ఆగుతాయి" అనటం ధృతరాష్ట్ర మహారాజుకు ఏం వినసొంపనిపిస్తుంది? పుత్రప్రేమ మూర్ఖత్వమనే అజ్ఞానాంధకారంలో మునిగిన వాడికి బోధనామృతమనే పంచామృత సేవనంలో వున్న పవిత్రత ఎలా తెలుస్తుంది? చీకట్లో కూర్చోవాలనుకునేవాడికి వెలుగు విలువ ఏమర్థమవుతుంది? విదురుడి హితబోధకు కోపించి రాజసౌధం నుంచి అంధరాజు వెళ్ళగొట్టాడట. దాంతో విధిలేక విదురుడు మమ్మల్ని వెతుక్కుంటూ అడవిబాట పట్టాడు.

విదురుడు రావటం ధర్మరాజు మరో అర్థాన్ని ఊహించుకున్నాడు. అరణ్యావాసానికి బయలుదేరే సమయంలో ఆయుధాలు అప్పగించకుండానే వచ్చేశామని, ఆ విషయాన్ని హెచ్చరించడానికే విదురుడొచ్చాడని ధర్మజుని అనుమానం. ఇదే అనుమానాన్ని నావద్ద వ్యక్తం చేశాడు.

నాకు విదురినిలో కపటం కనిపించలేదు.

నీతిమంతుడిగా లోకమంతా గౌరవించే వ్యక్తి కౌరవ కుటిలత్వానికి తలొగ్గుతాడా? ఏమో ధర్మనిరతుడైన అగ్రజునికే అనుమానం రావటం చూస్తే ఆలోచించవలసిందే చూద్దాం. ఒకవేళ అన్నగారి అనుమానమే నిజమైతే తగువిధంగా బుద్ధి చెప్పకతప్పదు. అందరికీ బుద్దులు చెప్పే ఆయన నేడు తానే చిన్నపిల్లల్తో బుద్దులు గరిపించుకుంటాడు. అయినా ఈ బుద్దులు చెప్పడం, మంచిమాటలు బోధించడం నావల్ల అయ్యేపనికాదు. బుద్ధికన్నా కండబలాన్నయితే వెనకాముందూ ఆలోచించకుండా ఉపయోగించగలను. ఇదే అంశాన్ని అన్నగారితో అన్నాను.

విదుర మహాశయుడు బయటపడేవరకు మేమేమీ ప్రస్తావించకూడదని నిర్ణయించుకున్నాం.

చివరకు ధృతరాష్ట్ర మహారాజుతో జరిగిన సంభాషణ, ఆయన రాజభవనం నుంచి తనను వెళ్ళగొట్టిన సంగతి విదురుడు తెలియజేశాడు. ధర్మమూర్తి పట్ల ఎంతటి మహారాజైనా ఇంత అనుచితంగా ప్రవర్తించడం నాకు ఆగ్రహాన్ని కలిగించింది.

"అన్నా! ఇప్పటికైనా ఆనతివ్వండి. ఆ కుటిల దుర్యోధన, దుశ్శాసన, శకుని, కర్ణలను హస్తినాపురం సరిహద్దులు దాటేవరకు తరమికొట్టి వృద్ధ మహారాజుకు తగు గుణపాఠం చెబుతాను."

"వృకోదరా! శాంతించు. నీ ప్రతాపం తెలియనిదెవ్వరికి? నీవాపని ఇప్పుడు చేస్తే కాననలకు పంపినందుకు కక్షతో ఈ పని పాండవులు చేశారని లోకం అనుకుంటుంది. అలా అనుకోవడం శ్రేయస్కరం కాదు. ఏ పనిచేసినా సమయాసమయాలు చూసుకోవాలి. తొందరపాటు, వేగిరపాటు అనర్థాలకు కారణమవుతుం"దని విదురుడు నచ్చజెప్పేధోరణిలో నా ఆగ్రహాన్ని చల్లార్చాడు.

"విదుర మహాభాగా! అనవసర విషయాలేల? మీరూ మాతోనే వుండి మంచీ చెడు విచక్షణ కలిగించే ధర్మోపన్యాసాలతో మమ్మల్ని ఆనందపరుస్తూ మా మార్గాన్ని నిర్దేశించండి" అని వేడుకున్నాడు ధర్మజుడు. అతిగా ప్రశంశల్ని భరించలేక అతను మాటమార్చాడని మాతో విదురుడికీ అర్థమైంది.

రోజులు గడుస్తున్నాయి. నెమ్మదినెమ్మదిగా అరణ్యవాస జీవితానికి అలవాటుపడుతున్నాం. మేమైతే పురుషులం కాబట్టి ఎలాగైనా సర్దుకుపోగలం. కానీ ఎండకన్నెరుగని యువతి, పంచభక్ష్య పరమాన్నాలతో నిత్యం పట్టుచీనాంబరాలు ధరించి సేవలు పొందడమేగానీ సేవించుటెరుగని సుకుమారి ద్రౌపది దుస్థితికి నా మనస్సు కలవరపడుతుండేది. నా మనస్సులో ఆవేదనని గ్రహించిన పాంచాలి తరచూ సముదాయిస్తూ తానెలాంటి కలవరపాటుకు గురికావడంలేదని, భర్తలతోటే సాధ్వీలలామకు జీవితమని చెబుతూ వూరడించేది.

ధర్మరాజును చూచేందుకు నగరి నుంచి ఎవరొచ్చినా అచ్చెరువొందుతుండేవారు. నగరిలో వున్నా, అడవిలో వున్నా సింహమే అన్నట్టుగా నగరిలో జరిగే సభాకార్యకలాపాలకు తీసిపోని విధంగా, మహా ఋషులు, వచ్చేపోయే మంత్రులు, మాతోనే వుండే ప్రజలతో నిత్యం ధర్మజుడు సభాకార్యక్రమాలను నిర్వహిస్తూనే వున్నాడు. సభాకార్యకలాపాలంటే మమ్మల్ని చూచేందుకు వచ్చేవారి కుశలప్రశ్నలు వేస్తూ వ్యవసాయదారులైతే పంటల గురించి, వ్యాపారులైతే వ్యాపారం గురించి, వైద్యులైతే ప్రజల ఆరోగ్యాది అంశాలను ప్రస్తావిస్తూ ప్రజలంటే తనకెంత అభిమానమో ఆయన చాటుకుంటున్నాడు. కానలకేగినా సద్గుణులకు లోటేముంటుంది? సదాచారులపై సమాజానికి వున్న గౌరవం ఎక్కడకు పోతుంది?

ఇక్కడ జరిగే ప్రతి ఒక్క అంశమూ నగరికి చేరిపోతోంది. ఇందుకోసం ప్రత్యేక వేగుల్ని దుర్యోధనాదులు నియమించినా వారి అవసరం లేకుండానే నగరికి సర్వం ప్రయాణం చేస్తూనే వుంది. దుర్మార్గాలు చేసేవారి గురించి తెలుసుకునేందుకు, దురాగతాలు పాల్పడేవారి గురించి జాగ్రత్తలు తీసుకునేందుకు, దుర్నడతల వారికోసం వేగులు కావాలిగానీ సన్మార్గులకు, సచ్చరిత్రుల కోసం వేగులెందుకు?

ఒక సందర్భంలో ఇదే అంశాన్ని పాండవ మధ్యముడితో ప్రస్తావించాను. నా మాటలకు అర్జునుడు నవ్వుతూ నిజమేనని తలుపాడు.

విదురుడు మా చెంతకు చేరి నాలుగైదు రోజులవుతోంది.

ఒకరోజు కరి నగరం నుంచి సంజయుడొచ్చాడు. విదురుడు లేకుండా మహారాజు వుండలేకపోతున్నారని, వెంటబెట్టుకు తీసుకురమ్మన్నారని చెప్పాడు. విదురుడు పాండవాగ్రజుని వైపు చూచాడు.

"మంచిది విదుర దేవా! మంచివారిని విడనాడి ఈలోకం మనలేదు. కురు మహారాజు దుర్మార్గుడైనా, దుర్జనుడైనా సరే... మీ విషయంలో అది సత్యమైంది. నగరిలో వుంటూ మహారాజుకు మీకు తోచిన మంచి చెబుతూ వుంటే కనీసం కొన్ని దుర్మార్గపు ఆలోచనలైనా ఆగుతాయేమో! ఇదీ ఒకందుకు మంచిదే" అంటున్న సోదరుణ్ణి చూచాను. సరిగ్గా అదే సమయంలో ఆయనా నన్నే చూస్తున్నాడు.

"భీమసేనా! నేనన్న దానిలో విచిత్రమేముంది? సత్యమే దాగుంది. పదిమంది మంచిగోరేవారిని విడిచి ఎవరూ వుండలేరు. వారు మాట్లాడేది అప్రియమనిపించినా, ప్రియమనిపించినా అదే వారిలో దాగుండే ప్రత్యేకత. మంచిగోరేవారిని విడనాడితే మంచిని విడనాడినట్లే విదురమహాశయులను కొంచెం దూరం వరకూ సాగనంపిరా!" ఆదేశించాడు. మౌనంగా అన్న ఆదేశాన్ని పాటించాను.

ఈ నేపథ్యంలోనే రాక్షస సంహారం మొదలైంది. బకాసురుని తమ్ముడు కిమ్మీరుడు నా చేతిలో హతుడయ్యాడు. మాకూ హస్తినలో జరిగే సంఘటనలు తెలుస్తునే వున్నాయి. మంచివాటికైతే ప్రాధాన్యం ఇచ్చి వింటుంటాం. దురాలోచనలు, దుర్మార్గులకు వీలుకల్పించే మాటల్ని ఆలకించేందుకు ధర్మజుడేకాదు, నాతోపాటు మిగిలిన సోదరులెవరూ ఆసక్తి చూపించే వారం కాము. దాంతో హితమైనవే మా దరికి చేరేవి.

దుర్మార్గులకు మంచి చెవికెక్కదు. వారి కర్మవారిని పాపపుటంచులకు తీసుకెళ్తుంది. అధోగతి పాల్జేస్తుంది. అయినా వారటు పయనించేందుకే అంగీకరిస్తారు గానీ సద్వర్తన అలవరుచుకునేందుకు ప్రయత్నించరు. సరిగ్గా దుర్యోధనాదులకు ఇదే జరిగింది. మేము అడవుల పాలుకావటం, మా రాజ్యాన్ని మాయోపాయంతో కాజేయటం సహించలేక మైత్రేయముని కౌరవశ్రేష్ఠుణ్ణి కలుసుకున్నాడు. ఆయన ఎన్నోతీరుల దుష్టచతుష్టయాన్ని మంచిమార్గంలోకి తీసుకొచ్చేందుకు ఎంతో ప్రయత్నించాడు. మద్యం మత్తులో మునిగితేలే పానశాల ప్రియులు అసలు మధువు రుచి తెలుసుకోలేరు. కేవలం చెడు ఆలోచనలు, చెడు నడత కలిగిన వారికి మంచిలోని గొప్పదనం,

ఔన్నత్యం ఎలా తెలుస్తుంది? అలాగే ధృతరాష్ట్రుడు సహా దుర్యోధనాదులకు కూడా ఆయన ప్రియవాక్యాలు చెవికెక్కలేదు. పైగా ఆయన్నే తృణీకరించేలా బాధించారు.

మేమెందుకూ కొరగానివారమని, అరణ్యవాసం, అజ్ఞాతవాసాల్ని పూర్తిచేసుకొస్తే చేసుకున్న ఒప్పందాన్ని గుర్తించేదిలేదని, మళ్ళీ అరణ్య, అజ్ఞాతవాసాలే మాకు గతియని దుర్యోధనుడు ప్రేలాపనలు చేశాడట. దానితో ఆ మహర్షి కోపించి "ఓరి దుర్యోధనా! నీ దుష్టబుద్ధిలో ఆవగింజంతైనా మార్పు వస్తుందేమోనని ఆశతో ఇంతసేపూ మాట్లాడాను. దుర్మార్గులతో మాట్లాడినా దుర్మార్గం చేసినంత పాపమే. సత్పురుషుల్ని బాధించిన పాపం వూరికేపోదు. మీకు అంత్యకాలం సమీపించే ఇలా వదురుతున్నారు. తన గదాదండంతో నీ వురులను కౌంతేయ మధ్యముడు తుత్తునియలు చేయడం ఖాయ"మంటూ సపించేసరికి మునిశాపం విన్న ధృతరాష్ట్రుడు నీరుగారిపోయాడట. కర్ణ, దుర్యోధనాది దుష్టచతుష్టం మాత్రం మరిన్ని బీరాలు పలికిందట. ముని శాపం నుంచి ఎలాగైనా తన కుమారుడిని రక్షించుకోవాలని భావించిన ధృతరాష్ట్రుడు శాపాని వుపసంహరించి తన కుమారుడిని కాపాడవలసినదిగా ప్రాధేయపడ్డాడట. మహర్షి శాంతించి, ముందుగా చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేసేలా పాండవుల రాజ్యం పాండవులకిస్తేనే తన శాపం కార్యరూపం చెందే అవసరం వుండదని, అలా తన కుమారులకు నచ్చచెప్పమని చెప్పాడట. అది తన వల్లకాదని, ఇదంతా తన ప్రారబ్ధం అనుకుని దుఃఖించడం ధృతరాష్ట్రుని వంతైందిట. అటు కొడుకులకూ చెప్పలేడు, ఇటు ధర్మమార్గాన్నీ కాదనలేడు. ఒకే ఒరలో రెండు కతులుంచాలని వృధాప్రయాసపడుతున్నాడాయన. ఆయన ప్రయత్నం చూసిన వారికి పుత్రప్రేమ ఎంత గ్రుడ్డిదనిపించింది. అందుకే వృద్ధమహారాజును చూచి జాలిపడడం మినహా మరేం చేయలేమనుకున్నారంతా.

మేము అరణ్యావాసం ప్రారంభించి పదమూడునెలలైనా వాసుదేవుడెందుకో రాలేదు. ఇదే నన్ను నిత్యం తొలుస్తున్నది. ఇదే అంశాన్ని అర్జునుడితో ప్రస్తావించి వాసుదేవుడి వైరాగ్యానికి కారణం అడిగాను. పార్థుడినే ఎందుకడిగానంటే అర్జునుడంటే కృష్ణుడికి బహిఃప్రాణం. ఆయన చర్యలు తమ్ముడికి తెలియకుండా వుండవు. అందుకే నా సందేహనివృత్తిని అర్జునుడి ద్వారా తీర్చుకోవాలనుకున్నాను. (తవభ్రాతా తవ సఖా శిష్య ఏవచ! మాం సామ్యత్భృతంమ దాస్యామి ఫల్గునార్థే మహావతే. ఏషచాపి నరవ్యాఘ్ర మత్కృ జీవితం త్యజేత్! ఏషనః సమయస్తాత తారచేమ పరస్పరమ్! మహాభారతం: భీష్మపర్వం: 107 -33-34 - ధర్మజా! అర్జునుడు నీకు సోదరుడు మాత్రమే కాదు. నాకు మిత్రుడు, బంధువు, శిష్యుడు కూడా. అర్జునుడి కోసం నా శరీరాన్ని స్వయంగా కోసివ్వగలను. పురుష సింహుడైన అర్జునుడి కోసం ప్రాణాలు సైతం త్యజించగలను. పరస్పర రక్షణకోసం ఒకరికి మరొకరు అండగా వుండాలన్నది మా నిర్ణయం.) వసుదేవుని కుమారుడు రాకపోవడానికి బలమైన కారణమే వుంటుందనుకున్నాను. ఇలా అనుకుంటున్నానో లేదో వాసుదేవుడు సుభద్రాభిమన్యులతో రానేవచ్చాడు. తలచుకుంటేనే ప్రత్యక్షమయ్యే దైవం కదా! నేననుకున్నప్పుడే రావడం యాదృచ్ఛికమే. శ్రీకృష్ణుడిని చూడగానే మా అందరిలో ఎక్కడలేని చైతన్యం వచ్చింది. మా వదనాలకు వెలుగు వచ్చింది. అప్పటివరకు మాలో పేరుకుపోయిన నిరుత్సాహం ఒక్కసారిగా ఆవిరైపోయి తుడిచిపెట్టుకు పోయినట్లయింది.

"రావయ్యా! నల్లనయ్యా! ఎన్నాళ్ళకెన్నాళ్ళకు నీ దర్శనం?" అడుగుతున్న నన్ను శ్రీకృష్ణుడు కౌగిలించుకున్నంత పనిచేశాడు.

"ఏదీ బాహుబలా! ఆ మధ్య నేను ద్వారకలో లేను. ఉంటే రాకపోదునా?" అని జవాబిస్తూనే అర్జునుడిని ఆలింగనం చేసుకున్నాడు. వారిద్దరి మధ్య అనుబంధం మాకు తెలియనిది కాదుకదా!

కృష్ణుడి రాక తెలుసుకున్న ధర్మనందనుడు పరుగున బయటకు వచ్చాడు. సంతోషం చిందిస్తున్న ముఖారవిందంతో నందనందనుని పాదాలకు అభివాదం చేశాడు.

"బావా! పిన్నలకు ఇలా చేయకూడదని తెలిసీ" వారిస్తూ అన్నాడు వాసుదేవుడు.

"పెద్దరికమనేది వయస్సుకు సంబంధించినది కాదు వాసుదేవా! నువ్వు మాకు సదాపూజనీయుడవే" అంటున్న ధర్మజుని వారించాడు కృష్ణుడు.

పరమాత్ముడికి ఒక చెట్టు నీడను ఆసనంగా చూపించి ఆయన కూర్చున్న తరువాత మిగిలిన వాళ్ళంతా కూర్చున్నాం. అందరికంటే ముందుగా వచ్చి మమ్మల్ని పరామర్శించవలసిన తాను ఇంత ఆలస్యంగా రావడానికి కారణం వివరించాడు శ్రీకృష్ణుడు.

"నేను పదినెలలుగా ద్వారకలో లేను. సాళ్వదేశాధీశునితో సాగరతీరంలో యుద్ధ చేయాల్సిన పరిస్థితులొచ్చాయి. అందుకే మాయాద్యూత సమయంలో మీ చెంతలేను. ఉంటే మీకింత అన్యాయం ఎలా జరగనిస్తాను? అప్పుడే ధృతరాష్ట్రుడినే నేరుగా నిలదీసేవాడిని. ఈ అన్యాయానికి తగిన మూల్యం ఎప్పటికైనా చెల్లించాల్సిందే"నని మమ్మల్ని సముదాయించాడు.

కృష్ణుడిని వుత్సాహంతో చూస్తూ, మర్యాద చేసేందుకు సిద్ధమవుతున్న నన్ను చూచి, "క్రొత్త వృకోదరుడు కనిపిస్తున్నాడు బావా నీలో. ఏమిటి సంగతి?" చిలిపిగా ప్రశ్నిస్తున్న కృష్ణుడికి అంతే చిలిపిగా జవాబిచ్చాను.

"నీకు తెలియనిదేముంటుంది కృష్ణా? సర్వాంతర్యామివి. ఎక్కడ వున్నా ఆప్తుల యోగక్షేమాలు విచారిస్తూనే వుంటావుగా"

"మా భీమసేనుడు భుజపరాక్రమాల్లోనే కాదు, మాటల్లోనూ రాటుతేలాడు" నవ్వుతూ అన్నాడు నా జవాబుకి.

"ఈ అడవిలో మాకు సర్వరక్షకుడు భీమసేనుడే వాసుదేవా? మమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుతున్నాడు. నిద్రాహారలు కూడా విసర్జిస్తున్నాడు" ధర్మజుడు అంటున్న మాటలకి అన్నగారిని ఇబ్బందిగా చూసాను.

"బావా! ఈమధ్య కాలంలో అన్నగారికి నన్ను ప్రశంసించడమే పనిగా మారింది. ఇందులో నా గొప్పతనమేముంది? అది నా బాధ్యత.." అంటున్న నన్ను చూస్తూ శ్రీకృష్ణుడు అన్నగారితో ఇలా అన్నాడు "ధర్మజా! క్రూరమృగాలు, భయంకర రాక్షసులకు నిలయమైన ఈ అడవిలో మీకు నిజంగా భీమసేనుడే రక్ష. సర్వవేళల్లో మిమల్ని కనిపెట్టుకునే వుండాలి. ఎప్పుడే ప్రళయం ముంచుకొొచ్చినా తిప్పికొట్టగల పోటుగాడు, పదివేల ఏనుగుల్ని ఒక్కసారిగా పిండిచేయగల అసహాయశూరుడు" కృష్ణుడి ప్రశంసలకు 'పొగడ్తలు ఇక చాల'న్నట్లు చేతులు జోడించి, శిరసు వంచి నమస్కరించాను.

"ఉన్నమాటే చెబుతున్నాను వృకోదరా! కానిమాట నేనెప్పుడూ మాట్లాడను. ఉదాహరణకు కిమ్మీర సంహారం. నువ్వే లేకుంటే వీళ్ళ గతేంకాను? అందువల్ల మీరంతా ఇదివరకు మాదిరిగా కాకుండా మరింత అప్రమత్తతో మెలగాలి. వేసే ప్రతి అడుగూ ఆచితూచి వేయండి. ఎక్కువకాలం ఒకచోట వుండకండి" అని మాకు తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ చెప్పి ద్వారకకు పయనమయ్యాడు నందనందనుడు.

శ్రీకృష్ణుడి రాక మాలో క్రొత్త వుత్సాహాన్ని, నూతనచైతన్యాన్నీ తెచ్చింది. అప్పటి నుంచి మరింత జాగరూకతతో వ్యవహరించడం ప్రారంభించాం. ప్రస్తుతం మేము ద్వైతవనంలో వుంటున్నాం. కృష్ణుడు సలహా మేరకు త్వరలోనే మరోచోటుకి వెళ్ళాలని నిర్ణయించుకున్నాం.

అవసరమైనప్పుడు మినహా మిగిలిన వేళల్లో అనుచిత ఆగ్రహావేశాలకు అవకాశం ఇవ్వొద్దని అన్నగారి ఆదేశం. ఆ ఆదేశాన్ని తప్పకుండా పాటించటం ఆరంభించాను.

యుక్తాయుక్త విచక్షణను మరిచి ముక్కోపి యధేచ్ఛగా సంచరిస్తాడు. ఆగ్రహమనే దురాగతం ధర్మార్థకామ మోక్షాలను దూరం చేస్తుంది. విజ్ఞానఖని అయిన వివేకవంతుడు కోపాన్ని జయించి యుక్తిమంతుడనిపించుకుంటాడు. క్షమాశీలికి, భుజపరాక్రమ శక్తికీ జగతిలో అసాధ్యమైనదేమీ వుండదు. క్షమాగుణం లేకపోతే మనలో ఆలోచన, దాక్షిణ్యం, శౌర్యం వున్నా ప్రయోజనం వుండదు. క్షమాహృదయం వున్నవాడికే ఇవి అలంకారమిస్తాయి. సత్ఫలితాన్నిస్తాయి. ఇలా నిత్యం నాలో ఆగ్రహావేశాల్ని విరమింపచేసేందుకు అన్నగారు ప్రయత్నిస్తూనే వున్నారు.

### గంధమాన పర్వతం

కృష్ణుడి సలహాను ముందూ వెనుకా ఆలోచించకుండా అమలు చేసేందుకు మేమెపుడూ ముందుంటాం. ఇంకెవరు చెప్పినా అందులో సాధ్యాసాధ్యాలను ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం. ఇప్పుడు కూడా కృష్ణుడు చెప్పినట్లుగా ఒకే చోట కాకుండా సాధ్యమైనంత వరకు మా నివాసాన్ని మార్చే పనిలో గంధమాన పర్వతానికి చేరుకున్నాం అక్కడి ప్రకృతి మమ్మల్ని ఎంతో పరవశుల్ని చేసింది. ఒకసారి ఆ ప్రాంతంలో విహారం చేస్తుండగా ద్రౌపదికో పుష్పం లభించింది. సువాసనలు వెదజల్లుతున్న ఆ పుష్ప సౌందర్యానికి ఆ పడతి ముచ్చటపడి నా వద్దకు వచ్చి అలాంటి పుష్పాలు మరిన్ని కావాలని కోరింది. ఇల్లాలు ముచ్చటపడుతూ కోరిన కోర్కెను తీర్చడం ధర్మంగా భావించాను. ఇదే మరో కొత్తమలుపునకు దారి తీస్తుందని ముందుగా వూహించలేదు.

మానవ జీవితంలో ఒక అనుభవం తరువాత మరో అనుభవం ఎదురు కావడం సర్వసాధారణం. కానీ ఒక అనుభవానికి మరో అనుభవానికి మధ్య కీలకమార్పులు చోటు చేసుకోవడం అరుదు. అది మంచినిస్తుందో, చెడువైపు చూపుతుందో కాలానికే తెలియాలి.

ప్రతి అంశం మన భవిష్యత్తు అవనికకు సూచికగా వుంటుందంటారు.

ఇపుడు సౌగంధికాపుష్పం అంశం కూడా!

ద్రౌపది కోరిన పుష్పంకోసం అన్వేషణ ప్రారంభించాను.

ఆ పుష్పం పేరు తెలియదు. అదెక్కడ లభిస్తుందో ఎరుగను. అంతా పరమాత్ముడిపై భారం వేసి ఇల్లాలి ముచ్చట తీర్చేందుకు కొనసాగించిన పయనం నన్ను ఆనందాశ్చర్యాల్లో ముంచెత్తింది. అలా అటవీ మార్గంలో వెడుతూ వెడుతూ దారిలో అడ్డొచ్చిన క్రూరమృగాల భరతం పడుతున్నాను. భూనంభోంతరాలు దద్దరిల్లేలా పెద్దగా సింహనాదాలు చేసుకుంటూ వెడుతుంటే క్రూరమృగాలు భయపడి పారిపోతుండడం చూచి నవ్వుకుంటున్నాను. నా సింహనాదాలు నిజం సింహపు అరుపులుగా అవి భ్రమిస్తుండడం మరింత వినోదపరుస్తోంది. మరింత వుత్సాహంగా ఘీంకారాలు చేస్తూ నడుస్తున్న నన్ను అదే స్థాయిలో మరో అరుపు విభ్రాంతుడిని చేసింది. అచ్చం నా అరుపు లాగానే వున్న ఆ అరుపు నాలో పట్టలేని ఆవేశాన్ని తీసుకొచ్చింది. ఇదేదో రాక్షసమాయ అనుకున్నాను.

మరింత గట్టిగా సింహనాదం చేశాను. తనూ తక్కువేం కాదన్నట్టు ప్రతినాదం వినిపించింది. అసలు బయలుదేరిన పనినే మరిచి సింహనాదం వినవచ్చిన దిక్కులో బయలుదేరాను. మధ్యమధ్యలో నేను ఘీంకారాలు చేస్తే ఘీంకారాలు, సింహనాదం చేస్తే సింహనాదం ప్రతిగా వినిపించటంతో నాలో ఆవేశం కట్టలు తెంచుకున్నది. ఈ అంశం అంతేదో చూచేవరకు శాంతి వుండదు. ఇటువంటి విషయాల్లో అన్నగారందుకే నన్ను వెన్నంటి హెచ్చరిస్తుంటారు. అనుకున్న పనిని మధ్యలో వదిలేసి ఆవేశంతో అన్య అంశాలపై దృష్టిపెట్టొద్దని పదేపదే చెబుతుంటారు. కానీ, అసలే ఆవేశపరుడనైన నేను అలాంటి మాటల్ని పెడచెవిన పెట్టేవాడను. ఎవరెన్ని చెప్పినా ఆవేశాన్ని అణచుకోని నేనిప్పుడు అణచుకుంటానా?

శబ్దతరంగాల్ని బట్టి ప్రయాణిస్తున్న నాకు ఒకచోట విచిత్రం కనబడింది. దారికి ఒక చివర కోతి కూర్చునుండగా దాని తోక మార్గానికి ఆ చివరి నుంచి ఈ చివరకు అడ్డంగా వున్నది. నాలో ఆవేశం కొద్దిగా సడలింది. ''కోతి మూరెడు, తోక బారెడు'' అని నవ్వుకున్నాను. అలా నవ్వుకుంటూ వెళ్తూ తోక దగ్గరకు వచ్చి ఆగిపోయాను.

''ఏమిటి నాయనా! నీలో నువ్వే నువ్వుకుంటున్నావు?'' అంటున్న కోతిని చూచి మాటలు నేర్చిన కోతి అనుకున్నాను.

''నువ్వేమిటిలా మార్గానికి అడ్డంగా తోకపరుచుకుని వినోదం చూస్తున్నావు?''

''ఆ వినోదమా.. పాడా! నన్ను మించిన తోక నా మాట వినడంలేదు. బాబ్బాబు. దాన్ని తీసి కాస్త పక్కకు పెట్టి వెళ్ళు నాయనా!''

అసలే ఆగ్రహంతో వున్నానేమో ''ఏమిటీ ఈ తోకను నేను పక్కకు నెట్టాలా?''

"అదే నాయనా! ముసలివాడిని కదా! కాస్త సాయం చేసిపెట్టు. చూడబోతే గొప్ప సంస్కారం గలవాడిలా వున్నావు."

సరే! చేసేదేముంది? చిటికెన వ్రేలితో తీసి అవతల పారేయొచ్చు ఎంతపని అనుకుని నడుం బిగించాను. ఊహు చిటికెనవ్రేలు కాదు, ఒంటిచేయి, రెండుచేతులూ ఇలా ఎంతగా ప్రయత్నించినా తోకకదిల్తేనా? ఇదేం కోతి ఏం తోక చూడగా చూడగా ఇదేదో రాక్షసమాయిలా వుందే

"రాక్షసమాయ కాదు, మరేం కాదు భీమసేనా.." సరిగ్గా నా మనస్సులోని మాట తెలుసుకున్నట్టు కోతి అన్నది.

అప్పటికి అవగతమైంది. ఇది సామాన్యకోతి కాదు. "శ్రీరాముడి నమ్మినబంటు, లక్ష్మణుడికి పునర్జన్మ ప్రసాదించి, సీతమ్మకు బ్రతుకుపై ఆశచూపించి, మాయావి రావణుని పీచమణచడంలో రాముడికి తోడ్పడిన "శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం.. ప్రభాదివ్యకాయం.." చేతులు ముకుళించి స్తుతించడం మొదలుపెట్టగానే తన నిజరూపంలో ఆంజనేయుడు సాక్షాత్కరించాడు. అంతే తనువెల్లా అనూహ్యస్పందన. ఎన్నడూ ఎరుగని అనిర్వచనీయ అనుభూతి.. చెప్పుకోలేని అద్వితీయ మైమరుపు.

"సోదరా! భీమసేనా" పిలుపుతో నాలో కనీవినీ ఎరుగని చైతన్యం. ఆయన ఇంతై ఇంతింతై మరింతై ఎంతో అయి.. అందనంత ఎత్తుకు పెరిగిపోతున్నాడు. తన అనంతశక్తి స్వరూపాన్ని చూసి నా కళ్ళు ఆనందంతో క్రొత్త వెలుగుల్ని చిందిస్తున్నాయి.

"ఊరడిల్లు సోదరా! ఊరడిల్లు" తన శక్తిస్వరూపాన్ని విరమిస్తూ అంటున్న వాయుపుత్రుడితో

"సోదరా మారుతి.. నేటికి నా జన్మధన్యమైంది. నీ కృపాకటాక్షంతో నిన్ను దర్శించుకోవాలన్న ఇచ్ఛ ఈడేరింది. ఇంతకన్నా నాకు కావలసిందేమున్నది?"

తన్మయుణ్ణి అవుతున్నాను. మేల్కొంటున్నాను. మైమరచిపోతున్నాను. మైకం కమ్ముతోంది. తనువంతా అనూహ్య ప్రకంపనలు.

"సోదరా! అనుజా వచ్చిన పనిమరచి ఏమిటీ తన్మయత్వం? భవిష్యత్తులో కురుపాండవ యుద్ధం సమయంలో కూడా అనూహ్య పరిస్థితులెదురైతే ఇలాగే తన్మయత్వంతో కర్తవ్యాన్ని విస్మరిస్తావా?" నవ్వుతూ అన్నాడు మారుతి.

"ఆ కౌరవ పాండవ యుద్ధమా? నిజంగానే అంటున్నావా అంజనీపుత్రా? ఆ మాటే నాలో వెయ్యేనుగుల ఆవేశాన్ని కలిగిస్తోంది. చెప్పు సోదరా చెప్పు" తొందరపెడుతూ అన్నాను.

"అవును సోదరా! మీరూహించినంత వున్నతులు కారు మీ పెదనాన్న సంతానం. అనుకున్న ఒప్పందాన్ని వారు ఖాతరు చేయరు. చివరకు కురుక్షేత్ర సంగ్రామమే"

ఆంజనేయుని మాటలు నాలో కొత్త వుత్సాహాన్ని కలిగిస్తున్నాయి.

"ఒకవేళ అదే నిజమైతే నీవు మాకు సాయం రాకూడదూ" అదేదో యుద్ధమారంభమైనట్టు, అప్పుడే చతురంగ బలసమీకరణలు మొదలైనట్టు వుంది నా వాలకం. నా తొందరపాటును, యుద్ధమంటే నాలో కలిగే వుత్సాహాన్ని గమనించి చిన్నగా నవ్వాడు శ్రీరామబంటు.

"అంత వేగిరపాటు వద్దు భీమసేనా! యుద్ధమంటే మీ రెండు కుటుంబాల మధ్యే జరుగుతుందనుకుంటున్నావేమో! మీకూ మీకూ మధ్య రాజ్యాధికారం కోసం జరిగే యుద్ధంలో ఎన్నివేల కుటుంబాల క్షయమవుతాయో కాస్త ఆలోచించండి. మీ రాజ్యకాంక్ష కోసం ఇంతమందిని హతమార్చటం అవసరమా?"

"అందులో మా తప్పు ఏమున్నది అగ్రజా! అన్నమాట ప్రకారం మేము అరణ్యవాస, అజ్ఞాతవాసాల్ని పూర్తిచేస్తాం. ఆ తరువాత మా రాజ్యశేషాన్ని మాకిస్తే అసలు యుద్ధమనే మాటే వుండదు. లేకపోతే ప్రతాపవంతులు చూస్తూ వూరుకుంటారా? ఇక్కడ దోషాదోషాల మాట జనింపదు. రాజధర్మం ఒక్కటే నిలుస్తుంది. శత్రువుల చిక్కిన రాజ్యాన్ని పరాక్రమంతోనే తిరిగి స్వాధీనం

చేసుకోవటం రాజధర్మం. ఇక సైన్యక్షయమంటావా యోధులకు యుద్ధరంగమంటే తలుపులు తెరిచిన స్వర్గలోకమేకదా! చేసేదేమున్నది? తప్పని సరైతే యుద్ధానికి వెరవడం రాజనీతి కాదుకదా! నీకు తెలియని ధర్మమేమున్నది?"

తమ్ముడిని ప్రశంసాపూర్వకంగా చూశాడు మారుతాత్మజుడు.

"భేష్ భీమసేనా భేష్. మీరింత రాజనీతిజ్ఞులు కనుకనే కౌరవులంత అరాచకవాదులయ్యారు. ఏమైనా యుద్ధంలో పాల్గొనమని నన్ను కోరావు. కానీ, నాకిపుడాసక్తిలేదు, శక్తీలేదు. కాకపోతే నీకొక వరమిస్తాను. కురుక్షేత్రంలో పాల్గొంటాను. నీ తమ్ముడు విజయుని రథంపై జెండాగా మౌనంతో మీ అన్నదమ్ముల పరాక్రమాలు వీక్షిస్తుంటాను" అని క్షణమాగి "మనమాటల్లో పడి నువ్వెళ్తున్న పని మరిచిపోయేవు."

"నువ్వు వెతుకుతున్న పువ్వు పేరు సౌగంధికాపుష్పం. అది కుబేర రాజ్యంలో వున్నది" మళ్ళీ ఆయనే అన్నాడు.

మారుతికి మరోసారి హృదయపూర్వక నమస్కారాలు చెప్పి నా కార్యనిర్వహణకు బయలుదేరాను.

అలా ఎక్కడో వున్న సౌగంధికపుష్పం మా ముందుకు రావటమేమిటి? దాన్ని వెతుకుతూ నేను బయలుదేరటమేమిటి? ఇలా మారుతి దర్శనం లభించి అనుకోని వరం ప్రసాదించడమేమిటి? అంతా దైవలీల కాకపోతే ఇలా జరుగుతుందా? కల్మష రహిత హృదయులకు దైవానుగ్రహం తప్పక వుంటుంది. నన్ను మించిన వీరుడు లేడని విర్రవీగేవారికి ఆపదలు పిలిచినట్టు వస్తుంటాయి. పరాక్రమవంతులు, ధైర్యవంతులు, ధర్మపాలనకు కట్టుబడి వుండేవారు అలాంటి ఆపదల్ని లెక్కపెట్టక పరిష్కారమార్గాలు కనుగొంటారు.

భక్తిభావమే గొప్పదని శ్రీకృష్ణుడు పలుమార్లు చెప్పినా నా బుద్ధికది అందనిది. అదే విషయాన్ని అనేకసార్లు దేవకీనందునితోనే చెప్పాను. ప్రతిసారి ఆయన చిరునవ్వు నవ్వుతూనే వున్నాడు. ఇప్పుడు నాకు పరమాత్ముడిని చూస్తుంటే భక్తిభావం కలుగుతోందనిపిస్తోంది. అందుకు జరాసంధుడిని నా చేత వధింపచేసిన విధానం కారణం కావచ్చు. నర్తనశాలలో కీచకుణ్ణి మట్టుపెట్టేటప్పుడు కావచ్చు.

విజయవంతంగా అరణ్యవాసం ముగించుకున్నాం. ఇక మిగిలింది సంవత్సరం పాటు అజ్ఞాతవాసం. ఎక్కడ గడపాలా అన్న ఆలోచనతో మా ఐదుగురూ తీవ్రంగా ఆలోచించాం. ఎటూ నిర్ణయించుకోలేకపోతున్నాం. ఇంతకాలం మాతో వున్న బ్రాహ్మణులకు విషయాల్ని వివరించి మరలిపోవలసిందిగా కోరాం. వారంతా మమ్మల్ని దీవిస్తూ "ధర్మమూర్తులకు ఎల్లకాలం పరమాత్ముడి ఆశీస్సులుంటాయి. వారికెన్నటికీ దీక్షానిర్వహణలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకావు. ధర్మనిరతులకు వచ్చే ఆటంకాలు తాత్కాలికమే అయినా అవి వారి లక్ష్యసిద్ధిని దెబ్బతీయవు. మీకిదే జయం" అంటూ మాదగ్గర సెలవు తీసుకున్నారు.

వారు వెళ్ళిన తరువాత ఏ దేశమైతే మా రహస్యం గుట్టుగా సాగుతుందోనని తర్జన భర్జలు పడ్డాం. "అన్నా! కురు సామ్రాజ్యం చుట్టూ చేది, పాంచాల, మత్స్య, సాళ్వ, విదేహ, బాహ్లిక, దశార్ణ, కళింగ దేశాలున్నాయి. వీటిలో ఏదో ఒకచోట మనం తలదాచుకోవడం వుత్తమం. ఎందుకంటే కురుసామ్రాజ్యానికి దరిదాపులో వుంటే అక్కడి విషయాలు కూడా తెలుసుకోవటం తేలిక" అన్నాడు అర్జునుడు.

అవునవును. మనం అజ్ఞాతవాసాన్ని తమ రాజ్యానికి సరిహద్దులోనే చేస్తున్నామని శత్రువులు పసిగట్టలేరు. కౌరవ సామ్రాజ్యానికి పక్కనే విరాట మహారాజు కొలువు కూటమినే మా అజ్ఞాతవాసానికి తగిన స్థలంగా ఎంచుకున్నాం.

అన్నగారు లేకుండా నేను స్వేచ్ఛగా యుద్ధం చేసింది బకాసురుడు, హిడింబాసురుడు, జరాసంధుడులతో. వారితో యుద్ధసమయంలో నేనెందుకు స్వేచ్ఛగా అంటున్నానంటే అప్పుడు వారించేందుకు అన్నగారు నా సమీపంలో లేకపోవడమే. అయితే వీరితో యుద్ధం చేయడానికి ముహూర్తం పెట్టించింది మాత్రం అగ్రజుడే

మిగతా సమయాల్లో యుద్ధంలో నన్ను స్వేచ్ఛగా వదిలినా చివరి సమయంలో మాత్రం పగ్గం వేసినట్లు వెనక్కిలాగారు. ఇది అన్నగారిపై ఆగ్రహంతో కాదు చెబుతున్నది. ఆయన ధర్మనిరతిని తెలియజెయ్యడమే నా వుద్దేశం. ధర్మరాజు ధర్మనిరతుడు కాకపోతే మాకు పరమాత్ముడైన శ్రీకృష్ణుడి సాయం లభించి వుండేదికాదు. ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో యుద్ధంలో మా విజయానికి వెనుక వాసుదేవుడుండగా ఇక మాకు ఓటమి ఎందుకు వస్తుంది?

***బకాసురుడి వధే చూడండి.***

ఏక చక్రపురంలో మేము బిచ్చమెత్తి జీవితం గడుపుతున్న సమయంలో ఆ వూరికి మృత్యువుగా మారిన బకాసురుడి పనిపట్టాలని నిర్ణయించుకున్నాను. చాలారోజుల తరువాత నా పరాక్రమం చూపించే అవకాశం వచ్చింది కదాని నేను సంతోషపడుతున్న సమయంలో అన్నగారు నా వుత్సాహాన్ని కనిపెట్టి ఇలా అన్నారు.

"నువ్విప్పుడు బకాసురుడితో పోరుకు బయలుదేరితే మా సంగతి ఏమికాను? మమ్మల్ని కాపాడేవారు?"

ధర్మజుని సందేహం నాకు అర్థమైంది.

"పాండవ శ్రేష్ఠా! నీ మదిలో వున్న దావానలం నాకు అర్థమైంది. అందుకే చెబుతున్నాను నా బలపరాక్రమాలు తెలిసి కూడా మీరిలా సందేహపడుతున్నారెందుకో అర్థంకావడంలేదు. ఇది నాకూ, బకుడికీ మధ్య యుద్ధం కాదు. ధర్మానికీ, అధర్మానికీ మధ్య పోరాటం. చరిత్రలో ఎప్పుడూ అధర్మం విజయం సాధించిన వుదంతాలు లేవు కదా! ధర్మజుడైన నీకి సంగతి తెలియనిది కాదు. అనవసర సంకోచాలతో సంశయపడటం నీవంటి ధర్మమూర్తికి, ధర్మాచారపరాయుణుడికి సరికాదు. కాబట్టి ఎలాంటి సంకోచాలు లేకుండా నిండుమనస్సుతో నన్ను దీవించు. ధర్మరక్షకుడిగ వుంటాడు." తల్లి మాటలకు ధర్మజుడు తలవూపక తప్పలేదు.

అలా బకుడి భరతం పట్టగలిగాను. ఇంతకుముందు హిడింబాసుర వధ నా మొదటి విజయం కాగా బకుడిపై విజయం రెండోది.

దీనితో నాకు అర్థమైనదేమిటంటే ధర్మం ఎటుంటే అటే విజయం వుంటుందని. అందుకే ధర్మజుడంటే మాకు చెప్పలేనంత అభిమానం, గౌరవం.

నేను ధర్మజుని సోదరుడివైనందుకు ఎప్పుడూ గర్వపడుతుంటాను. చీకట్లు కమ్మిన జగతికి భాస్కరుడు వెలుగు ఎలా ప్రసాదిస్తాడో అలాగే అధర్మమనే అజ్ఞానపు తిమిరాన్ని పారదోలాలంటే విజ్ఞానం, ధర్మమనేకాంతుల్ని వెదజల్లేందుకు ధర్మరాజువంటి మహాపురుషుల అవసరం ఎంతైనా వుంది. తన ధర్మాన్ని నిర్వర్తించటంలో ఆయన కృతకృత్యుడయ్యాడు.

ఏదేమైనా ఎప్పుడెలా ఏమి జరగాలన్నది భగవంతుని నిర్దేశం. ఇందులో ఇంకొకరి ప్రమేయంకానీ, జోక్యం కానీ, గొప్పతనంకానీ వుండదు. అంతా ఈశ్వరేచ్ఛ ప్రకారమే జరిగితీరుతుంది. భగవంతునికి తెలియకుండా చీమకూడా కుట్టదు. అనుభవపూర్వకంగా నేను తెలుసుకున్నదిదే

నేనది సాధించాను, ఇది సాధించానని గొప్పలు చెప్పుకుంటాం. ఒక్కొక్కసారి నేను కూడా అలాగే అనుకుని గొప్పలుపోయాను. కానీ ధర్మజుని పుణ్యమా అని వాస్తవం తెలుసుకున్నాను. "అహం బ్రహ్మాస్మి" అన్నది వ్యక్తులకు సంబంధించినది కాదని, పరమాత్ముడికే చెందుతుందని గ్రహించాను.

ఇప్పుడు కీచకవధను వివరిస్తాను.

ఉచ్చ నీచం కానకుండా ప్రవర్తిస్తున్న కీచకుడి భరతం పట్టడమే నా తక్షణ కర్తవ్యమనుకున్నాను. శత్రువును చూడటంతోటే నాచేతులు గట్టిగా బిగుసుకున్నాయి కళ్ళు ఎర్రబడ్డాయి. పటపట కొరుకుతున్న దంతాలు దేహం మీదున్న చెమట ప్రవాహంలా కారసాగింది. అజ్ఞాతవాసం భంగమైనా పర్వాలేదు. అర్ధాంగి అవమానాల ముందు రాజ్యసాధన గొప్పకాదని భావించాను. ఇక మిగిలింది అన్నగారి అనుమతే. ధర్మజుడివైపు చూచాను. ఇది సమయం కాదన్నట్టు ఆయన సైగ చేశాడు.

ఎంత వుత్సాహంతో శాత్రవుడిపై ఉరకాలనుకున్నానో అంత నిరుత్సాహం ఆవరించింది. అటు అన్నగారి మాట కాదనలేను, ఇటు భార్యను రక్షించుకోకుండా వుండలేను. ఏమీ పాలుపోని స్థితిలో అయోమయంలో పడిపోయాను.

నా మనస్సులో వువ్వెత్తున ఎగిసిపడిన ఆగ్రహాన్ని దిగమింగుకునే యత్నంలో భాగంగా పక్కనే వున్న చెట్టును పెకలించేందుకు ప్రయత్నించాను.

నన్ను ఇతరులు గమనించేలోపే నా ఆలోచనను అర్థం చేసుకున్న అన్నగారు "వలలా! వంట చెరుకు కోసం ఫలపుష్పాలిచ్చే చెట్టును నాశనం చేయటం తగునా?" అని మందలించడంతో మారుమాట్లాడలేకపోయాను.

అపుడు ద్రౌపదితో "సైరంధ్రీ నీ గోడు మహారాజుకు చెప్పుకున్నావు కదా! ఇక చాలు వెళ్ళు" అని ఆజ్ఞాపించాడు.

అప్పటికీ ఆమె కదలక మహారాజువైపు చూస్తూనే వుంది.

"ఇంకెందుకు నాట్యగత్తెలా ఎదురుచూస్తావు? వెళ్ళు" అన్నగారు మందలింపు విన్న ద్రౌపది ఆగ్రహంతో "అవును. నేను నాట్యగత్తెనే. నా భర్త ఒక నాట్యగాడు. ధర్మోపన్యాసాలతో, జూదక్రీడతో నాట్యమాడుతుంటాడు. మిగిలిన భర్తలూ అంతే." దుఃఖంతో ఆమె గొంతు డగ్గుత్తిపోయింది. నిట్టూరుస్తూ వెనుతిరిగి వెళ్ళిపోయింది.

కీచకుడి మదమణచటం ఎలాగా అని ఆలోచిస్తూ నిద్రకుపక్రమించిన నాకు ఎవరో ప్రక్కన కూర్చున్నట్టనిపించి కన్నులు తెరిచి చూచాను. ఎపుడొచ్చిందో ద్రౌపది ఆమెను చూసి నిర్ఘాంతపోయాను. చుట్టూ ఎవరూలేరు కాబట్టి సరిపోయింది.

"ప్రభూ ఈ ఆపద నుంచి గట్టెక్కేదెలా?"

"ఇవాళ తేలిపోయేదే అన్నగారు అనుమతించలేదు కదా!" నా మాటకు ఆమెలో నిరుత్సాహం కనిపించింది.

"ధర్మజుడు ధర్మానికి తలొగ్గుతాడు. ఇలాంటి సమయాల్లో కూడా ఆయన కించత్తు మాట్లాడలేదు. ఆయనకు కావలసినది అజ్ఞాతవాసం నిర్విఘ్నంగా పూర్తయి రాజ్యాధికారం. అంతేగానీ ఇల్లాలి ఇడుములు, అవమానం ఆయనకు పట్టదు. ఇంతేకదా వృకోదరా! నేనెంత భయవిహ్వలనయ్యానో పరమాత్ముడికెరుక. గతంలో కురుసభలో నన్ను సోదరుడు శ్రీకృష్ణపరమాత్మ రక్షించాడు. మరిప్పుడో? అరివీర భయంకరులమని చెప్పుకునే భర్తల చెంతనే భీతితో నిత్యం వణికిపోతూ బ్రతికే ఖర్మపట్టింది. మీకెంతసేపూ మీ కీర్తిప్రతిష్టలు, మీ ధర్మపరాయణం. నా గురించి యోచించేదెవరు? పుట్టింటిలో ఎండకన్నెరుగక అభిమానధనిగా పెరిగిన నేను ఈ బాధలు, కష్టాలు కన్నీళ్ళ కోసమేనా నట్టింట అడుగుపెట్టింది?" ఆమె కన్నీళ్ళు ఆగడంలేదు. ఆమె మేను భయంతో వణకడం స్పష్టంగా కనిపించింది.

ఎప్పుడూ ఎట్టి పరిస్థితుల్లోనూ చలింపని నా గుండె ఆ క్షణం పాంచలి పరాభవాగ్నికి తలొగ్గింది.

"పాంచాలీ! ఆ ధర్మాత్ముడిని మనం తప్పుగా అర్థం చేసుకుంటున్నాం. ఆయన అజాతశత్రువు. ఆయనే గనుక అలిగి శత్రువుల వైపు దృష్టిపెట్టాడా ఇక ప్రళయమే. కానీ ఆయన ఆగింది మనందరికోసం. కేవలం రాజ్యాధికారమే ఆయనకు పరమావధి అనుకోవటం పొరపాటు. ఇప్పటికే తనవల్లే మనమ్మతా ఇన్ని ఇడుములు పడుతున్నామని కుమిలిపోతున్నాడు. ఇప్పుడు కీచకుని కోసం అజ్ఞాతవాసాన్ని కూడా లెక్కింపక సరేనని వుంటే మళ్ళీ మనం పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం, సంవత్సరం అజ్ఞాతవాసం చేయకతప్పదు. అంటే

మళ్ళీ తనవల్లనే మనక్లేశాలు మొదలవుతాయనే ఆ ధర్మమూర్తి మనకు అనుజ్ఞ ఇవ్వలేకపోయాడు. అంతేగాని నీ మీద ప్రేమ లేక కాదు, నీ కష్టాలు తెలియకా కాదు" ఆమెను అనునయించాను.

"అలాగైతే ఇప్పట్లో నా కష్టాలు తీరవా? మొన్న దుశ్శాసనుడు, నిన్న సైంధవుడు, నేడు కీచకుడు. ఇలా నాకు పరాభవాగ్నుల పరంపర తప్పదా? ఎన్నాళ్ళిలా?" ఆమె మాటలు నాలో తీవ్ర ఆలోచనలు రేకెత్తించాయి.

"నీకు ఐదుగురు గంధర్వపతులున్నారు కదూ. వారు నిన్ననుక్షణం కాపాడుతూనే వుంటారుగా! నీకింకా భయమెందుకు? సావధానవై నేను చెప్పేది చెయ్యి"

నా మాటలు ఆమెకు అర్థంకాలేదు.

"కీచకుడు రేపు వుదయం నీదరికి రాకపోడు. వాడిని రేపురాత్రికి నర్తనశాల మందిరంలోకి రమ్మని చెప్పు. ఆ తరువాత వాడి సంగతి నేను చూస్తాను."

"అంటే?" అర్థంకాక అడుగుతున్న ద్రౌపదిని నవ్వుతూ చూచాను.

"రేపటితో లోకానికి కీచకుడి బాధ తొలిగిపోతుంది. నేను చెప్పినట్టు చెయ్యి. తరువాత ముగింపు నేనిస్తాను."

"చూడు దేవీ తెల్లవారబోతోంది. ఎవరైనా మనిద్దరినీ స్థితిలో బాగుండదు" ఆమెలో వచ్చేముందున్న ఆందోళన ఇప్పుడు కనిపించటంలేదు. ప్రశాంతంగా వెళ్ళిపోయింది.

కీచక పీచమణిచే ఉద్దేశంతో ఆలోచనతో నేను నిద్రలోకి జారుకున్నాను.

అర్థరాత్రి పగలంతా ఆటపాటలతో నెలకొన్న సందడి ఇప్పుడు నర్తనశాలలో వినిపించటంలేదు. ఎవరూ వుండరనే ఈ ప్రదేశాన్ని నేను ఎంచుకున్నాను. ఇక్కడైతే మరొకరికి తెలియకుండా పనిపూర్తిచేయొచ్చు. ఇంత నిశ్శబ్దంగా కార్యం పూర్తిచేసినందుకు ధర్మార్జున నకుల సహదేవులు కూడా సంతోషిస్తారు. అజ్ఞాతవాసానికి ఎలాంటి భంగం వాటిల్లని ఈ పథకం నిజంగా వారందరికీ నచ్చుతుందనే నా అభిప్రాయం.

అనుకున్న సమయం కోసం నేను, ద్రౌపది ఎదురుచూస్తున్నాం.

కీచకుడు ఇంకా రాలేదు. వస్తాడా, లేక మా పన్నాగం తెలుసుకున్నాడా?

మాలో అనుమానం.

వస్తాడు. తప్పకుండా వస్తాడు. నా నమ్మకం.

కాలం గడుస్తున్నకొద్దీ పాంచాలిలో అనుమానం పెరుగుతోంది.

"అనుమానమొద్దు పాంచాలీ. కామాతురానాం న భయం లజ్జ. అన్నారు. మోహావేశంలో తప్పుడు ఆలోచనలు కలిగివున్నవారు వుచ్చనీచాలు ఎరుగరు. వారి చావును వారే వెతుక్కుంటూ వస్తారు. కీచకుని పీడ రేపటినుంచి నీలాంటి వాళ్ళకుండదు" నెమ్మదిగా చెబుతున్న నా మాటలు దూరంగా వినిపిస్తున్న అడుగుల సవ్వడికి నిలిచిపోయాయి.

నర్తనశాల తలుపులు నెమ్మదిగా తెరుకున్నాయి. "సుందరీ" అది ఖచ్చితంగా కీచకుని స్వరమే.

"ఓహో నాకోసం అప్పుడే కాచుకుని వున్నావా? ఇంత చీకట్లో కూర్చున్నావేమిటి? ఓహో! వెలుతురుంటే ఎవరికైనా తెలుస్తుందని భయమా?" లోపలికి ప్రవేశించి చీకటిలో మంచం వద్దకు చేరుకున్నాడు. నీడగా కనిపిస్తున్న ఆకారాన్ని చూచి సైరంధ్రిగా భ్రమించాడు. హఠాత్తుగా పైనున్న వస్త్రాన్ని తీసేసరికి నా ఆకారాన్ని చీకట్లోనే చూసి వులిక్కిపడ్డాడు.

"ఆయ్! ఎవడురా?"

"నీ పాలిటి యముణ్ణి, సైరంధ్రి భర్తను. ఇవాళ్టితో నీ నూకలు చెల్లు."

"ఓహో నువ్వేనా ఆ గంధర్వుడవు"

నేనిచ్చిన ముష్టిప్రహారానికి అంత దూరానపడ్డాడు.

"ఏయ్" లేచి నా దగ్గరకు పరుగున వచ్చాడు. ఇద్దరి మధ్యా పోరాటం. ఒకరి దెబ్బను మరొకరు కాచుకుంటూ, ఒకరినొకరు ముష్టిఘాతాలతో మోదుకుంటూ అలా ఎంతసేపు జరిగిందో ఎవరికీ తెలియదు. అది అర్ధరాత్రి కావడం వల్ల, నర్తనశాలకు ఎవరూ రానందున మా అరుపులు, కేకలు బయటకు వినిపించవు. అందువల్ల ఈ సంఘటన జరుగుతున్న అంశం బయటి వారెవరికీ తెలియదు. రెండు సింహాలు, రెండు మత్తేభాల మధ్య పోరాటం ఎవరిది పైచేయో ఎవరిది కింది చెయ్యో చెప్పలేని పరిస్థితి. ఒకసారి నాది పై చెయ్యి. మరోసారి కీచకుడిది.

పోరాటం ఆగలేదు, కీచకుడిలో శక్తి నశిస్తున్నకొద్దీ నాలో పట్టుదల పెరుగుతోంది.

అదికూడా దైవలీలేనేమో.

దొరికినచోట దొరికినట్లు నేనిస్తున్న ముష్టిఘాతాలను తట్టుకోవడం కీచకుడికి కష్టమైపోతోంది. అలిసిపోతున్నాడు. నాలో వుత్సాహం.

పిడిముద్దయ్యాడు. కింద పడిపోయాడు. కొనవూపిరితో వున్నాడని అర్ధమైంది. దాపున వున్న పాంచాలిని పిలిచి "దేవీ ఈ దెబ్బతో వీడిపని ఆఖరు" అన్నాను.

"కీచకా! పరకాంతా వ్యామోహం ఎప్పటికైనా ప్రాణహాని అని ఎవరెంతగా చెప్పినా వినలేదు. నీకర్థమయ్యేసరికి ఈ లోకం నుంచి సెలవు తీసుకుంటున్నావు. నీలా ఈ వ్యామోహం వున్నవారు ఇంతవరకు బ్రతికిందిలేదు, వంశం, కుటుంబప్రతిష్ఠ మంటగలిపి నీలాంటివాడు సాధించిందేమున్నది? నీ జీవితం అలాంటి వారికి గుణపాఠం కావాలి" అంటూ చివరి ప్రహారాన్నిచ్చాను అంతే ఆ ధూర్తుడిలో చలనం ఆగిపోయింది.

వంట కట్టెలు వెలిగించి ఆ వెలుగులో కీచకుడి శరీరాన్ని పాంచాలికి చూపించాను. మాంసం ముద్దగా మారిన ఆ శరీరాన్ని పాంచాలి గుర్తించలేకపోయింది.

తన భర్తలే ఈ ధూర్తుడిని అంతమొందించారని మహారాణి సుధేష్ణాదేవికి చెప్పవలసినందిగా ఆమెకు సూచించాను. పాంచాలి ముఖంలో కొత్తవెలుగు. పీడ వదిలిందన్న తృప్తి. రేపటినుంచి ఎలాంటి భయసంకోచాలుండవన్న ధీమా. తరువాత ఎవరిదారిన వారెళ్ళిపోయాం.

ఇప్పటికి మా అజ్ఞాతవాస కాలం ముగిసే సమయం వచ్చింది. పదకొండు నెలలు గడిచిపోయాయి.

మర్నాడు రాజ్యమ్మతా ఇదే చర్చ. వంటశాలలో కూడా దీనిపై అంతా వాదోపవాదాలు చేసుకుంటుంటుంటే నాకేమీ పట్టనట్లు నా పనిలో మునిగిపోయాను.

తమ్ముడి మరనం సుధేష్ణాదేవిలో విషాదాన్ని నింపింది. ఇక సింహబలుని అంత్యక్రియలకు అతని నూటయిదుమంది సోదరులు చర్యలు చేపట్టారు. అతని శవంతోపాటు ఇందుకు కారణమైన పాంచాలిని కూడా కట్టి స్మశానానికి తీసుకెళ్ళారు. ఈ సంగతి తెలుసుకుని వారందరినీ సైరంధ్రి భర్త రూపంలో మట్టుబెట్టాలని అన్నగారి ఆదేశం.

ఇక నేనెందుకు ఆగుతాను. అంతే వాళ్ళపై సింహంలాగా పడ్డాను. నన్ను చూడగానే చెల్లాచెదురైన వారిపై ఒక వృక్షభాగంతో దాడిచేసి అందరినీ హతమార్చాను. ఆ తరువాత నా దారి నాది. ఎవరూ వూహించని ఈ సంఘటనతో సైరంధ్రి అంటేనే అందరికీ భయం పట్టుకుంది. సుధేష్ణాదేవి కూడా ఆమెను అంతఃపురం విడిచి వెళ్ళిపొమ్మని ఆదేశించింది. అందుకు ఆమె "అమ్మా! ఒక్క పదమూడురోజులపాటు ఆశ్రయమివ్వండి. ఆ తరువాత నా దారి నేను చూసుకుంటా"ననడంతో ఏమీ అనలేకపోయింది.

కీచక వధానంతరం ఇది నా పనేనని తెలుసుకోవడానికి ధర్మజ సహోదరులకు ఎంతో సమయం పట్టలేదు. ఒకసారి నేను ఎదురుపడినప్పుడు ధర్మరాజు ముఖంలో ప్రశంసాపూర్వక నవ్వు చూచి నేనూ హాయిగా వూపిరిపీల్చుకున్నాను. గుట్టుచప్పుడు కాకుండా ఇంత ఘనకార్యం నిర్వహించినందుకు నన్ను ఇతర సహోదరులు కూడా అభినందించారు. ఎవరి అనుమతి లేకుండా మొట్టమొదటిసారి నేను చేసిన ఈ పని ఇలా అందరి ప్రశంసలకు దారితీయటం సంతోష కారణమైంది.

**త్రిగర్త దేశాధిపతి** సుశర్మకు కీచకుడంటే భయం. అతను కీచకుని చేతిలో గతంలో ఓడిపోయాడు.

ఇప్పుడు కీచకుడు మరణించాడని తెలుసుకుని తన పగను విరాటుడిపైకి మరల్చాడు. ఉత్తర గ్రహణానికి ముహూర్తం నిర్ణయమైంది. కీచకుడి మరణవార్త విన్న విరాటుడిని బంధించే అవకాశం తనకివ్వవలసినదిగా కౌరవులను సుశర్మ కోరాడు. అందుకు వారంగీకరించి విరటుని గోవుల్ని ఒకవైపు నుంచి సుశర్మ అడ్డగిస్తే, మరునాడు రెండోవైపు ఉత్తర గోగ్రహణానికి తాము వస్తామని దుర్యోధనుడు చెబుతాడు. ముందురోజు సుశర్మ పైకి విరటుడు యుద్ధభూమికి వస్తే అతడిని సుశర్మ బంధించి కరినగరానికి తరలిస్తాడని, రెండోరోజు తాము ఉత్తరగోగ్రహణం చేస్తే విరటుని నగరంలో ఎదిరించేందుకు ఒక్క సైనికుడు కూడా వుండడని, వున్నా తమను, తమ సైన్యాన్ని చూచి పరారీ కావలసిందేనని దుర్యోధనుని పన్నాగం. ఆ మేరకు యుద్ధకు తంత్రం సిద్ధమైంది.

సుశర్మ దక్షిణ గోగ్రహణానికి ముహూర్తం ఖరారైంది. సుశర్మదాడి గురించి తెలిసిన విరాటుడు సర్వసైన్య సమేతుడై యుద్ధరంగానికి బయలుదేరాడు.

అది చూచి ధర్మజుడు, "ఆహా! విధి ఎంత చిత్రమైనది. అజ్ఞాతకాలం ముగిసే సమయంలో మళ్ళీ మమ్మల్ని పరీక్షపెడుతోంది. ఈ గోగ్రహణం నిస్సందేహంగా మా రహస్యాన్ని భేదించడానికి వుద్దేశించినదే" అనుకుని నన్ను పిలిచి "భీమా! మనం మరింత జాగురూకతతో పనులు నిర్వర్తించాల్సిన అవసరం ఏర్పడింది. ఇన్నాళ్ళు మనకు ఆతిథ్యం ఇచ్చినందుకు విరాటునికి సాయపడడం మన కర్తవ్యం. యుద్ధంలో మా అందరికన్నా నిన్ను గుర్తించటం కౌరవులకు తేలిక. అందువల్ల మరింత జాగ్రత్త అవసరం" అని రహస్యంగా చెప్పి, తరువాత విరటుని చూస్తూ, "మహారాజా! పాండవుల కొలువులో పనిచేసినప్పుడు కొద్దో గొప్పో నాకు విల్లుపట్టడం తెలుసుకున్నాను. ఇక మన వలలుని మల్లయుద్ధ ప్రావీణ్యం మీరు ఇప్పటికే గమనించారు. తంత్రీపాల, తామ్రగ్రంధి కూడా అంతో ఇంతో యుద్ధ తంత్రాలు తెలిసినవారే. కాబట్టి ఎటువంటి సందేహాలకు తావులేకుండా మమ్మల్ని కూడా మీతో యుద్ధరంగానికి వచ్చేందుకు అనుమతించండి" అని కోరాడు. అందుకు విరాటుడు అంగీకరించాడు.

ఉత్తర కుమారుడికి అంతఃపురం రక్షణ బాధ్యత అప్పగించి యుద్ధానికి బయలుదేరి వెళ్ళాం. పగలు సాగిన యుద్ధంలో విరటుని సైన్యానిది పైచేయి అయింది. రాత్రి చంద్రోదయం కాగానే కొనసాగిన యుద్ధంలో సుశర్మ సైన్యం పైచేయి సాధించింది. విరాటుడికి, సుశర్మకు మధ్య జరిగిన యుద్ధంలో విరాటుడిని రథం పైనుండి తన రథంలోకి లాక్కుని వేగంగా వెళ్ళిపోతుండటం చూచిన ధర్మజుడు

"భీమా! విరటుని కొలువులో మనం తలదాచుకున్నాం. అతనికి సాయపడడం మన కర్తవ్యం. వెంటనే వెళ్ళి కాపాడు" అని ఆదేశించడం నన్ను వుత్సాహపరిచింది. ఆ మాట అన్నగారెప్పుడంటారో అని ఎదురుచూస్తున్న నాకు మరింత సమరోత్సాహం కలిగింది.

"క్షణంలో ఆ మర్రిచెట్టును పెకిలించి విహారం చేసి విరాటుడిని విడిపిస్తాను. మీరూ, సోదరులు ఆ పక్కన నిలబడి వినోదం చూస్తున్నట్టు ప్రేక్షక పాత్ర వహించడం"డంటూ అడుగు ముందుకేస్తున్న నన్ను ధర్మజుడు తన చేతితో ఆపాడు.

"అలా చేస్తే నువ్వే భీమసేనుడివని తేలిగ్గా శత్రువులు గుర్తిస్తారు. అందువల్ల జరిగే నష్టం మరింత ఎక్కువగా వుంటుంది. మామూలుగా ధనస్సుతోనే యుద్ధం చేయి. నీకు నకుల సహదేవులు సాయంగా వస్తా"రని చెప్పటంతో నా వుత్సాహంపై నీళ్ళు జల్లినట్టయింది. ఇక చేసేదేముంది? అన్నగారి మాటను జవదాటని వాళ్ళంకదా! అన్నగారు చెప్పినట్లే శత్రువులపైకి దూసుకెళ్ళాను. శత్రువుల ఏనుగులు నుగ్గునుగ్గయ్యాయి. రథసారథులు హతులయ్యారు. నా యుద్ధనైపుణ్యాన్ని, శత్రువులను వూచకోత కోస్తున్న నన్ను చూచి విరాటుడికి ఎక్కడలేని ధైర్యం కలిగినట్లుంది. పక్కనే వున్న గదతో సుశర్మకు ఒక్కటిచ్చాడు. సుశర్మను పెడరెక్కలు విరిచి సింహనాదం చేశాను. సుశర్మ సైన్యం చెల్లాచెదురైంది. క్షణంలో మారిన పరిస్థితులకు సుశర్మ సైన్యం విస్తుపోయింది. విజయం సాధించామన్న వారి ఆనందం క్షణంలో ఆవిరైపోయింది.

"ఎవరీతడు? చిచ్చరపడుగులా విరుచుకుపడ్డాడు. క్షణంలో విజయాన్ని అపజయంగా మార్చాడు. సింహబలుడు (కీచకుడు) చనిపోయాడని మనతో చెప్పారు. ఈతడు అతని శక్తిసామర్థ్యాలను పుణికిపుచ్చుకుని అతనికంటే శత్రుభయంకరుడిగా ముందూ వెనుకా చూడకుండా యుద్ధంలో అతి సునాయాసంగా విజయాన్ని సాధించాడు" అని సుశర్మ సైనికుల వ్యాఖ్యానాలు నా చెవిన పడటంతో నవ్వుకున్నాను.

విరాటుడు విముక్తుడైన తరువాత అన్నగారి వైపు చూచి, చేతులెత్తి జోడించి, "అయ్యా! ఇక ఈ రాజ్యం మీది. దీన్ని స్వీకరించండి" అనడం, అందుకు ధర్మజుడు సున్నితంగా తిరస్కరించడం చూచి అంతా ఆశ్చర్యపోయారు.

బలిమితో గెలుచుకున్న రాజ్యాన్ని వద్దన్న ధర్మజుడెవరో వారికి తెలియదు కదా! సకల భూమండలాన్ని ఏలగల ఆయన సామర్థ్యం వీళ్ళకేం తెలుసు? అన్నగారి ధర్మనిరతి, త్యాగనిరతి గురించి వీళ్ళసలు వూహించనుకూడా వూహించలేరు.

"అసలితను వంటలవాడేనా? ఏమి ఈ సాహసం? ఒక్కడే అంత సైన్యం మీదకు భయం లేకుండా, ముందూ వెనుకా ఆలోచించకుండా ఆ దుందుడుకు పోకడేమిటి? ఒక్కడే ఇంత సైన్యాన్ని కకావికలం చేయడమేమిటి? అంతా క్షణాల్లోనే.." నన్ను ప్రశంసిస్తున్న విరాటుని అన్నగారు అడ్డుకున్నారు.

"ఇందులో గొప్పతనం ఏమున్నది? మీ కొలువులో వున్నవారు నిర్వర్తించే కర్తవ్యాన్నే అతనూ చేశాడు. మా విధిని మేము నిర్వర్తించాం. ఇందులో ప్రశంసలకు, పొగడ్తలకు తావెక్కడ?" అంటున్న ధర్మజుని అంతరంగం ఎవరికీ అర్థం కాలేదు. ధర్మరాజు కోరిక మేరకు సుశర్మను, అతడి సైన్యాన్ని విడిచిపెట్టాడు విరాట మహారాజు.

మేము రాజ్యానికి చేరుకునేసరికి విరాటుడిని అక్కడి సమాచారం క్రుంగదీసింది. అదను చూచి ఉత్తర గోగ్రహణానికి కౌరవసైన్యం పాల్పడిందని, వారిని ఎదుర్కొనేందుకు బృహన్నలతో కలిసి ఉత్తర కుమారుడు బయలుదేరి వెళ్ళాడని తెలుసుకున్న విరాటుడికి నవనాడులు క్రుంగిపోయాయి. ఆ సంగతి తెలిసి నేను అన్నగారి వైపు తిరిగాను. ఆయన నన్నూ, నా సోదరులను భయపడవద్దన్నట్టు సైగచేశారు.

"మహారాజా! భయపడవద్దు. వెంట బృహన్నల వుండగా రాకుమారుని వైపు చూడడం ఎవరి తరము కాదు." అని వూరడించాడు.

"ఏం బృహన్నలో? ఏమో? ఆ పేడి ఏం చెయ్యగలడు?" విరటుని ముఖంలో భయాందోళనలు పెరుగుతున్నాయేగానీ తగ్గడంలేదు. ఆయన్ని సముదాయిస్తూ అందరం కూర్చున్నాం.

కౌరవ సైన్యాన్ని ఓడించి ఆలమందలతో విజయుడై ఉత్తరకుమారుడు వేంచేస్తున్నాడన్న వార్త అందింది. దాంతో విరటునిలో వున్న భయాందోళనల స్థానంలో సంతోషాశ్చర్యాలు పరుగులు తీసుకుంటూ వచ్చాయి.

"చూచావా! కుంకుభట్టూ రాకుమారుడిని తక్కువ అంచనా వేశాను."

"మహారాజా నేను చెప్పలేదా? బృహన్నల చెంతనుండగా విజయలక్ష్మి పక్కవారికి దక్కదని. నామాట వినిపించుకోలేదు మీరు" ధర్మరాజు మాటలకు ఆగ్రహం వచ్చింది విరాటునికి.

"అంటే ఏమిటి? నా కుమారుడు ఎందుకూ కొరగానివాడనా మీ వుద్దేశం? ఈ విజయానికంతటికీ ఆ బృహన్నలే కారణమా?" ఆయన ఆగ్రహం ఆగలేదు.

"నిస్సందేహంగా అంతే."

"ఏమిటీ?" కోపాన్ని తట్టుకోలేక వున్న పాచికను విసిరాడు. అది సరిగ్గా అన్నగారి నుదిటికి తగిలింది. దాంతో రక్తం పొంగుకొచ్చింది. అక్కడే వున్న పాంచాలి చీరకొంగుతో రక్తం కిందపడకుండా అదిమిపట్టింది. అది చూచి నాలో ఆవేశం వుప్పొంగింది. అన్నగారి రక్తం కళ్ళచూచిన విరాటుడి భరతం పట్టక తప్పదని ముందుకురికేంతలో "ఏమిటి కొద్దిగా రక్తం పోతే ఏమైంది ఇంత హడావుడి?" విరాటుడు పాంచాలిని చూస్తూ అన్నాడు.

"మహారాజా! ఈ మహనీయుని రక్తం ఎన్ని చుక్కలు కిందపడితే అన్ని సంవత్సరాలు ఈ భూమిమీద వర్షాలు రావు" అని చెప్పింది.

అన్నగారిని సమీపించి, ఎవరికీ వినపడకుండా, "అన్నా! ఆనతివ్వండి. ఈ విరాటుడిని సకుటుంబ సమేతంగా యమపురికి పంపుతాను" ఆవేశంతో వూగిపోతున్న నా చేయి అందుకుని, "సోదరా! ఈతడు అమాయకుడు. మనకి ఆపద సమయంలో ఆశ్రయమిచ్చాడు. అతనిపై క్రోధం తగదు. సర్వం తెలిశాక అతనే పశ్చాత్తాపపడతాడు. నిదానించు."

ఇంత శాంతమూర్తికి ఏమిటీ కష్టాలు? విధి ఇంత క్రూరమైనదా?

***ఇక సంజయరాయబారం సంగతి***

కౌరవులకు, మాకు మధ్య అన్నివిధాలుగా రాజీ దారులు మూసుకుపోయాయి. ఆ సమయంలో మా వద్దకు సంజయుడిని కౌరవశ్రేష్ఠుడు, అంబికా తనయుడు ధృతరాష్ట్రుడు రాయబారం పేరుతో పంపించాడు. "పాలూ నీళ్ళలాగా నా కుమారులు, పాండు కుమారులు కలిసి మెలిసి వుండవలసినవారే. కానీ, దుర్యోధనుడు యోగ్యుడు కాకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. కృష్ణుడు రథసారధిగా అర్జునుడు ధనస్సు నెక్కుపెడితే ఎదురు నిలబడగలిగే వారెవ్వరు? అలాగే చేసిన ప్రతిజ్ఞలను నెరవేర్చేందుకు వృకోదరుడు తప్పకుండా ప్రయత్నిస్తాడన్న ఆలోచన నన్ను మరీ భయకంపితుణ్ణి చేస్తోంది. ముక్కంటితో సహా అందరినీ జయించవచ్చుగానీ పరమ ధర్మావతారులైన పాండునందనులను జయించటం ఎవరితరం? ఈ యుద్ధం నివారించాలంటే సంజయుని వంటి వుత్తముడి వల్ల తప్ప ఇతరుల వల్ల కాదు. అందువల్ల సంజయా! ధర్మజుడికి అందరి సమక్షంలో నా మాటల్ని వినిపించు. ఆ సమయంలో నువ్వు ఎంతో సంయమనంతో మాట్లాడు. ప్రేమ మాటలతో ధర్మజుడికి కయ్యపు ఆలోచన కాకుండా నెయ్యపు ఆలోచన వచ్చేవిధంగా యుక్తితో ప్రవర్తించు. ఇప్పుడు శాంతియత్నమంతా నీ చేతుల్లో వుంచుతున్నా"నంటూ మా వద్దకు పంపాడు.

శ్రీకృష్ణ, ధర్మరాజుతో పాటు మేము నలుగురు సహోదరుల ముందు సంజయుడు కురునాథుని మాటలను విన్నవించుకున్నాడు. అందుకు ధర్మజుడు వుచితరీతిన పలుకుతూనే యుద్ధ సమయంలో మా బలపరాక్రమాలను వివరించి యుద్ధమే అనివార్యమైతే జరగబోయే పరిణామాలను కూడా వివరించాడు.

''గాండీవి భుజబలం కురునాథుడికి తెలియదా? అలాగే కౌంతేయ మధ్యముడి గదా ప్రహారాలను మరిచిపోయాడా? నకుల, సహదేవుల పరాక్రమాలను గుర్తుచేసుకుంటాడా? మా అరణ్యావాస సమయంలో దుర్యోధనాది సోదరుల గర్వభంగం చేసి బందీగా గంధర్వుడు తీసుకెళుతుండగా నా సోదరులు భీమార్జునులే లేకపోతే వారిగతి ఏమయ్యేదో తలుచుకుని భయభ్రాంతుడవుతుంటాడా? ఇప్పటివరకు జరిగిన ప్రతి సంఘటనలోనూ మాదే పైచేయి అన్న విషయం అంబికేయుడు తెలుసుకునాడా? అలా తెలుసుకునే మా ఎదుట నిలవగల సాహసవంతులు లేరన్న వాస్తవాన్ని గ్రహించి నిన్ను రాయబారానికి పంపడం సంతోషం.'' అని ధర్మజుడు ముందరికాళ్ళకు వేస్తున్న గమనించిన సంజయుడు ఇలా అన్నాడు.

''రాజా! కురురాజు దగ్గర నీతిమంతులున్నారు. అవినీతిమంతులున్నారు. సజ్జనులూ వున్నారు. దుర్జనులూ వున్నారు. కానీ అవసర సమయాల్లో వారు ఒకరిమాట ఒకరు వినిపించుకోరు. ఒకరి సలహాలను మరొకరు ఆలకించరు. అంతా ఒంటెత్తు పోకడలే. కానీ నీవు, నీ సోదరుల తీరు అలా వుండదు. నీవు అపర ధర్మావతారుడవన్న విషయం అందరికీ తెలిసిందే నీ నిర్ణయాలు ఎప్పుడూ ధర్మహానికి అవకాశమివ్వవు. అందుకే నీకు, నీ మాటకు నీ సోదరులు అంత విలువ ఇస్తారు. ధర్మ వినాశనానికి నీలాగానే భీమార్జున నకుల సహదేవులు కలలో కూడా అంగీకరించరు. ఇక మీ పెదతండ్రికి వృద్ధాప్యం పైబడడంతో పుత్రప్రేమ ఆయన్ని ఆలోచించుకోనివ్వలేదు. మీకు ఆగ్రహావేశాలొచ్చినా విచక్షణ కోల్పోరు. అధర్మమార్గాన్ని అనుసరించరు. అదే, కౌరవులు పరమ శాంతమూర్తులుగా వున్నా ధర్మమార్గాన్ని తలవరు. ఇదీ వారికీ, మీకూ వున్న తేడా. నిజంగా మీరు కుపితులై విజృంభిస్తే కౌరవనందనులు నిలువగలరా? భీమార్జునులు ఒక్కసారి నిలిస్తే దుర్యోధన, దుశ్శాసన, కర్ణ శకునిలు నిలువగలరా?''

''అత్యంత ప్రియమాటలతో దృతరాష్ట్ర మహారాజు చెప్పమన్న మాటలు శ్రీకృష్ణ, మీ సోదరులు, పురప్రజలు అందరి ఎదుట చెబుతున్నాను. ఆయనే స్వయంగా రథాన్ని కూడా సిద్ధం చేయించారు. ఇలా ఆయనే స్వయంగా నన్ను, రథాన్ని సిద్ధం చేయించి పంపిన ఆంతర్యాన్ని మీరు గమనిస్తారని భావిస్తున్నాను.''

''తెల్లటి వస్త్రానికి మసి అంటుకున్నట్లు మీ వంశానికి దుర్యోధనుడు కళంకం తెస్తున్నాడు. దీనిని నివారించేందుకు నీవే సమర్థుడవు. యుద్ధం వల్ల కలిగే జనక్షయం, బంధువులు, సహోదరులు, మిత్రుల నాశనం తగునా? వృద్ధులను, బంధుమిత్రులను, అన్నదమ్ములను సంహరించినప్పుడు కలిగే శాంతి, సుఖం వల్ల ప్రయోజనమేముంటుంది? ఇది మీకు తెలియని విషయంకాదు. మీకు పెట్టని కోటలా శ్రీకృష్ణుడుండగా, వాయునందనుడు, కిరీటి అండదండగా వుండి విజృంభిస్తే ఇక నిలువగల వారెవ్వరు? ఇక నకుల సహదేవులు, సాత్యకి, ద్రుపదుల బలపరాక్రమాల గురించి ప్రత్యేకంగా చెప్పవలసినవసరం లేదు.''

''ఇక్కడున్న ప్రతి ఒక్కరికీ ప్రణమిల్లి, శోకనివారణకు సహకరించమని ధర్మజుడిని వేడుకుంటున్నా''నంటూ అన్నగారి వైపు చూస్తూ కొనసాగించాడు సంజయుడు.

''అందువల్ల కాస్త వుపశమించి, నిదానంగా ఆలోచించమని కురువంశ సార్వభౌముని సందేశం..''

''సంజయా కయ్యంతో మేము మాత్రం బాపుకునేదేముంటుంది? నెయ్యాన్ని వదిలి కయ్యం దారిని మేమెందుకు ఎంచుకుంటాం ఆలోచించు. ధర్మమార్గం మినహా మరొకటి జనహితం కాదుకదా! కౌరవసుతులు సుఖసంతోషాలతో, ఆనందంతో గడుపుతున్నప్పుడు మా పెదతండ్రి మమ్మల్ని ఎందుకు దూరంగా వుంచాలి? వుచితం కాదని తెలిసినా పుత్రులను సమర్థిస్తూ మమ్మల్ని ఎందుకు పొమ్మని

చెప్పాలి? చేయవలసిన సమయంలో, స్పందించాల్సిన సమయంలో వక్రంగా ఆలోచించి సక్రమంగా ఆలోచించమని కురురాజు మాకిప్పుడు హితవు చెబుతున్నాడు. సద్బుద్ధితో ఆలోచించి తన కుమారులనే సరిగా ప్రవర్తించేలా చూచి ఆయన లోకం మెప్పుపొందవచ్చుకదా! ఆయన నీతిమార్గాన్ని విస్మరించి, నీతి తప్పని మమ్మల్ని ఆలోచించమని చెప్పడం వుచితమా?'' ధర్మజుని మాటలు మా సోదరులందరికీ వినసొంపుగా వున్నాయి.

సంజయుడి మాటల్ని ఆలకించి ధర్మరాజు యుద్ధసన్నాహాలను విరమిస్తాడేమోనన్న సందేహం కలిగింది. ఎలాగైనా ధర్మజుడు ధర్మజుడే ధర్మమార్గంలో నడిచేవారికి ఎప్పుడు ఎలా నడుచుకోవాలో వేరొకరు చెప్పనక్కర్లేదు. ఎవరిని ఎలాదారికి తెచ్చుకోవాలో వారికి పూర్తిగా తెలిసిన విషయమే. సుతిమెత్తగా తన అభిప్రాయాన్ని స్పష్టం చేయడం నన్నానందింపచేసింది.

''సర్వం కోల్పోయి సోదరులు, సతితో కూడి అడవుల పాలై ఇక్కట్లు పడింది ఇందుకేనా? ఇలా ధృతరాష్ట్రుని మాటల్ని ఆలకించి నెమ్మదించేందుకేనా? రోషాన్ని, క్రోధాన్ని వెళ్ళగక్కే వాయునందునుడిని సముదాయించి ఎప్పటికప్పుడు శాంతస్వరూపుడిగా మారేలా చేసింది ఇందుకేనా! ఇంతకాలం వృకోదర, అర్జున, నకుల, సహదేవులను నిదానించమని చెప్పి ఇప్పుడు బలపరాక్రమాలు ప్రదర్శించాల్సిన సమయంలో వారించటమా?''

నాకు అగ్రజునిలో క్రొత్త ధర్మజుడు కనిపిస్తున్నాడు. ఆయనలో సోదరుల పట్ల ఇంత అభిమానం, ప్రేమ దాగున్నాయా? ఈయన నిజంగా నేనేకాదు, ఎవరూ వూహించని ధర్మరాజు. ఆయనలో ఇంత ఆగ్రహావేశాలు చూడటం వింతగా అనిపించింది. అజాత శత్రువులో ఇంత వుద్రేకం, వుద్వేగం దాగున్నాయా?

''ఇప్పుడూ నేను కౌరవశ్రేష్టుడి మాట ఆలకించి ఒకవేళ నిదానించినా నా సోదరులను ఏ విధంగా సముదాయించగలను? కపిరాజు చూస్తుండగా పార్థుడు భుజపరాక్రమాలు చూపవద్దని, చేసిన ప్రతిజ్ఞలు మరిచిపొమ్మని వాయునందనుడిని ఎలా కోరగలను? మా భుజపరాక్రమాలు విస్మరిస్తే రాజపుత్రుల కంతకంటే ధర్మహీనత వుంటుందా?''

పాండవశ్రేష్ఠుడు చెబుతున్న ఒక్కొక్కమాట ఒక్కొక్క వజ్రఘాతమై సంజయునిలో కలవరం కలిగించిందని అతని స్థితిచూడగానే అనిపించింది.

అగ్రజుని ప్రతాప వాక్యాలు మమ్మల్ని ఎంతో వుత్తేజపరుస్తున్నాయి. ఇక యుద్ధం అనివార్యమని, మా శక్తిసామర్థ్యాలు చూపే తరుణమాసన్నమైందని అవగతమై నా ముఖంలో సంతోషఛాయలు ముప్పిరిగొన్నాయి. ముఖ్యంగా నాలో అయితే చెప్పనలవిగాని ఆనందం.

ధర్మనందుని అంతరంగాన్ని అర్థం చేసుకున్న సంజయుడు వెనుదిరిగాడు. ధర్మజుని సంకల్పం విని వెనుదిరిగేముందు సంజయుడు ఇలా అన్నాడు.

''ధర్మజా! నీ ధర్మనిరత, నీ సోదరుల బాహుబలపరాక్రమాలు లోకవిదితమే. కురువృద్ధులందరికీ అవగతమే. ఆంబికేయునికీ సంపూర్ణంగా తెలుసు. నీవు, నీ తమ్ములతో కలిసి ఆవహరంగంలో నిలిస్తే మానవులే కాదు దేవతలు కూడా నిలువలేరు. ముఖ్యంగా భీముని బలపరాక్రమాలకే కురునాథుడు కలవరపడుతున్నాడు. అతని బలం ఎదుట కాలుడు కూడా నిలువలేడని ఆయన భయం.''

సంజయుని మాటలు విన్న వెంటనే, ''నేను చేసిన ప్రతిజ్ఞలు తలుచుకుని బహుశా పెదతండ్రి కలవరపడుతుండవచ్చు. ఆయన కుమార శ్రేష్టులైన దుర్యోధన, దుశ్శాసనులను లోకభీకరరీతిలో వధిస్తానని కదా నా ప్రతిన. దాన్ని నెరవేర్చక తప్పదు. దాన్ని నివారించటానికైనా మా భాగం మాకివ్వవచ్చుకదా! ఇంతకీ మేము శాంతించి ఏమి చేయమని ఆయన వుద్దేశం? రాజ్యమా ఇవ్వరు. మా ప్రతాపాలనా భరించలేరు. మరి ఆయన మాకిచ్చే కర్తవ్యమేమిటో ఎంత ఆలోచించినా అవగతం కావటంలేదు'' నా మాటల్ని మధ్యలోనే అర్జునుడు అందుకున్నాడు.

"సోదరా! వృకోదరా అన్నీ మన ఎదుటే వుండగా ఇంకా అర్థమయ్యేదేమిటి? మనం రాజ్యం మాట తలవకుండా శాంతచిత్తులమై వారికి లొంగి బ్రతకాలన్నమాట. వారి శరణాగతిని అర్థించి వారి అడుగులకు మడుగులొత్తుతూ జీవితాన్ని గడపాలి. అంతేకదా! సంజయా! పెద తండ్రిగారి వుద్దేశం."

"ఆ దాస్యమా! అంత చేతకాని వారెవరున్నారిక్కడ? అన్నగారూ ఇదంతా అనవసర ప్రయత్నాలు. కాలమహిమ కాకపోతే కురురాజు ఇంత అన్యాయ ప్రయత్నానికి ఎందుకు ఒడిగడతాడు?" సహదేవుడు ఆవేశపూరితంగా అన్నమాటలకు తలూపుతూ,, విన్నారుగా సంజయా సోదరుల సమాధానం. ఇక నేను చెప్పేదేమున్నది? కాగలగినది ఆపినా ఆగదు కదా! ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా మూర్ఖులతో మైత్రి ఎప్పటికీ ప్రమాదమేగానీ ప్రమోదం కాబోదు. మా చిత్తాన్ని సావధానంగా ఆలకించి తగురీతిన కౌరవసభకు తెలియజేయండి" అని ధర్మజుడు స్పష్టం చేయడం మా అందరికీ సమ్మతిగానే కనిపించింది.

మొట్టమొదటిసారి నిష్టూరంగా మాట్లాడినా ధర్మజుడు వాస్తవదృష్టితో స్పందించాడనిపించింది. ఇంత నిక్కచ్చిగా ఆయన ఎన్నడూ మాట్లాడలేదు. కాస్త పౌరుషంగా వినిపించినా అందులోని సత్యాన్ని విడమరచి చెప్పడం నావరకు నాకు సంతృప్తినే కలిగించింది.

ధర్మరాజు అలిగితే లోకం ఎదిరించగల శక్తిలేదు. ఈ విషయంలో ఒక సందర్భంగా శ్రీకృష్ణుడు అన్న మాటలు గుర్తుకొచ్చాయి. "ఇంద్రపదవినైనా ధర్మరాజు అధర్మంతో ఆక్రమించుకోవాలని ఎన్నడూ భావింపడు. తగురీతిలో తన రాజ్యాన్ని హస్తగతం చేసుకుంటేనే రాజ్యపదవిని అధిష్టిస్తాడు" ఇందులో వాస్తవమెంత దాగుందో ధర్మజునితో అతి దగ్గరగా వున్నవారికి మాత్రమే అర్థమవుతుంది.

ఇక రెండువైపులా యుద్ధవాతావరణం జ్వాలామయమౌతోంది. ఈ నేపథ్యంలో చివరి ప్రయత్నంగా మాకు ప్రియతముడు, శ్రేష్టుడు అయిన బ్రాహ్మణుడిని రాజీ ప్రయత్నాలకు పంపుదామని ద్రుపదుడు అభిప్రాయపడ్డాడు. అందుకు సాత్యకి ప్రభృతులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో రాయబారం చేయవలసిందిగా శ్రీకృష్ణుడిని ధర్మజుడు ప్రార్థించాడు.

"వాసుదేవా! మాకు నిన్ను మించిన బంధువు, హితుడు మరొకరు లేరు. ఈ రాయబార కార్యక్రమాన్ని నీవే నిర్వర్తించాలి. ఇదే ఆఖరి శాంతిప్రయత్నం కావాలి. ఇది కూడా నెరవేరకపోతే యుద్ధం తప్పదని స్పష్టంగా మా మాటగా చెప్పు." ధర్మజుడు ఇంతగా శాంతిప్రయత్నం చేసినా ఫలితందక్కలేదు. మూర్ఖుల మనస్సు మార్చడం ఎవరితరం కాదుకదా!

కృష్ణరాయబారం కూడా విఫలం కావటంతో దుర్యోధనాదులు రుజువు చేశారు. రాయబార సమయంలో కౌరవసభ వివరాలను తెలుపుతున్న సమయంలో కౌంతేయాగ్రజుడు మమ్మల్ని పిలిపించాడు. మా సమక్షంలోనే ఆ వివరాలను తెలియజేయమన్నాడు.

ఎప్పుడు ఎలా స్పందించాలో అగ్రజునికి తెలిసినంతగా మరొకరికి తెలియదు. ధర్మసూక్ష్మాలన్నీ తెలిసిన ఆయనకు మరొకరు ధర్మం గురించి చెప్పనవసరంలేదు. కౌరవసభలో జరిగిన వాస్తవాలు మాకూ తెలియటం మంచిదని అన్నగారు ఆ విధంగా మా ఎదుటే కృష్ణుడిని వివరించమన్నారని నాకు అర్థమైంది. అందుకే భీష్మద్రోణాదులకు ఆయనంటే అంత అభిమానం. మొత్తం ఇప్పటివరకు జరిగిన సంఘటనలో మాతో సంప్రదించకుండా ఆయన తీసుకున్న నిర్ణయం ఒక్కటే.

మాయాద్యూతంలో మాకు తెలియకుండా, ఎవరూ వూహించని విధంగా మమ్మల్ని పందెంగా ఒడ్డటం మినహా మిగిలినవేవీ ఆయన మాకు తెలియకుండానో, రహస్యంగానో వుంచలేదు. మమ్మల్ని పందెంగా ఒడ్డటంలోనూ ఆయన ధర్మాన్ని మీరలేదనే మా అభిప్రాయం.

కురుక్షేత్ర సంగ్రామానికి రెండువైపులా ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. కౌరవుల వైపు భీష్మపితామహుడు, గురువర్యుడు ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ సర్వసన్నద్ధులై వున్నారు. ఇటువైపు పాండవ మధ్యముడు, ధర్మరాజు, నేను, నకుల సహదేవులు, ధృష్టద్యుమ్నుడు. యుద్ధ ప్రారంభం కోసం ఎదురుచూస్తున్నాం. రెండు పక్షాలు యుద్ధశంఖాలు పట్టుకుని వేచి చూస్తున్న

సమయంలో ధర్మరాజు కవచాన్ని తొలగించి, ఆయుధాలు రథంలో వుంచి కాలినడకన తలవంచుకుని వినయంతో వైరిపక్షం వైపు వెళ్ళడం నాకు విభ్రాంతి కలిగించింది.

"ఇదేమిటి అన్నగారు ఇలా ఒంటరిగా శత్రుపక్షంవైపు వెళ్తున్నారు. ఇందులో మర్మమేమిటి?" నా ఆలోచన నాలో వుండగానే, విజయుడు నన్ను సమీపించాడు.

"కౌంతేయ మధ్యమా! అన్నగారి ప్రవర్తన ఇలా వుందేమిటి? యుద్ధానికి తరలివచ్చి ఇప్పుడు వైరిపక్షంతో సంధికోసం వెళ్తున్నారా ఏమిటి? అయినా అవన్నీ గతించాయి కదా! మళ్ళీ ఈ ప్రయత్నమేమిటి?" అన్నాడు. అతనిలాగానే నాకూ అన్నగారి చర్యలో అంతరార్థం బోధపడలేదన్నట్టుగా పెదవి విరిచాను. మాలాగే నకుల సహదేవులు కూడా ఆశ్చర్యచకితులై ధర్మరాజుని చూస్తుండిపోయారు.

నలుగురు సోదరుల హావభావాల్ని గమనించిన శ్రీకృష్ణపరమాత్మ "పాండవేయులారా! ధర్మరాజు అంతరంగం నాకు అవగతమైంది. భీష్మ ద్రోణాదులను అత్యంత భక్తిప్రపత్తులతో నమస్కరించి యుద్ధం ఆరంభించేందుకు అనుమతి తీసుకోవాలని ధర్మజుని ప్రయత్నం. అందులో తప్పు పట్టాల్సినదేమీలేదు. ఇలాంటి మర్యాదానుసరణం విజయానికి సంకేతం. ఆయన సంకల్పం సహేతుకం, శ్రేయస్కరం" అనటంతో వూపిరి పీల్చుకున్నాం.

వాసుదేవుడు చెప్పినట్లుగానే గాంగేయుడిని సమీపించి చేతులు జోడించి "తాతా! కులానికి పెద్దవు. ఈ యుద్ధంలో నాకు సర్వదా తోడుంటావనుకున్నాను. కానీ, నా దురదృష్టం కొద్దీ నువ్వు వైరి పక్షంలో వుండే దుస్థితి. దయచేసి నన్ను ఆశీర్వదించు" అన్నాడు పాండవాగ్రజుడు.

అతని ధర్మనిరతికి ఆనందపడిపోయాడు భీష్ముడు. ధర్మజుని కోరిక మేరకు "విజయోస్తు" అని దీవించాడు. అలాగే గురువు ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు కూడా.

అప్పటికిగానీ శేషపాండవులకు ధర్మజుని అంతరంగం అర్థంకాలేదు.

"అందుకే ఆయన ధర్మజుడయ్యాడు. ధర్మనిరతులెపుడూ ధర్మ విసర్జకులు కాలేరు. ధర్మో రక్షితి రక్షితః అన్న సూక్తిని మరిచిపోరు. వారు నిద్రించినా, మేల్కొన్నా ధర్మమార్గాన్ని గురించే ఆలోచిస్తారు. అందుకు మా అగ్రజుడే సాక్ష్యం. ఇంత క్లిష్టసమయంలో కూడా ఆయన ధర్మాన్ని విడనాడలేదు. ఎవరేమనుకుంటారోనన్న శంకలేదు. వైరిపక్షంలోని పెద్దలకు గౌరవసూచకంగా నమస్కరించి ఆశీస్సులు అందుకోవడం ఆయన ఔన్నత్యం. ఆయన్ని అగ్రజుడుగా పొందడం మా పూర్వజన్మసుకృతం. మా జన్మ ధన్యమైంది" మనసులోనే నమస్కరించుకున్నాను. బహుశా ఇతర సోదరులుకూడా ఇలాగే ఆలోచిస్తూ వుండివుంటారు.

యుద్ధమంటే అనాసక్తి చూపే మా అన్నగారు యుద్ధరంగంలో శత్రుభయంకరుడే ఒకసారి ఆయన్ని "యుద్ధమంటే ఎందుకు మీకింత చిన్నచూపు? ఆ పేరు వుచ్చరించడానికి కూడా అంగీకరించరు. ఆ మాట చెబితేనే శాంతి, శాంతి అని పఠిస్తుంటారు రాచబిడ్డలకు యుద్ధరంగం క్రీడాస్థలం కాదా?" అని అడిగాను. నేను అడిగినదాంట్లో కాస్త దిక్కారధోరణి కనిపించింది.

నా మాటలకు ధర్మజుడు నవ్వాడు.

"రాజులకు యుద్ధరంగ విహారం కన్నా పరమోత్తమ ధర్మంలేదు. నృపతుడైనంత మాత్రాన యుద్ధమే తప్ప మరేమీ లేదనడం సరికాదు. ఆహవరంగమనేది రాజులకు చివరిమార్గం. నీ రాజ్యంపైకి పరరాజు దండెత్తినప్పుడో, నీ రాజ్యాన్ని కబళించేందుకు ఇతరులు ప్రయత్నించినప్పుడో తప్ప అనవసర యుద్ధాలకు పాల్పడకూడదు. యుద్ధం వల్ల అశాంతి, స్వజననాశనం, చోరభయం, స్వధర్మనాశనం మొదలైనవి తలెత్తుతాయి. ఇవి యుద్ధంలో ఓటమికంటే భయంకరమైనవి. అందుకే యుద్ధం పట్ల నేను విముఖంగా వుంటాను. అలాగని

శత్రురాజుల ఎదుట మోకరిల్లుతాననుకోవడం పొరపాటు. మనకై మనమెవరి పైకి యుద్ధానికి కాలుదువ్వకూడదు'' అని చెబుతున్నప్పుడు ఇంతటి మహానుభావుడు నా సహోదరుడని చెప్పుకోవడానికి ఎంత పుణ్యం చేసుకున్నానో.

మళ్ళీ కురుక్షేత్ర భూమిపై జరుగుతున్న యుద్ధం దగ్గరికి వద్దాం.

నావరకు యుద్ధమంటే వివాహవేడుకకు వెళ్ళినంత వుత్సాహంగా బయలుదేరతాను. యుద్ధభూమి పేరు చెబితేనే నాలో ఎక్కడలేని ఉత్సాహం పొంగుకొస్తుంది.

''అదేమిటి భీమసేనా! యుద్ధమంటే అంత హుషారు నీకు? అదేమైనా వేడుకా సంతోషంతో మునిగితేలటానికి?'' అని ఎవరైనా అడిగితే నా వైఖరికి విరుద్ధంగా ఆరోజు చిరునవ్వు విసిరాను.

***మొదటిరోజు యుద్ధం మొదలైంది.***

కౌరవసేన గాంగేయుని సారథ్యంలో ఉరకలు వేస్తోంది. మదించిన ఏనుగులు నాపైకి వుసిగొల్పటంతో వాటినన్నింటినీ తుత్తునియలు చేస్తూ ముష్టిఘాతాలతో అంతమొందిస్తూ, దొరికిన ఏనుగును దొరికినట్లు చిన్నరాయిని విసిరేసినట్లు, నేను భీష్ముడిపైకి పరుగుతీశాను. ప్రళయ జంఝామారుతంలా విజృంభిస్తున్న నన్నుచూచి ఏనుగుల మంద వెనక్కి తిరిగి దొరికినవారిని దొరికినట్లు తొక్కుకుంటూ, తోసుకుంటూ పారిపోయాయి.

నన్నూ, నా ప్రళయకాల రూపాన్ని చూచిన గాంగేయుడు ఒక్కుమ్మడిగా నాపై అమ్ములవాన కురిపించాడు. నేనూ అదే మంత్రం పఠించాను. ఇద్దరం సంధించిన బాణాలు మధ్యలోనే ఒకదానిని మరొకటి తుత్తునియలు చేసుకుని వృథాగా పడిపోయాయి. నాకు అత్యంత ప్రియతముడు, సోదరుడు గాండీవి కుమారుడు అభిమన్యుడు మధ్యందిన మార్తాండునిలా ప్రళయకాల విజృంభణ చూచి నాకు ముచ్చటేసింది. నా చూపు అభిమన్యుడివైపు మళ్ళింది. మేమిద్దరం కదలి ఆహవరంగంలో సృష్టించబోయే భీకరదృశ్యాలను వూహించినట్టున్నాడు భీష్ముడు. మమ్మల్ని దునుమాడేందుకు యత్నిస్తూ నిలువరించే పథకాలు చేస్తున్నాడు. సరిగ్గా ఆ సమయంలోనే దుర్యోధనుడు భీష్ముని చెంతకు చేరాడు.

భీష్ముడి తరువాత నా దృష్టి కృపాచార్యుడిపై పడింది. మూడు అమ్ముల్ని ఏకకాలంలో భీష్ముడిపై సంధించి ఆయన జవాబుకోసం ఎదురుచూడకుండా మరో బాణంతో కృపాచార్యుడి కవచాన్ని చీల్చివేయగలిగాను. ఇది చూచి దుర్యోధనుడు విస్తుపోయి, ''ఔరా! భీమసేనుడు గదాయుద్ధంలోనే కాదు, భీషణ బాణప్రయోగంలోనూ అఖండుడే'' అనడం పలువురికి వినిపించింది. శాత్రవుడిని మెచ్చుకోవడం దుర్యోధనుడికి అసలు ఇష్టం వుండదు. అందులోనూ నన్ను మెచ్చుకోవడం అంటే మాటలా? కృపాచార్యుడి తరువాత ప్రక్కనే వున్న శల్యుని వైపు నా బాణం మళ్ళింది. నా వాడి శస్త్రాలకు శల్యుడు యుద్ధరంగం నుంచి పారిపోక తప్పలేదు. శల్యుని తరుముతూ అతని వెంటే పరుగులు తీసిన నన్ను నిలువరించేందుకు ప్రయత్నించిన వారంతా నా ప్రచండ ధాటికి తలొగ్గక తప్పలేదు. రథసారథులను మట్టుబెడుతూ, రథాలను తుత్తునియలు చేస్తూ ఆనాటి యుద్ధంలో నాదే పై చేయిగా కనిపించేలా చేయగలిగాను. ధర్మజుడు, కిరీటి, నకుల సహదేవులు, వాసుదేవుడు, చివరకు శత్రువుల మెప్పుకు కూడా పొందాను.

ఇక గాంగేయుని సంగతి వేరే చెప్పనవసరంలేదు. ఆయన ఎదుట నిలబడగలవాడు ఈ భూప్రపంచం మీద ఎవ్వరున్నారు? ఆయన చేతిలో ఆయుధం వున్నంత వరకు ఆయన్ని నిరోధించగలవారెవ్వరు? ఆయన్ని దొంగచాటుగా దెబ్బతీయడం ఎవరితరంకాదు. మొదటిరోజు నా ప్రతాపాగ్నికి మురిసిన ధర్మజుడు, భీష్ముని వీరవిహారానికి కలవరపడ్డాడు. ఇదే అంశాన్ని కృష్ణుడి ముందు వ్యక్తం చేశాడు.

''ధర్మజా! గాంగేయుడమే ఎవరనుకున్నావు? రాజులందరిపై కినుక వహించి 32సార్లు భూతలంపై దండెత్తిన పరశురాముడినే ఎదిరించి నిలిచిన పోటుగాడు. చేత ఆయుధమున్నంత వరకు ఎవరూ అతనివైపు కన్నెత్తి చూడలేరు. ఆయుధ విసర్జన అతనెలా చేస్తాడు

చెప్పు. శిఖండితోనే అతడు యుద్ధం చేయడు. మిగిలిన వారెవ్వరూ అతని ముందు ఆయుధ ప్రహారం కూడా చేయలేరు'' అనడంతో ధర్మరాజు పక్కనే వున్న నన్ను చూచాడు. నేను మాత్రం ఆయన్ని ఎలా సమాధానపరచగలను?

రెండోరోజు యుద్ధంలో పితామహుడు క్రౌంజవ్యూహాన్ని నిర్మింపజేశాడు. దాన్ని గమనించిన అర్జునుడు ఆ వ్యూహాన్ని భేదించే పనిలోపడ్డాడు. అతనికి సాయంగా నేను, నాకు ధర్మరాజు, అతనికి నకుల సహదేవులు ఇలా గాంగేయునితో గాండీవి సలిపిన యుద్ధం చూచి తీరవలసిందే రెండు సింహాలు విజృంభిస్తే మధ్యలో శలభాల్లా ఎందరో మాడిపోయారు. భీష్ముడు రోసిల్లి వేసిన బాణం శ్రీకృష్ణుడి వక్షస్థలాన్ని చీల్చడంతో రక్తంపారింది. ఆ రక్తకాంతిలో అర్జునుడికి రథసారధిగా వున్న శ్రీకృష్ణుడి మోము సూర్యబింబంలా కనిపించింది.

దృష్టద్యుమ్నుడు, ద్రోణుడు ఇవాళ ఒకరికొకరు ఎదురుపడ్డారు. అంతే. ఒకరిని సంహరించాలని మరొకరు, తనదే పైచేయి కావాలని ఇంకొకరు ఇలా సంకుల సమరం చేశారు. ద్రోణాచార్యుడు కాలయముని వలె దృష్టద్యుమ్నుడిపై పడడంతో నిలువలేకపోతున్న అతన్ని గమనించి బాసటగా వచ్చి, గురుదేవులను ఎదుర్కొన్నాను. దుర్యోధనుడు నన్ను నిలువరించవలసిందిగా కళింగాధిపతిని పంపాడు. ఈలోగా ద్రోణుడి చేతిలో దృష్టద్యుమ్నుడి రథం తుత్తునియలైంది. దాంతో అతను రంగం నుంచి నిష్క్రమించాడు.

ఇంతలో దుర్యోధనుడి ఆదేశం మేరకు నాపైకి చేది, కళింగ దేశాధిపతులు వచ్చారు. ఎవరు ఎవరిని హతమారుస్తున్నారో, ఎవరి చేతిలో ఎవరు హతులవుతున్నారో అర్థంకాని స్థితి. నాపైకి కేతిమంతుడు బాణప్రయోగాలు చేశాడు. అతన్ని బాణాల్ని గాలిలోనే వృధాచేసి రథాన్ని కూల్చి రథసారధిని అంతమొందించిన తరువాత నా చేతిలోనే కేతిమంతుడు హతుడవటం చూచి కళింగాధిపతి శక్రదేవుడు నాపైకి దూసుకొచ్చాడు. నా రథాశ్వాలను చంపటంతో గదతో శక్రదేవుడిపైకి లంఘించాను. ఒకే ఒక్కవేటు అతని తలపగిలి అక్కడికక్కడే క్షణాల్లో కూలాడు. కళింగాధిపతి సహోదరుడు భానుమంతుడు ఇది చూచి నావైపు పరుగుపరుగున వచ్చాడు. అన్న మరణానికి ఒక్క క్షణం నిరుత్తరుడయ్యాడు. అంతలోనే జేవురించిన ముఖంతో ''వృకోదరా నిలునిలు కాచుకో'' అంటూ నన్ను చుట్టుముట్టాడు. అతని వెన్నంటి శ్రుతాయువు. భానుమంతుడొస్తున్న ఏనుగుపైకి లంఘించి నన్ను నిలువరింప చూస్తున్న వారందరినీ ఒంటరిగానే ఎదుర్కొన్నాను. ఒకే ఒక్క ముష్టిఘాతం. భానుమంతుడి ఏనుగు కూలిపోయింది. నా చుట్టూ చేరిన ఏనుగులకూ అదేగతి.

**రథం లేని** నాకోసం క్రొత్తరథం రావడంతో దాన్ని అధివసించాను. ఈ దశలో శ్రుతాయువును ఎదుర్కొన్నాను. నేను శ్రుతాయువుతో పోరాడుతున్న సమయంలోనే సాత్యకి, దృష్టద్యుమ్నుడు, శిఖండి ఒక్కుమ్మడిగా దేవవ్రతుడిపైకి లంఘించారు. ఎందరైనా భీష్ముడు బెదురుతాడా? ఎంతమంది వచ్చినా సూర్యుడి ముందు దివిటీలా ఎలా తెలా పోతున్నారు. భీష్ముడి ధాటికి ఆగలేకపోతున్న వారిని చూచి నేను వారితో కలిసి గాంగేయుడిని ఎదుర్కొన్నాను. అయితే కురువృద్ధుడి ముందు ఎన్ని బాణాలైనా నిలుస్తాయా? అన్నీ వృధాయే. శరాలను నమ్ముకుంటే లాభంలేదని భావించి గదతోనే యుద్ధానికి దిగాను. ఆరోజు యుద్ధంలో కూడా నన్నే అందరూ అభినందించారు. ప్రత్యేకంగా సాత్యకి నావద్దకు వచ్చి అభినందించి వెళ్ళాడు. అలా రెండోరోజు యుద్ధానికి తెరపడింది.

***ఇక మూడోరోజు.***

కౌరవసేనకు నేనంటే బెదురు వచ్చింది. రెండురోజుల్లో నేను వారిని దునుమాడిన ఘటనలు వారి కళ్ళలో మృత్యుభీతిని తెప్పించింది. ఈ అంశం అవగతమైందేమో నా బారి నుంచి వారందరి రక్షణ బాధ్యత గంగాసుతుడు తీసుకున్నాడు. మా పక్షం వారికి నేను కవచంలా నిలిచాను. మధ్యాహ్నం వేళకు అలా ఒకరిపై మరొకరి దాడులు, ప్రతిదాడులు. ఒకసారి ఒకరిది, మరోసారి ఇంకొకరిది

పైచేయి. ఎపుడు ఎవరు ఎలా విజృంభిస్తారో, ఎవరెలా వెనకడుగు వేస్తారో చెప్పలేని స్థితి. నా సమీపంలో వున్న వైరివర్గంపై పిడిగుద్దులతో విరుచుకు పడుతూ ఏనుగుల మందను తరుముతూ దూసుకుపోతున్నాను. దుర్యోధనుడి ఆజ్ఞమేరకు నాపై కొందరు దూకారు. వారందర్నీ ఎదుర్కొంటూ, చెల్లాచెదురు చేశాను. నాకు తోడు సుభద్రాసుతుడు అభిమన్యు కుమారుడు, ద్రౌపది కుమారులు. మా ధాటికి తట్టుకోలేక కౌరవసేనలు కాళ్ళకు బుద్ధి చెప్పాయి. అదే సమయంలో ఇతరులపై విరుచుకుపడుతున్న నా ధనస్సును దుర్యోధనుడు ధ్వంసం చేశాడు. వేరే విల్లు అందుకున్నాను. విల్లు విరిగినంతమాత్రాన వెన్నుజూపే వాడనా నేను?

అదే వూపుతో దుర్యోధనుడిపైకి బాణాల పరంపరను వదిలాను. దుర్యోధనుడూ నాపై తొమ్మిది బాణాల్ని ఒకేసారి వదిలాడు. అవన్నీ నాముందు పనిచేయలేదు. నేనూ అతని పైకి పదిబాణాలు ఒక్కసారిగా వదలడంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు. దుర్యోధనుడి విల్లువిరిగింది. ఒకరిపైకి మరొకరు రోషపూరితులమై భయంకర యుద్ధమొనర్చాం.

అదే సమయంలో నాపైకి 14 మంది కౌరవ కుమారులు ఒక్కసారిగా దూకారు. నా ప్రతిదాడిలో జలసంధ కుమారుడు, సుషేణుడు, భీమబాహువు, ఉగ్రుడు, భీముడు, భీమరథుడు, లోలుపుడు, సముడు, సులోచనుడు, దుష్టదుర్షుడు తదితర కౌరవ కుమారులు హతులయ్యారు. ఒకేసారి ఇంతమంది కౌరవకుమారులు నా చేతిలో హతులవటం చూచి దుర్యోధునుడు నిశ్చేష్టుడయ్యాడు.

ఎలాగైనా మట్టుబెట్టాలన్న ఆగ్రహంతో దుర్యోధనుడు నన్ను ఎదుర్కొన్నాడు. అతనికి బాసటగా గాంగేయుని ఆదేశంపై మరికొందరు ఇంతమంది ఒక్కసారిగా నాపైపడి నన్ను ఉక్కిరిబిక్కిరి చేశారు. ఎవరు బాణం వదులుతున్నారో, ఎవరు శరంతో వచ్చారో, ఎవరు ఏ ఆయుధంతో వున్నారో నాకైతే తెలియలేదు. అప్పటికే మూడురోజులుగా భీషణ పోరులో కొంతవరకు అలసి వున్నానేమో. మైకం కమ్మింది. ఆ విధంగా నన్ను యుద్ధరంగం నుంచి ఆ రోజుకు తప్పించాల్సి వచ్చింది.

నా శక్తియుక్తులు ధర్మజునికి బాగా తెలుసుననడానికి కురుక్షేత్ర యుద్ధ సమయంలో ఆయననేకసార్లు మాటల ద్వారా వ్యక్తీకరించాడు. " ఆచార్యుడి విజృంభణ చూస్తుంటే భయంగా వుంది. నువ్వక్కడికి వెళ్ళి ఒక్కసారి సింహనాదం చేస్తే పరిస్థితి కొంతమేరకు మనకు అనుకూలంగా మారుతుందనుకుంటున్నాను" అని నన్ను ఉత్సాహపరచడం వెనుక ఆయన నాపై వున్న విశ్వాసం వ్యక్తమైంది.

అప్పటివరకు అన్నగారికి రక్షణగా నిలిచిన నేను ఆయన ఆజ్ఞమేరకు పార్థునికి సాయంగా వెళ్తూ పక్కనే వున్న దృష్టద్యుమ్నుడిని చూసి, "అగ్రజుని రక్షణభారం తీసుకో. నీమీద పూర్తివిశ్వాసంతో వెళ్తున్నా"నని రథాన్ని అటు మళ్ళించమని సారధికి చెప్పాను.

ద్రోణుడివైపు వెళ్తుండగా, "భీమసేనా! నీ తమ్ముడు సవ్యసాచి నా అనుమతితోనే ఇటెళ్ళాడు. నేను నీకు అనుమతించాలి కదా!" అని వ్యంగ్యంగా గురుదేవుడనడం నాకు ఆవేశాన్ని తెప్పించింది.

"పాండవులు దేవతల సైన్యాన్ని కూడా లక్ష్యపెట్టరు. మీరు గురువులు కాబట్టి ఇంత గౌరవం ఇస్తున్నాం. అయినా మీరు శత్రువుల పక్షాన వున్నారు కాబట్టి మీకు తలవంచేదిలే"దంటూ గదను విసిరాను. ఆ గదాఘాతానికి ద్రోణుడి రథం, సారథి కూలిపోయారు.

వెంటనే ఆయన మరో రథమెక్కి నన్ను ఎదుర్కొన్నాడు.

ఆయన వేస్తున్న బాణాలను నేనసలు పట్టించుకోలేదు. రథం దిగి సేన మధ్యలోకి చొచ్చుకుపోతూ ద్రోణుడి రథాన్ని విసిరేశాను. వెంటనే మళ్ళీ రథం ఎక్కాను. అర్జునుడిని సమీపించి సింహనాదం చేశాను. ఈ నేపథ్యంలో ఎదురైన కర్ణుడిని ఎదుర్కొని అతడు వెనుదిరిగేలా చేశాను.

ఇలా అనేక సందర్భాల్లో నా శక్తిసామర్థ్యాలను కౌంతేయ ప్రథముడు గుర్తించి నన్ను ప్రోత్సహించారు.

***ఇక దుర్యోధనుడి మరణం గురించి.***

ఇక మిగిలింది సుయోధనుడు మాత్రమే. కర్ణుడి మరణానంతరం మడుగులో దాక్కున్న దుర్యోధనుడిని రెచ్చగొట్టి బయటకు పిలిచాడు ధర్మరాజు. ధర్మజుని సూటిపోటి మాటలకు తట్టుకోలేక అసలే అభిమానధనుడైన రారాజు మడుగునుంచి బయటకు వచ్చాడు. అలా బయటకు వచ్చిన అతడిని చూచి ధర్మజుడు తమ ఐదుగురిలో ఎవరితోనైనా యుద్ధం చేయవలసిందిగా సూచించాడు.

"సోదరా! దుర్యోధనా! ఇలా మడుగులో దాక్కోవటమెందుకు? నీకు ధైర్యం, చేవ వుంటే మా ఐదుగురు సోదరుల్లో ఎవరితోనైనా నీ ఇష్టం వచ్చిన వారిని ఎన్నుకుని యుద్ధానికి రా. అతడిని ఓడించి నీ రాజ్యాన్ని నువ్వేలుకో. సిద్ధమేనా?"

ధర్మరాజు మాటలకు నవ్వాడు దుర్యోధనుడు. "ధర్మజా! నేనింకా రాజధర్మాన్ని మరిచిపోలేదు. సమఉజ్జీతోనే యుద్ధం చేస్తానుగానీ, అధర్మానికి ఎన్నడూ ఒడిగట్టను. నాకు సమవుజ్జీ భీమసేనుడు తప్ప మరెవరున్నారు మీలో? నాతో యుద్ధం చేయగల సత్తా వృకోదరుడికుందేమో తెలుసుకో. ఆనక విచారించి ఫలితం వుండదు. విజయం సాధించానా సామ్రాజ్య మహాలక్ష్మిని ఏలుకుంటా. అమంగళం ప్రతిహతమగుగాక. ఒకవేళ దైవం అనుకూలించక విజేతను కాలేకపోయినా నాకు నష్టమేమీ లేదు. జరగాల్సిన నష్టం ఇప్పటికే జరిగిపోయింది. నూరుగురిలో నేనొక్కడిని తప్ప మిగిలిన సోదరులందర్నీ పోగొట్టుకున్నాను. ఆప్తమిత్రుడు కర్ణుడు, మేనమామ శకుని అందరూ పైలోకం నన్ను పిలిచారనుకుంటాను. అంతేగానీ పౌరుషం నశించి ఎప్పుడూ ఈ దుర్యోధనుడు, మానధనుడు మనజాలడు" అని సవాలు విసిరిన రారాజును చూచి నవ్వాను.

"సరైన మాట పలికావు దుర్యోధనా! నీకు తగిన మార్గాన్నే ఎంచుకున్నావు. నీ సోదరులు, నీ ఆప్తమిత్రుడు కర్ణుడు, మామ శకుని నువ్వెప్పుడొస్తావా అని పైలోకంలో ఎదురుచూస్తున్నారు. వారిని చేరుకునేందుకు ఎందుకంత తొందరపడతావు. నిన్నుకూడా అక్కడికే పంపుతాములే. కంగారుపడకు" అంటున్న నన్ను నెమ్మదించమన్నట్టుగా ధర్మనందనుడు చూచాడు. అన్నగారి చూపులోని భావాన్ని గ్రహించిన నేను మిన్నకుండిపోయాను.

ధర్మనందనుడి ధర్మనిరతి ఎటువంటిదంటే ఇక్కడే అర్థమవుతుంది. దుర్యోధనుడి ఊరులు విరుస్తానని ప్రతిజ్ఞచేశానని ఆయనకు తెలుసు. ఆ ప్రతినను నిలుపుకోవలసిన అవసరము ఆయనకు ఎరుకే. అయినా సుయోధనుడిని నాతో యుద్ధం చేయమని కాకుండా ప్రత్యర్థి ఎంపికను కూడా దుర్యోధనుడికే వదిలిపెట్టాడు. మా ఐదుగురిలో దుర్యోధనుడికి తగిన ప్రత్యర్థి నేనే అయినా ఆ విషయం తానుగ చెప్పకుండా శత్రువుకే వదిలిపెట్టటం నిజంగా ధర్మజునికే చెల్లింది.

ఇక దుర్యోధనుడు కూడా తక్కువేమీకాడు. అతను నన్నే ఎన్నుకున్నాడు.

ఇంకేముంది? మా ఇద్దరి మధ్యా ద్వంద్వయుద్ధం మొదలైంది. ఇద్దరం గదాయుద్ధంలో ఆరితేరినవాళ్ళమే. ఇద్దరిలో చిన్నప్పటినుంచి దాగున్న పౌరుషప్రతాపాలు ఒక్కసారిగా ఉప్పొంగాయి. ఒకరిపై మరొకరు గదాప్రహారాలతో విరుచుకుపడ్డాం. ఇద్దరి శరీరాలు రక్తధారలతో ఎర్రబడ్డాయి. ఎవరిది పైచేయో, ఎవరిది కింది చేయో చెప్పటం అసాధ్యం. రెండు మత్తేభాలు, రెండు సింహాలు కలయబడినట్లుగా వుంది పరిస్థితి. మా గదాయుద్ధాన్ని చూస్తున్న మిగిలిన నలుగురు సోదరులు, శ్రీకృష్ణుడు, బలరాముడు, అశ్వత్థామ తదితరులంతా ప్రాణాలు ఉగ్గబట్టి చూస్తున్నారు. మదించిన ఏనుగులా ఒక్కసారి దుర్యోధనుడు నా పక్కటెముకలపై గదాఘాతంతో దాడిచేశాడు. అది నిజంగా తగిలితే ఎందుకూ పనికిరాకుండా నా ఎముకలు విరిగిపోయుండేవి. తరువాత నా చేతిలోని గదపై కౌరవపతి వేసిన వేటునుంచి కూడా తప్పుకున్నాను. లేకపోతే నాగద ఆ వేటుకు తుత్తునియలయ్యేదనిపించింది. రెండు గదలు ఒకదానినొకటి తాకినప్పుడు నిప్పురవ్వలు ఎగిసిపడుతున్నాయి. వాటిధ్వనులు ఆకాశం చిల్లుపడేలా శబ్దాన్ని కలిగిస్తున్నాయి. కురురాజు విజృంభణ చూచి నాకు తీవ్ర ఆగ్రహం కలిగింది. నా శక్తి మొత్తాన్ని చేతుల్లోకి తెచ్చుకుని గదాదండంతో కౌరవపతి వక్షస్థలంపై వేటువేశాను. నా వేటునుంచి అతడు తప్పుకోవడంతో గద భూమిని తాకింది. ఆ దెబ్బకు భూమి కంపించింది. మళ్ళీ నేను పార్శ్వభాగంలో చేసిన ప్రహారానికి

కురుసార్వభౌముడు ఒక్కసారిగా కంపించాడు. అతని మోము ఆగ్రహంతో ఎర్రబారింది. తేరుకున్న అంబికేయుని తనయుడు పట్టలేని ఆగ్రహంతో నా నుదిటిపై దాడిచేశాడు. దాన్నుంచి తప్పించుకునేందుకు విఫలయత్నం చేసిన నేను ఆ దెబ్బకు పడిపోయాను. చూస్తున్న వారందరూ "ఆ...ఆ...భీముడు పడిపోయాడు. కౌరవపతిని ఎదిరించలేక చతికిలపడ్డాడు" అని అశ్వత్థామది దుర్యోధనుడి సన్నిహితులు ఆనందపడుతుండగా తేరుకున్న నేను చేసిన గదా ప్రహారం దుర్యోధనుడిని తాకింది. దాంతో అతను మూర్ఛిల్లాడు.

"పరమాత్మా! పరంధామా! వీరిద్దరిలో ఎవరిది పైచేయో అర్థంకావడంలేద"ని శ్రీకృష్ణుడితో అర్జునుడు అనడం నాకు వినిపించింది. పార్థుని మాటలకు నవ్వాడు పరమాత్ముడు.

"ఇద్దరూ ఇద్దరే. కానీ ఇద్దరిలోనూ వ్యత్యాసం కూడా వుంది. మీరు అరణ్య, అజ్ఞాతవాసాల పదమూడు సంవత్సరాల కాలంలో భీముడిని అంతమొందించాలన్న ఏకదీక్షతో దుర్యోధనుడు కఠోర పరిశ్రమ చేశాడు. అతడు చేసిన పరిశ్రమ ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడ్డాడు. మరి భీమసేనుడి సంగతో!? దీర్ఘకాలం నుంచి అతడికి పరిశ్రమలేదు. అందువల్ల గదా కౌశలంలో భీముడికన్నా దుర్యోధనుడే మిన్న. ఇది నిశ్చయం. వారిద్దరి యుద్ధం చూస్తుంటే దుర్యోధనుడు తెలివిగా దాడిచేస్తున్నాడని అర్థమవుతోంది. దుర్యోధనుడిని నిలువరించేందుకు వాయుపుత్రుడు మూర్ఖంగా బలాన్నే నమ్ముకున్నాడన్నది వాస్తవం" వాసుదేవుని మాటలు అర్జునుడిలో అలజడి కలిగించాయి. "మరిప్పుడు ఎలా?" అన్నట్టు శ్రీకృష్ణుడిని చూచాడు పార్థుడు.

పార్థుని చూపుల్లో భావాన్ని గ్రహించిన కృష్ణుడు నవ్వుతూ ఇలా అన్నాడు.

"న్యాయమార్గంలోగానీ, ధర్మమార్గంలోగానీ సుయోధనుణ్ణి భీమసేనుడు వధింపలేడు. ఇప్పుడతనికి తన ప్రతిజ్ఞను జ్ఞప్తికి తీసుకురావాలి. ఆవేశంలో ఆ విషయాన్ని అతను మరచినట్లున్నాడు. దుర్యోధనుడి తొడలు విరచి చంపడమొక్కటే మనకున్న మార్గం." శ్రీకృష్ణుడి అభిప్రాయం తెలుసుకున్న వెంటనే అవకాశం కోసం విజయుడు ఎదురు చూడసాగాడు. నేను యధాలాపంగా అర్జునుడిని చూచాను. అతను తన చేతులతో తొడల్ని చూపిస్తూ సైగచేశాడు. సైగలనర్థం చేసుకున్న నేను అవకాశం లభించగానే లాఘవంగా దుర్యోధనుడి తొడలపై గట్టిగా గదతోమోదాను. అంతే అంత మనిషి ఒక్కసారిగా పెద్దగా అరచి కూలిపోయాడు.

గదాయుద్ధంలో నాభికింది స్థానంపై గురిపెట్టడం ధర్మవిరుద్ధం. నేను చేసిన పనిని గమనించిన బలరాముడు ఆగ్రహంతో వూగిపోయాడు. "ఇంత నీచానికి ఎలా ఒడిగట్టావు భీమా! నాభికింద ప్రదేశంపై దాడి ధర్మవిరుద్ధమని నీకు తెలియదా?

బలరాముడిని సముదాయిస్తూ శ్రీకృష్ణుడు "అన్నా! ఇందులో అన్యాయమేమున్నది? ధర్మ విరుద్ధమేమున్నది? కురురాజు ఉరులు విరుస్తానని కదా భీమసేనుని ప్రతిన. దాన్ని నెరవేర్చుకున్నాడు. అంతే. అదీగాక దుర్యోధనునికి మైత్రేయ మహాముని శాపం వుండనే వుందికదా! దాన్నికూడా నెరవేర్చాల్సిన బాధ్యత భీముడిపై వుంది."

ఇలా తప్పొప్పులపై తర్జన భర్జనలు జరుగుతున్న సమయంలోనే ఆగ్రహం పట్టలేక నేను దుర్యోధనుడి శిరస్సును వామపాదంతో తన్నాను. ఇది చూచిన వెంటనే ధర్మరాజు "ఆగు భీమసేనా! ఇంత అధర్మానికి ఎలా ఒడిగట్టావు? ప్రాణాపాయ స్థితిలో వున్న శత్రువుడిని తన్నడం ధర్మంకాదు. నువ్వు చేసిన పనికి బాధ్యత వహించాల్సివస్తుందని గుర్తుంచుకో" అని వారించాడు. అయినా నాలోని ఆగ్రహజ్వాలలు చల్లారలేదు.

"పాంచాలిని, ఏకవస్త్రను వెంట్రుకలు పట్టి సభకుకు ఈడ్పించిన ఈతనిని చూడండి. పనికిరానివారమని, వ్యర్థులమని మమ్మల్ని తూలనాడిన ధార్త రాష్ట్రాదులను, బంధుమిత్రులను నాశనం చేశాం. ఇక మాకు అమరలోకమైనా, నరకమైనా సమానమే"నంటూ హుంకరించాను. (ఏకవస్త్రబాంచాలి నట్లీడ్చితేర బనిచి బలించిన పాపఫలము ననుభవింపుము దుష్టాత్మా! యనుచు వామచరణమున బెట్టిదముగాక శిరము దన్నె... మహాభారతం శల్యపర్వం) మళ్ళీ వామపాదంతో దుర్యోధనుడి తలను తన్నాను.

దీన్ని చూచి ధర్మజుడు సహింపలేకపోయాడు. నన్ను వారించేందుకు ప్రయత్నిస్తున్న అతడిని చూస్తూ వాసుదేవుడు "యుధిష్టిరా! భీముడు చేసిన ఈ పని ధర్మాత్ముడవైన నీకేకాదు చూచిన వారెవరికీ ధర్మసమ్మతమనిపించదు. దురాత్ముడు, బంధునాశకుడు, పాపాత్ములకు ఇంతకంటే మంచి మరణం ఎలా లభిస్తుంది? ఆవేశం ఆపుకోలేక భీముడిలా ప్రవర్తించాడుగానీ కావాలని చేసిందికాదు. ఇందుకు నీవు పరితపించడమెందుకు?" అన్నాడు.

శిఖండి కారణంగా అరివీర భయంకరుడు, కురుకుల పితామహుడిని శ్రీకృష్ణుడితో సహా మా ఐదుగురు సోదరులు కలిశాం. అప్పుడు శ్రీకృష్ణుని సలహా మేరకు ధర్మజునికి భీష్మ పితామహుడు పాలనావిధానంపై అనేక అంశాలను ఉద్బోధించాడు. ఏ రాజైనా ప్రజలను కన్నబిడ్డల్లా చూచుకోవాలని ఆయన చెప్పడంతో ఆయన మాటల్ని ఆసక్తిగా ఆలకించాం.

"పాలనా వ్యవహారాల్లో స్వచ్ఛత, ప్రజలందరికీ ప్రేమాభిమానాలు పంచేలా ప్రవర్తించటం రాజుకి అవశ్యకం. అందువల్ల ధర్మహాని జరగదు, రాజు కీర్తి నలుదెసలా పాకుతుంది. ప్రజల్లో వివాదాలు తలెత్తినప్పుడు ధనకాంక్షతో ధనవంతులవైపు పక్షపాతంతో వ్యవహరించకూడదు. ధర్మాన్ని అనుసరించి నిర్ణయాలు తీసుకోవాలి. ప్రజల పట్ల వంచనతో వ్యవహరించే రాజును డేగను చూచిన పక్షిలా ప్రజలు భయభ్రాంతులవుతారు.

యజ్ఞయాగాదులను మొక్కుబడిగా కాకుండా శ్రద్ధతో చేయాలి. అసత్యం పలకరాదు. వేదాల్ని అవమానించటం ఎవరికీ తగదు. యజ్ఞం కంటే తపం గొప్పది. తపస్సంటే దేహాన్ని శుష్కింపచేయటం కాదు. అహింస, సత్యం పలకటం, దయచూపటం మనిషిని సమున్నతుడిగా నిలుపుతాయి.

మిత్రుల్ని ఎంపిక చేసుకునేటప్పుడు జాగ్రత్త వహించాలి. తనకు మేలు కలిగించేవాడు, స్వార్థచింతన లేనివాడు మిత్రుడైతే అతని జీవితం ఎలాంటి ఒడిదుడుకులకు అవకాశమివ్వదు. అటువంటి మిత్రునిపై విశ్వాసం చూపితే కష్టనష్టాలకు తావుండదు. ఆ వ్యక్తి పట్ల ప్రేమాభిమానాలు చూపుతూ అతని వున్నతిని కోరుకోవాలి. ఎక్కువ తక్కువ మాటలు, కపట స్నేహం, ఇతరులకు కీడు కలిగించే నడత సర్వత్రా విసర్జనీయం.

"ధర్మరక్షణ లోపిస్తే భయం, అనుమానాలు తలెత్తుతాయి. రాజైనా, మంత్రి అయినా, సామాన్యుడైనా 'ధర్మోరక్షితి రక్షితః'ను విస్మరించరాదు."

ఇలా అనేక అంశాలను స్పృశిస్తూ పితామహుడు మమ్మల్ని దీవించాడు.

ఉత్తరాయణ పుణ్యకాలం ప్రవేశించిన తరువాత ఏకాదశినాడు భీష్మపితామహుడి అంత్యక్రియల అనంతరం ధ్రుతరాష్ట్రుడు ఖిన్నుడయ్యాడు.

ఆయన శ్రీకృష్ణుడితో "వాసుదేవా! ఇదంతా నా మూర్ఖత్వం వల్లనే జరిగింది. ధారాపుత్రులను, కులపెద్దల్ని, బంధుమిత్రుల్ని కేవలం నాచేతగానితనమే మింగేసింది. అటు కుమారుల్ని సముదాయించలేక, ఇటు తమ్ముడి కుమారులకు న్యాయం చేయలేని నా మూర్ఖత్వాన్ని చూస్తుంటే నా మీద నాకే అసహ్యం వేస్తోంది" అన్నాడు.

ఆయన విలాపం అక్కడున్న అందర్నీ దుఃఖితుల్ని చేసింది. యుద్ధంలో మరణించిన దుర్యోధనాదులు ఎంత క్రూరులైనా మాకు సోదరులే. అలాంటి వారిని ధర్మాచరణ కోసం వధించినా మాకు మిగిలింది చింతేకదా! సమరమంటే రాజులకు ఎందుకింత ప్రియమో

ఎవరికీ అర్థంకాని విషయం. సమరోత్సాహంతో కురుక్షేత్రంలో బలపరాక్రమాలు చూపి విజయలక్ష్మిని వరించినా ఏదో వెలితి. ఎంతో హృదయవేదన. ఎన్నడూలేనంత ఆవేదన.

అది కాస్తా పెదనాన్న విలాపంతో బయటపడింది. అప్పటివరకు జయించామని వుత్సాహంతో వున్న మాకు ఒక్కసారిగా దుఃఖావేదన ముంచెత్తింది. అందరి కళ్ళలో నీరు అందరి మనస్సులు బరువెక్కాయి.

మా ఆవేదనను చూచిన కృష్ణుడు సముదాయిచే విధంగా, మా మనసుల్లోని బరువును దించేవిధంగా అనునయించటం మొదలెట్టాడు.

"మామా! మరణించిన వారికోసం పరితపించడం తగదు. ఇది నీకు తెలియని ధర్మసూక్ష్మం కాదు. అయినా చింతిస్తున్నావు. మీరంతా ఇలా పోయిన వారికోసం చింతిస్తూ దుఃఖిస్తుంటే వారి ఆత్మలకు పుణ్యాలోకాలు ప్రాప్తింపవు. కాస్త శాంతించు. ధర్మజుడు, అతని తమ్ములకు నువ్వంటే ఎక్కడలేని అభిమానం, ఆప్యాయత, గౌరవం, అర్థంలేని నీ విలాపంతో ధర్మజాదులు ఎంత శోకతప్తులవుతున్నారో గమనించు. వారికోసమైనా నీ దుఃఖాన్ని దిగమింగుకోవాలి. నీ జేష్ఠుడి మరణానికి తానే కారకుడననే శంకతో భీముడెంత విచారగ్రస్తుడయ్యాడో చూడు"

నిజంగా ఇంత దారుణానికి నేనూ బాధ్యుడనేననే అపరాధభావం నా మనస్సును క్రుంగదీస్తోంది. పెదనాన్న ముఖంలోకి చూడలేక అవనత శిరసుడనయ్యాను. నన్ను సముదాయించేందుకో లేక నా కర్తవ్యాన్ని నేను నిర్వర్తించానని చెప్పడానికో తెలియదుకానీ పరమాత్ముడు నన్ను సమీపించి నా భుజంపై చేయివేసి నా మనస్సుకి సర్దిచెప్పే యత్నం చేశాడు.

ఆ చేతి స్పర్శ నన్ను మళ్ళీ మామూలు స్థితికి తీసుకొచ్చింది. మెల్లగా తలెత్తి పెదనాన్న ముఖంలోకి చూచాను.

ధర్మజుడిలో కూడా అపరాధభావం కనబడుతోంది.

"వాసుదేవా! నీ ఆజ్ఞచేతనే ఇంతవరకు క్షత్రియధర్మాన్ని నిర్వర్తించాను. ఇప్పుడుకూడా నీ అనుమతినే కోరుతున్నాను. నన్ను వనవాస దీక్ష కొనసాగించేందుకు అనుమతించవలసినదిగా వేడుకుంటున్నా"నని అంటున్న ధర్మజుని విచిత్రంగా చూచాడు వాసుదేవుడు.

"ధర్మజా! క్షత్రియధర్మాన్ని పరిపూర్ణంగా నిర్వర్తించినవాడవు. లోకంలో ధర్మసంస్థాపనకు నడుంకట్టి సంపూర్ణ ధర్మమూర్తిగా కీర్తిపొందినవాడవు. నీకింత బేలతనం పనికిరాదు. నెమ్మదించు. నీ కర్తవ్యాన్ని నిర్వర్తించు. నీపాలన కోసం ఎదురుచూస్తున్న ప్రజల కష్టసుఖాలను గమనించు. నీ ధర్మాన్ని విడనాడితే నీ కులం మొత్తం ధర్మభ్రష్టం కాగలదు. కాస్త నిదానించి ఆలోచించు."

పరమాత్ముని మాట మాకెప్పుడూ శిరోధార్యమే. ఆ విషయం ఆయనకూ తెలుసు. అందుకే మా మార్గాన్ని ఎప్పుడూ తప్పుతామేమోనని కనిపెట్టుకునే వుంటాడు. ఆయనలో ఎలాంటి భావాలు కనిపించవు. ఆనందమొచ్చినా అంతే. పెను విషాదం సంభవించినా అదే తీరు.

"రాజధర్మంగా పరాక్రమంతో రాజ్యాన్ని సంపాదించుకున్నావు. తమ్ములతో కలిసి అనుభవించు. ఇది శోకసమయమూ కాదు, పరితపించాల్సిన సందర్భమూ కాదు. నిదానించు"

నెమ్మది నెమ్మదిగా మాకు బోధపడుతోంది. పుట్టిన ప్రతిమనిషీ గిట్టక తప్పదుకదా! చావు అనేది మన కర్మలపై ఆధారపడి వుంటుంది. ఉత్తములకు ఉత్తమగతులే సిద్ధిస్తాయి. అధములకు అధమగతులే కలుగుతాయి.

మానవ జీవనచక్రంలో ఇంత వేదాంతం దాగుందని నాకిప్పుడే బోధపడుతోంది. కర్మబంధంలో చిక్కుకున్న మనిషి ఎందుకింత మూర్ఖంగా వ్యవహరిస్తాడో అవగతమవుతోంది.

"మీ అన్నదమ్ముల చేతిలో హతులైన నీ సోదరులంతా ఊర్ధ్వగతుల్ని పొందారు. వీరమరణం పొందిన వారి గురించి పరితపించడం ఉత్తముల లక్షణం కాదు. మరణించిన వారికోసం శోకించటం, దుఃఖించటం మీకు తగదు. పాండవశ్రేష్టా! ఇది దుఃఖాలకు, శోకాలకు సమయం కాదు. బాధ్యతలు నిర్వర్తించాల్సిన సమయం. నీకోసం, నీ రాజ్యపాలన కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్నారు. వారి విషయాన్ని చూడు. ఇంతవరకు బాధ్యతను సక్రమంగా నిర్వర్తించావు. ఇప్పుడూ అలాగే నిర్వరించు"

ధర్మజునిలోని నిరాశాభావాన్ని తొలగించడంలో పరమాత్ముడు నెమ్మది నెమ్మదిగా చికిత్స ప్రారంభించాడు. అనునయిస్తున్నట్టే అనునయిస్తూ బాధ్యతను గురుచేస్తున్నాడు. ఇప్పటివరకూ చేసిన విధుల్ని, వాటిని విస్మరిస్తే కలిగే పరిణామాలను సుతిమెత్తగా వివరిస్తున్నాడు. ఆ విషయం నాలాంటి వాడికే అర్థం అవుతుండగా లేనిది, ఇక ధర్మజుని సంగతి వేరే చెప్పాలా?

"కుంతీసుతాగ్రజా! ఇప్పటివరకూ నువ్వు నిర్వర్తించిన బాధ్యతలన్నీ ఒక ఎత్తు. ఇప్పుడు నిర్వర్తించాల్సినవి మరో ఎత్తు. ఇంతవరకు నీ కుటుంబం పట్ల నీకున్న బాధ్యతను సక్రమ్మగా నెరవేర్చావు. ఇక నీ సోదరుల సాయంతో నిన్నే నమ్ముకున్న నీ ప్రజల నమ్మకాన్ని కూడా నెరవేర్చే బాధ్యత వుందని మరిచిపోకు."

"భూసుతుడు తన దర్పాన్ని విస్మరించటం సకలపాపాలకు కారణమవుతుంది. నువ్వలా కాకూడదనే ఇంతగా చెబుతున్నాను. నువ్వు నిర్వర్తించాల్సిన అసలైన బాధ్యత ఇప్పుడే మొదలవుతుంది. దాన్ని మరిచిపోకు. నిరాశావాదం సద్గతులకు దూరం చేస్తుంది."

వాసుదేవుని మాటలు అగ్రజునిలో మార్పుతెస్తుందని మాకు తెలుసు. అలాగే జరిగింది.

అశ్వమేధయాగానికి ముహూర్తం సిద్ధమైంది.

ఎలాంటి ఆలోచించకుండా యుద్ధంలో నేను ముందు కురికిన సందర్భాల్లో చాలాసార్లు వెనక్కి లాగిన ఉదంతాలు వున్నాయి. గురుదేవుడు ద్రోణుడిని అవమానించిన ద్రుపదుడిని బంధించి గురుదక్షిణగా తెచ్చే సమయంలో నేను చిచ్చరపిడుగులా ముందుకురికి సైన్యాన్ని చిందరవందర చేస్తుంటే "భీమసేనా! ద్రుపదుడు బందీ అయ్యాడు. ఇక సైన్య నష్టం కలిగించాల్సిన అవసరం లేదు. వెనక్కి వచ్చాయి." అని హెచ్చరించటంతో తప్పనిసరిగా వెనుదిరిగాను.

ఇంత ఉచిత ఆలోచనలున్న వ్యక్తి కాబట్టే ఆయన్ని అందరూ పేరుకు తగ్గ ధర్మాత్ముడు అని కీర్తిస్తుంటారు. ధర్మమే ఆయన రూపంలో ఇలకు దిగిందన్నది సత్యం.

జరాసంధవధ విషయంలో కూడా అన్నగారికి నేను, పార్థుడు ఎన్నో విధాలుగా నచ్చజెప్పిన తరువాతగానీ అనుమతించలేదు. ద్రౌపదీ స్వయంవరానంతరం మా వునికి తెలుసుకున్న్ అభీష్మ, విదుర ద్రోణాదుల హితవుపై పాటలీపుత్రానికి పిలిపించి కురుమహారాజు ఖాండవ ప్రస్థానాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించమని చేసిన సూచనను సమ్మతించాం. అనంతరం రాజసూయ యాగం నిర్వహించమని మా పురోహితుడు, వేదశాస్త్రాలు తెలిసిన ధౌమ్యుడు సూచించటంతో నిర్వహణకు వాసుదేవుడే తగినవాడని ధర్మజుడు భావించి శ్రీకృష్ణుని కోసం కబురంపించాడు.

ధర్మజుని వినతిమేరకు వచ్చిన శ్రీకృష్ణుడు రాజసూయ వివరాలు తెలుసుకుని సంతోషితుడై "ధర్మజా! రాజసుయం నిర్విఘ్నంగా పూర్తిచేయడం సర్వదా శుభస్కరం. అంతకు ముందు శాత్రవ నిర్మూలన చేయటం మీ కర్తవ్యం. అందుకు జరాసంధవధతో శ్రీకారం చుట్టటం అవసరం" అని అనడంతో ధర్మజుడు మౌనం వహించాడు.

ఆ మౌనానికి అర్థం తెలుసుకుని అగ్రజుడిని ఉత్సాహపరిచే రీతిలో ఇలా అన్నాను.

"యుధిష్టిరా! ఎలాంటి అనుమానాలకు ఆస్కారమివ్వవద్దు. శత్రువు ఎంతటి బలవంతుడైనా వెనుకడుగు వేయటం వుచితం కాదని నీకు చెప్పదగిన వాడను కాను. ప్రయత్నం చేయకుండా ఫలితాన్ని ఆశించటం సరికాదు. అల్పుడిని ఓడించటం ఘనమైన పనికాదు. అందువల్ల పౌరుషం కలగదు. మనకన్నా బలవంతుడితో పోరాటం చేస్తేనే మన పౌరుషం లోకానికి వెల్లడవుతుంది. అందులోనూ బలపరాక్రమాల్లో అద్వితీయుడైన జరాసంధుడితో సమరానికి కృష్ణార్జునుల తోడ్పాటు వుండటం మనకిక ఎదురులేదన్నది స్పష్టపరుస్తోంది. కాబట్టి సంకోచ, సందేహాలకు అవకాశంలే"దని చెప్పటం చూచిన అర్జునుడు కూడా అన్నగారు సమ్మతించేలా నచ్చచెప్పేందుకు ప్రయత్నించాడు. "అగ్రజా! సమస్త రాజులను జయించాలి. రాజసూయాన్ని అతి వైభవంగా, నిర్విఘ్నంగా పూర్తిచెయ్యాలి. పరాక్రమవంతులకు ఇంతకన్నా ప్రశస్తమైన కార్యముండదు. జరాసంధుడిని జయించి అతనిచేతిలో బందీలుగా వున్న రాజులను విడిపించటం మన కర్తవ్యం" అని చెప్పడంతో శ్రీకృష్ణుని వైపు చూచాడు ధర్మజుడు.

"ధర్మజా! సందేహం వలదు. సంపూర్ణాంగీకారంతో భీమసేనుడిని ఆశీర్వదించి పంపటం నీ కర్తవ్యం. కర్తవ్య నిర్వహణే రాజన్యులకు కీర్తిదాయకం. కర్తవ్య నిర్వహణకు వెనకాడే వారిని విజయం వరింపదు. ధర్మాన్ని ఆచరించటం లోకవిధాయకం. ధర్మాచరణ నుంచి తప్పుకోవటం ధర్మనిరతుడవైన నీకు తగినదికాదు" వాసుదేవుని హితవుతో ధర్మజుడు శాంతించాడు.

"శ్రీకృష్ణా భీమార్జునులు నాకు రెండు కళ్ళలాంటివారు. వారిద్దర్నీ విడిచిపెట్టి వుండలేక ఇలా చింతిస్తున్నాను. అయినా, నీ అండ వుండాలేకానీ, ఒక్క జరాసంధుడేమిటి ఎంతో పరాక్రమవంతుడైనా నిర్జితుడవుతాడు. నాకిక ఎలాటి సందేహంలేదు. భీమార్జునులను తోడ్కొని వెళ్ళి జరాసంధుని వధించి అతని బందీలుగా వున్న రాజన్యుల్ని విముక్తుల్ని చేయించు" అని అన్నాడు.

అలా బయలుదేరి జరాసంధుని వద్దకు వెళ్ళిన మేము మారువేషంలో వుండటం చేత ఆ ముష్కర చక్రవర్తి వుచితరీతిన సత్కరించేందుకు ప్రయత్నించాడు. మా నిజరూపాన్ని గాంచి కుపితుడై నాతో కలియబడ్డాడు.

మా యుద్ధం కార్తీక శుద్ధ పాడ్యమినాడు ప్రారంభమై త్రయోదశివరకు కొనసాగింది. చివరిరోజు నాతో ముష్టియుద్ధం చేస్తున్న జరాసంధుడు పూర్తిగా అలసిపోయాడు. నేనతడిని రెండుచేతుల్తో పైకెత్తి విసిరి అవతలికి వేసే సమయంలో శ్రీకృష్ణుడు "భీమా! అలసిపోయిన శత్రువును అలా విసిరేయద్దు. ఇలా పడేయాలి. ముందుగా నీవు వాయునందనుడవు కాబట్టి నీ తండ్రి వాయుదేవుడిని ఒక్కసారి స్మరించుకో. అమిత బలపరాక్రమాలు సముపార్జించుకుని ఈ నీచుని భరతం పట్టు" అంటూ చెంతనే వున్న గడ్డిపరకను రెండుగా చీల్చి చూపాడు. నాకు జరాసంధ మరణంలోని మర్మం అర్థమైంది. ఒక్కసారిగా నా తండ్రి వాయుదేవుడిని మనసులోనే స్మరించుకున్నాను. తండ్రిని తలచుకోగానే నేను వేయి ఏనుగుల బలసంపన్నుడినవుతాను. అంతే కృష్ణ సూచన మేరకు జరాసంధుడిని అవలీలగా పైకెత్తి కిందపడవేస్తూనే కాలుతో తొక్కిపట్టాను. రెండుగా చీల్చి అటుభాగం ఇటు, ఇటుభాగం అటు పడవేశాను. ఆ విధంగా జనహృదయాలను పీడించిన లోకకంటకుడి పీడ వదిలించాను.

### *సర్వం కృష్ణమయం*

జరాసంధుని బందీలుగా ఉన్న సమస్త రాజన్యులకు విముక్తి కలిగించి, జరాసంధుడి కుమారుడైన సహదేవుడిని మగధరాజ్య పట్టాభిషిక్తుని చేసి, జరాసంధుని రథంపై కృష్ణార్జునులు వెంటరాగా ఇంద్రప్రస్థం బయలుదేరాం. ఆ రథం గొప్పతనాన్ని వాసుదేవుడు వివరిస్తూంటే ఆశ్చర్యచకితులమయ్యాం.

తారకాసుర సంగ్రామంలో దాన్ని ఇంద్రుడు అధిష్టించాడట. ఇంద్రుడి నుంచి వసువనే రాజు పొందాడు. తరువాత అది బృహద్రధుడి చెంతకు చేరిందని కృష్ణుడు వివరించటంతో ఆసక్తికరంగా చూచాను. రత్నకాంతులతో మెరుస్తూ కనబడింది ఆ దివ్యరథం. గరుత్మంతుని వాసుదేవుడు తలచుకోవడంతో క్షణంలో అతడు వచ్చి ఆ రథాన్ని ఇంద్రప్రస్తానికి పయనింపజేశాడు.

ఆ రథాన్ని చూచి జరాసంధుని పీడ విరగడైందని జనులు గ్రహించారు. జరాసంధుని భుజపరాక్రమాలు తెలిసిన వారంతా, "ఆయుధాలతో చావులేని జరాసంధుడిని భీమసేనుడు భుజపరాక్రమాలతో వధించాడు. లోకభయంకరుడు, మదాంధుడైన నీచ చక్రవర్తిని శ్రీ కృష్ణసాయంతో వధించిన భీమసేనుడికి జేజే"లంటూ ప్రజలు కీర్తిస్తుండగా నేను వాసుదేవుడిని చూచి నవ్వాను. అదే సమయంలో ఆయన కూడా నా వైపు చూచి చిరునవ్వు నవ్వాడు.

*సర్వం శ్రీకృష్ణార్పణమస్తు!*

ధర్మరాజును సమీపించి అర్జునుడితో కలిసి పాదాలకు నమస్కారం చేసిన నన్ను ఆప్యాయంగా లేపి హృదయానికి హత్తుకున్నాడు. ఆ కౌగిట ఎంత సుఖం ప్రపంచంలోని శాంతి అంతా ఆ సందిట్లో నాకు దక్కినట్లయింది. ధర్మజుని హృదయంలో దక్కేటంతటి ప్రశాంతత మరెక్కడా లభించని వైనం. అంతవరకు అంత సంతృప్తి ఎక్కడా నేను పొందలేదు. అందుకే ఆ హృదయం అందరికీ నవనీతభరితం. నా హృదయస్పందన అగ్రజునికి అర్థమైనట్లుంది. ప్రశాంతవదనుడనైన నన్ను చూచి చిరునవ్వు నవ్వాడా ధర్మాత్ముడు.

"శ్రీకృష్ణా! నీ కృపాకటాక్షాలతో మదాంధ జరాసంధుడు గతించాడు. నిజంగా నా సోదరులు లోకపాలకులు" అంటూ మమ్మల్ని ప్రశంసించాడు.

అనంతరం మా నలుగురినీ నాలుగు దిక్కులకు జైత్రయాత్రకు పంపాడు. అలా తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ దిక్కుల్ని జయించి వచ్చి, రాజసూయానికి మార్గం సుగమం చేశాం.

అన్న ఆనతితో నేను తూర్పుదిక్కుకు, పార్థుడు ఉత్తర దిక్కుకు, నకుల సహదేవులు దక్షిణ, పడమర దిక్కులకు దండయాత్రలకు వెళ్ళాం. పాంచాల రాజుతో ఘనసత్కారాలు పొంది, విదేహరాజైన జనకుడిని, దశార్ణ ప్రభువు సుధన్వుని ఓడించాను. సుధన్వుని పరాక్రమం సంతోషపరచడంతో అతడిని సేనాపతిగా చేసుకున్నాను. శిశుపాలుడి సత్కారాలు అందుకుని జలోద్భవ, భల్లాట దేశాల్ని జయించి, విజయాట్టహాసంతో ఇంద్రప్రస్థానికి చేరుకున్నాను.

వాసుదేవుడు మమ్మల్ని ప్రతిక్షణం కనిపెట్టుకుని ఉండగా రాజసూయ నిర్వహణకు ఆటంకాలెందుకు ఎదురవుతాయి? నిర్విఘ్నంగా రాజసూయాన్ని ధర్మజుడు ముగించాడు. అందరి ప్రశంసల్ని అందుకున్నాడు.

రాజసూయయాగం ముగింపులో అపశ్రుతి శిశుపాలవధ. కురుపితామహుడు భీష్ముని సలహామేరకు అగ్రపూజకు శ్రీ కృష్ణుడిని ఎంచుకోవటం శిశుపాలుడికి కంటగింపుగా మారింది. మా నిర్ణయాన్ని అధిక్షేపించడమే కాకుండా వాసుదేవుడిని నిందించడం ప్రారంభించాడు.

ఇక ఆగ్రహాన్ని ఆపుకోలేకపోయాను. తీవ్రపదజాలంతో అధిక్షేపణలు చేస్తున్న శిశుపాలుడిని చూచి ముందుకురకబోతున్న నన్ను పితామహుడు గాంగేయుడు నిలిపివేశాడు.

"భీమా! ఆగ్రహించే సమయమిది కాదు. వినాశకాలే విపరీత బుద్ధే అన్నారు. వాసుదేవుడు మౌనం దాల్చినంతసేపే చేది భూపాలుని పిచ్చి చేష్టలు. ఒక్కసారి సింహం జూలు విదిలించిందా ఈ పిల్లికూతలు నిలువలేవు. చేటుకాలం దాపురించింది కనుకనే లోకారాధకుడైన వాసుదేవుడిని వీడు దూషిస్తున్నా"డంటూ శాంతింపచేసేందుకు భీష్ముడు ప్రయత్నించాడు.

ఆ తరువాత శిశుపాలుని తల్లికి శ్రీకృష్ణుడు ఇచ్చిన వరం తదితర వివరాలన్నీ తెలిపాడాయన. అత్తకు ఇచ్చిన మాటమేరకు నూరు తప్పుల వరకూ సహించి వాసుదేవుడు మౌనం వహించాడు. అనంతరం వాసుదేవుని చక్రధాటికి శిశుపాలుడు నేలకూలాడు.

మా జీవిత కాలంలో ఎన్నో ఉదంతాలున్నాయి. వాటిలో కొన్ని తీపి జ్ఞాపకాలు కాగా ఎన్నో చేదు అనుభవాలు కూడా ఉన్నాయి. మునులు, ఋషులు సూచనలు, సలహాలు, సముదాయింపులతో ఎట్టకేలకు ధర్మజుడు పట్టాభిషిక్తుడయ్యాడు. ధర్మజుని పాలనలో ప్రజలు సర్వసుఖాలను చవిచూచారు. కరువుకాటకాలకు తావులేని విధంగా అజాత శత్రువు అందించిన పాలన ప్రజలెంతో ప్రశాంత చిత్తులుగా జీవనం కొనసాగించేలా చేసింది. అప్పటివరకు సమర్థుడైన రాజుకోసం ఎదురుచూస్తున్న ప్రజలకు ధర్మరాజులో సురాధిపతి కనపడ్డాడు. ఆ దేవేంద్రుడే ధర్మరాజు రూపంలో తమకు పరిపాలకుడిగా లభించాడని ప్రజలు మురిసిపోయారు. ధర్మాన్ని నిలబెట్టటంలోనూ, ప్రజలకు సుఖశాంతులు కలిగే పాలన అందించటంలోనూ అగ్రజునికి సహకారం పరిపూర్ణంగా మా నలుగురు సోదరులం అందించాం.

ఇప్పటివరకు జరిగిన సంఘటనల్లో నా ప్రమేయం ఉన్నంత వరకు నా జీవిత సింహావలోక పుటల్ని మీ ముందుపరిచాను.

ఇప్పటివరకు నా జీవిత ముఖ్యసంఘటనల సింహావలోకనం వివరించాను. ఇక గతం నుంచి ప్రస్తుతంలోకి వస్తున్నాను.

ఇక ద్వాపరయుగం ముగిసే లక్షణాలు కనబడుతున్నాయి. త్వరలో కలి రాక తప్పదనే సంకేతాలు. శ్రీకృష్ణుడి అవతార పరిసమాప్తి అందుకు సాక్ష్యంగా నిలబడింది. ద్వారకలో సంభవించిన విపరీతాలు ధర్మజుని ఖిన్నుడిని చేశాయి. అర్జునుడి ద్వారా శ్రీకృష్ణ నిర్యాణం తెలుసుకుని తీవ్ర వ్యాకులత చెందాం.

"అర్జునా! కృష్ణుడు లేని పాండవుల మనుగడ ఎక్కడ? కృష్ణ వియోగం భరించరానిది. దీన్ని తట్టుకోగల శక్తి మాకులేదు. నీ బహిఃప్రాణమైన కృష్ణ నిర్యాణం నిన్ను మాత్రం నెమ్మదిగా ఉండనిస్తుందా? అలాగని మనచేతుల్లో ఏమున్నది?" అని విలపిస్తున్న ధర్మజుని చూసి మాకూ కన్నీరు ఆగడం లేదు. ఇక కలియుగం రాబోతున్న సూచనలు కనబడుతున్నాయి కదా! ఈ విషాదం కల్కి ప్రవేశానికి సూచనే.

ధర్మజుడు సర్వజ్ఞుడు కాబట్టి ఆయన అభిప్రాయంతో విభేదించాల్సిన అవసరం నాకు కనిపించలేదు.

మా సఖుడు, కష్టసుఖాల్లో సర్వం తానే అయి మమ్మల్ని నడిపించిన ఆపద్బాంధవుడు, మా ఆరో ప్రాణంగా మెలిగిన శ్రీకృష్ణుడి ఎడబాటు తట్టుకోవడం మావల్ల కాదని సోదరులైదుగురికీ అర్థమైంది. కొత్తయుగానికి స్వాగతం చెప్పాల్సిన అవసరం ఉందని భావించాం. కల్కికి స్వాగతం పలకటం తప్పదనిపించింది.

ఇదే అభిప్రాయం కుంతీకుమార అగ్రజునికి వెల్లడించాను. నా అభిప్రాయంతో ఆయనా ఏకీభవించారు.

"అగ్రజా! అంతా కాలమహిమ. దానితో అదే సరితూగుతుంది. కాలలీలను కాదనగల వారెవ్వరు?"

పాండవులకు వెన్నెముకగా నిలిచి నడిపించిన మహానుభావుడు లేని లోటు తీర్చగలవారెవరు? ఆయన లేని పాండవుల్ని ఎలా ఊహించుకోగలం? ఎన్నో ఆపదలు, వాటి నుంచి మమ్మల్ని బయటపడేసిన అవతార పురుషుడు.. మా సచివుడు శ్రీకృష్ణుడు ఇప్పుడు లేడు కదా! ఆయనిక చూడలేమన్న భావన అంత త్వరగా జీర్ణించుకోగలమా? ఇదసలు ఊహింపని ఉపద్రవం. దీన్నుంచి బయటపడేదెలా? ఎలా?

"పార్థా! ఇదంతా కలిపురుషుని ప్రవేశ స్వాగత గీతికల ప్రభావం. ఇక మన కర్తవ్యాన్ని మనం నిర్వర్తిద్దాం. ప్రాయోపవేశానికి సమయాసన్నమైనది" అని మమ్మల్ని కూడా సంసిద్ధుల్ని చేశాడు ధర్మావర్తనుడు.

సుభద్రను రావించి "నీ కుమారుని కుమారుడు పరీక్షిత్తు ఈ మహా సామ్రాజ్యానికి ప్రభువవుతాడు. కౌరవ పాండవ చరిత్ర సుచరిత్రగా నిలిచిపోతుంది. దీనిని రక్షించవలసిన బాధ్యత నీదే శేషయాదవ సామ్రాజ్యానికి వజ్రనరేంద్రుడు రక్షకుడిగా ఉంటాడు. ధర్మహాని జరగనీయకండి" అని ఎవరి బాధ్యతలు వారికి అప్పగించాడు పాండవాగ్రజుడు.

అనంతరం ప్రజలను నుద్దేశించి ఇలా అన్నాడు. "నా మనోనిశ్చయాన్ని మీరూ ఆదరించండి. ఇక ప్రాయోపవేశదీక్షను మా ఐదుగురు సోదరులం చేపట్టబోతున్నాం. మమ్మల్ని ఆశీర్వదించి అనుమతించండి" అనడంతో సభ ఘొల్లుమన్నది.

"రాజా! నీకిది సరైన నిర్ణయం కాదు. మమ్మల్నిలా వదిలేసి నీ దారి నువ్వు చూచుకోవటం మాకు సమ్మతం కాదు.." అని అంటున్న ప్రజలకు నచ్చచెప్పాడు పాండవకులశ్రేష్ఠుడు.

ఆ రోజు ఉదయం మా ప్రాయోపవేశానికి ముహూర్తం. ఐదుగురు సోదరులం, ద్రౌపద పుణ్యస్నానాలాచరించి ఇష్టదేవతల్ని ప్రార్థించి ముందుగా నిర్ణయించుకున్న ప్రకారంం మహాప్రస్థానానికి బయలుదేరాం. ముందు అగ్రజుడు, వెనుక నేను, నన్ననుసరించి పార్థుడు, నకుల సహదేవులు, అందరికన్నా వెనుక ద్రౌపది, ఆమెను అనుసరిస్తూ ఒక శునకం. ఇదీ మా మహాప్రస్థాన వరుస దృశ్యం.

దక్షిణాభిముఖంగా ప్రారంభమైన మా ప్రస్థానం సముద్రపు ఒడ్డు చేరుకుంది. అక్కడి నుంచి పశ్చిమదిశగా ప్రయాణం సాగింది. ఉత్తర దిక్కగా కొనసాగి ద్వారకను చేరుకున్నాం. అక్కడి నుంచి హిమాచలం, దృఢచిత్తంతో యోగదీక్షతో మేరు భూమిని సమీపించాం.

ద్రౌపదికి యోగదీక్ష సడలటంతో నేలపై పడి విగతజీవి కావడం గమనించి అన్నగారి వంక ప్రశ్నార్థకంగా చూచాను. "అగ్రజా! నిరంతరం మనపైనే మనస్సు నిలుపుకుని పతిసేవే పరమాధిగా తలచిన సాధ్వీమణికి నేడీ దుస్థితేమిటి?" అని అడిగాను. నా ప్రశ్న సర్వజ్ఞుడగు ధర్మజునికి సమంజసంగా తోచింది కాబోలు ఇలా అన్నాడు.

"ఈమె పరమసాధ్వి అనడంలో సందేహం లేదు. ఈమె పార్థుని పక్షపాతి. సుకృతం ఫలించక పోవటంతో ఇలా మార్గమధ్యంలోనే నిహతురాలైంది." అని జవాబిచ్చాడు.

"ఎంతటి వారైనా కర్మను తప్పించుకోలేరు కదా!" అనుకున్నాను.

మరికొంత దూరం వెళ్ళేసరికి సహదేవుడు నిహతుడయ్యాడు. మళ్ళీ ధర్మరాజును అతని కర్మఫలితమేమిటని అడిగాను.

"సోదరా! భీమసేనా! ఎవరికైనా కర్మఫలం తప్పదు. ఈతడు తనంత వాడులేడనే అహంకారి. అహంకార పీడితులకు సశరీర పుణ్యలోక ప్రాప్తి ఉండదు."

అన్నగారి మాటల్లోని ధర్మసూక్ష్మాన్ని గ్రహిస్తూ నడుస్తున్నాను. హఠాత్తుగా నకులుడు నేలకూలడం చూశాను. అది చూచి అన్నగారు నా సందేహాన్ని గ్రహించారు.

నా నోటి నుంచి సందేహాన్ని గ్రహించాడు.

"చింతించడం విజ్ఞుల లక్షణం కాదు. కర్మఫలాన్ని ఆస్వాదించడమే ధీరుల లక్షణం. కర్మఫలాన్ని ఆహ్వానించాలి. ఇప్పుడు అర్జునుడు విషయానికొస్తే... కౌరవులందర్నీ ఒక్కరోజులో మట్టుబెడతానని శపథం చేసి నిలబెట్టుకోలేకపోయాడు. చేసిన ప్రతిజ్ఞను నిలుపుకోలేనివాడికి స్వర్గం సశీరరంగా ప్రాప్తించదు."

ఇక మిగిలింది నేనూ, అన్నగారు మాత్రమే. ఇంతకాలం ఒకేమాట మీద నిలబడి ఇలా ఒకరికొకరం ఎవరికివారు విడిపోవడం జీర్ణించుకోలేని సత్యం. అన్నగారన్నట్లు కర్మఫలమిదే కదా! దుర్యోధనుడి ఒడలు విరుస్తానని, దుశ్శాసనుడి రొమ్ము విరిచి రక్తం త్రాగి ద్రౌపది కురులకు రాసిన తరువాతే కురులు ముడిచేలా చేస్తానని భీషణ ప్రతిజ్ఞ చేసి నిలబెట్టుకున్న వాడిని కావడంతో నాకలోక ప్రవేశద్వారం వరకు రాగలిగానని తెలుసుకున్నాను.

ఇక మరికొంత దూరంలో నాకలోక ప్రవేశద్వారం వస్తుందనగా నాలో కూడా శ్వాసస్థంభించటం మొదలైంది. మరికొన్ని అడుగులు ముందుకు వేశానో లేదో పడిపోయాను. ఆ ఒక్క క్షణంలోనే నేనొర్చిన కార్యక్రమాలన్నీ నా కళ్ళముందు నిలిచాయి. దుర్యోధన, దుశ్శాశన, జరాసంధాది రాక్షస సంహారం. నా కళ్ళముందు మెదిలింది. చిరునవ్వుతో నా పెదాలు విచ్చుకున్నాయి.

అసంకల్పితంగా "నిజమే.. నిత్యసత్యసంధుడు, నిత్యధర్మపాలకుడు అయిన ధర్మజుని వంటి మహోమహులకు సశీర స్వర్గలోక ప్రాప్తి లభిస్తుందిగాని, నాలాంటి సామాన్యులకు లభింపదుకదా! ఇలాంటి మహోన్నతుడితో సోదరా అని పిలిపించుకున్న నా జన్మధన్యమైనది. పరంధామా! పరమాత్మా! నేను సాధింపలేని పనులు కూడా నిర్వర్తించడంలో నన్ను కర్తవు చేసి కృతార్థుడివి చేశావా వాసుదేవా!" అని నా నోట మాటలు వచ్చాయి.

జీవితమంటేనే సంఘర్షణ. సంఘర్షిస్తేనే అనుకున్నది సాధించగలం. కురుక్షేత్రం అదే రుజువు చేసింది.

పద్దెనిమి రోజులు పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యం అంతరించిపోయింది.

దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, శకుని ఈ దుష్టచతుష్టయం స్వార్ధం, కుతంత్రం చరిత్రలో కనీవినీ ఎరుగని యుద్ధానికి కారణమైంది. కురుక్షేత్ర యుద్ధం రావటానికి కేవలం కొద్దిమంది వ్యక్తుల స్వార్ధమే కారణమనడంలో సందేహం లేదు. అనుమానమూ అక్కర్లేదు.

ఇంకా వాస్తవం చెప్పాలంటే దాయాదులైన పాండవులు, కౌరవుల మధ్య రాజ్యకాంక్షకు ఇంతమంది బలయ్యారు.

ఇందుకు పరమాత్ముడు సాక్షిగా నిలబడ్డాడు.

భీష్మ, ద్రోణ, కృపాచార్యుడు మాకు ఎంతో గౌరవనీయులు పైపెచ్చు పూజనీయులు, వారితో మాకెలాంటి విరోధమూ, శతృత్వము లేదు. అందులోనూ వధించేంత వైరమా? కృష్ణ, కృష్ణ! వాసుదేవా! పాపం శమించుగాక.

అదే విధంగా ద్రుపదుడు, సాత్యకి తదితరులతో కౌరవులకు ప్రత్యక్ష వైరంలేదు. ఉన్నదల్లా రాజ్యకాంక్ష మాత్రమే. అదీ మా అయిదుగురిపై ఉన్న మత్సరం మాత్రమే.

ఏదేమైనా దాయాదుల పోరులో సర్వనాశనమైనది ఇతరులే. కురుక్షేత్ర యుద్ధంలో గతంలో లేనివిధంగా అన్ని ప్రాంతాలకు చెందిన వీరులున్నారు. ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒక్కరైనా ఇందులో పాలుపంచుకున్నారు. ఇంతకు ముందే చెప్పిన విధంగా ఇందుకు ప్రత్యక్ష సాక్షిగా కృష్ణపరమాత్మే ఉన్నాడు. ఇది కాదనలేని వాస్తవం.

బంధువుల్ని పోగొట్టుకున్నాం. మిత్రుల్ని కోల్పోయాం. సోదరులను, కుమారులను, ఆప్తులను అందర్నీ నష్టపోయాం. ఇష్టంగానో, కష్టంగానో సన్నిహితుల్ని పోగొట్టుకున్నాం. చివరకు యుద్ధంలో విజయం సాధించాం. అది పైకి కనిపించే ఆనందం మాత్రమే. ఇంతమందిని కోల్పోయిన విషాదం మా హృదయాలను తొలిచేస్తోంది. ఇది ఎవరూ తీర్చలేని వేదన. ఎవరూ ఈ గాయాల్ని మాన్పలేరు. చరిత్రకో గుణపాఠం కావాలి మా జీవితాలు, మేము సాధించిన విజయాలు.

"శ్రీకృష్ణా! మా వేదన నీకు తెలుసు. మా హృదయాలకైన గాయాలూ తెలుసు. మేమంతా నిమిత్తమాత్రులమేనని, కర్తవ్యం నిర్వహించటం మినహా మానవుడికి మరో మార్గం లేదని చెప్పావు కదా! ఈ మాటలు యుద్ధభూమిలో అర్జునుడికి బోధించావు. తద్వార మానవులకు జ్ఞానబోధ చేశావు. కానీ మా తరంలో దాన్ని వినిపించుకునే వారులేక సర్వనాశనమయ్యాం.

దాయాదుల పోరులో కల్పించుకుంటే ఇతరులకు నష్టం ఉంటుంది కానీ, వారికి ఎలాంటి ప్రయోజనం కలిగిందనేది కురుక్షేత్ర యుద్ధం ద్వారా గ్రహించండి. భగవానుడి నోటినుంచి వెలువడిన "భగవద్గీత" సారంశాన్ని గ్రహించి జీవితాల్ని, మనిషిగా జన్మసార్ధకం చేసుకోవలసిన బాధ్యత మనుషులందరిపై ఉంది. గీతా సుగీతా కర్తవ్యా, కిమన్యైః శాస్త్ర సంగ్రహాః యా స్వయం పద్మనాభస్య ఉఖపద్మాత్

వినిఃసృతా| మహాభారతం - భీష్మపర్వం 43 -ఆ ప్రతివ్యక్తి గీతను శ్రవణ, కీర్తన, పఠన, మనస ధారణాదుల ద్వారా తెలుసుకోవాలి. అలా చేస్తే ఇతర శాస్త్రాలతో పని ఉండదు. ఇది సాక్షాత్తు పద్మనాభుడైన శ్రీ మహావిష్ణువు ముఖ కమలం నుంచి ఉద్భవించింది.)

వాసుదేవా! సత్వరజతమో గుణాలమాయలో మునిగిపోయి నిస్సారంగా జీవితాన్ని ముగిస్తున్న మానవజాతిని జాగృతం చేసే చర్యలకు ఇకనైనా ఉపక్రమించవా! (గీతాశ్రయేహం తిష్ఠామి, గీతామేం చోత్తమం గృహవమ్| గీతాజ్ఞానము పాశ్రిత్యత్రీన్ లోకాన్ పాలయామ్యహవమ్||.. వరాహ పురానం - గీత గురించి స్వయంగా భగవానుడే ఇలా అన్నాడు. "నేను గీతను ఆశ్రయించి ఉంటాను. గీతయే నా నివాసం. ముల్లోకాలను పాలించటంలో గీతా సాధనమే నాకు పరమసాధనం.")

అన్నింటిలో మనిషిని అథఃపాతాళానికి తీసుకెళ్ళేది క్రోధమే! ధర్మాన్ని నాశనం చేసే దిశలో పయనింపజేసి చిక్కుల్లోకి పడదోసేదీ ఈ క్రోధమే.

అంతఃకరణం రాగద్వేషరహితమై, శుద్ధ స్వభావం కలిగివుండడం వల్ల నీకు కర్మలు అంటవు.

అలా కాకుండా 'సర్వం నాదే. అంతానేనే... అన్నింటికీ కారణం నేనే' అన్న అహంకార భ్రాంతిలో మునిగిపోతే హానితప్ప మిగిలేదేమీ ఉండదు. మా జీవితాల్ని గమనంలోకి తీసుకుని వస్తువ్యామోహాన్ని వదులుకుంటే ప్రశాంత జీవనానికి నాంది కాగలుతుంది.

అశాంతిని కోరుకుంటే నీ ఒక్కడి బతుకే కాదు మొత్తం సమాజమే కలుషితమవుతుంది. తాను సృష్టించే వస్తువులన్నీ మాయవని తెలిసి ఉండడంతో గారడీవాడిలో ఎలాంటి రాగద్వేషాలకు తావుండదు. అలాగే కనిపించేవన్నీ వాస్తవాలు కాదని గ్రహిస్తే ఎలాంటి చికాకులు, చింతలుండవు.

నా ప్రజలారా! వింటున్నారా ఈ కౌంతేయ మధ్యముని మాటలు? భీముని అంతరంగ మథనం తెలుసుకోండి. భావిజీవితాన్ని చక్కదిద్దుకోండి.

ఇదే నా వీలునామాగా గ్రహించండి.

వీలునామా అంటే ఆస్తులు, అంతస్తుల పంపకమే అనుకోకండి. మీ భావిని సరైన మార్గంలో పయనింపచేసే దిక్సూచిగా గ్రహించండి. మీ పూర్వీకుల జీవితంలోని శుభాశుభాల ఫలితాల్ని మూరు గుణపాఠాలుగా మలచుకోండి.

నా అక్షరాన్నే పరబ్రహ్మమాటగా, వేదాంతసారంగా తెలుసుకోండి. జీవితాల్ని పండించుకోవాలంటే అనుభవజ్ఞుల సలహాలు, సూచనలు తప్పనిసరి. సర్వం తనకే సమర్పించమని భగవానుడే చెప్పాడు.

ఒక్క అర్జునుడి కోసమే పరమాత్ముడు భగవద్గీత చెప్పలేదు. సకల మానవాళి అభ్యున్నతి ఆయన ఆశయం. నిజంగా భగవన్నామ కీర్తన, స్మరణలో ఎంత మహత్తు ఉందో మాకు అనుభవైకమే. అదే మనిషిని ఉన్నత గతులకు చేరుస్తుంది. మనిషిని ఉన్నతుడిగా తీర్చిదిద్దుతుంది.

భారతదేశం కర్మభూమి. కర్మసిద్ధాంతమే ఈ దేశానికి భవిష్యత్తునిస్తుంది. భగవానుడు శ్రీకృష్ణుడు ఉపదేశించిన భగవద్గీత సందేశం కూడా కర్మసిద్ధాంతాన్నే ఉటంకిస్తుంది. అందులోని అమృతసారాన్ని ఆస్వాదించిన వారికి ఇహం నశించి పరంలోని మాధుర్యం లభింపజేసి పరమాత్మ సన్నిధికి చేరుస్తుంది.

మనకు లభించే సుఖదుఃఖాలు, ఆనంద విషాదాలన్నింటికీ ఎవరో కారణం కాదు. అవన్నీ మన సుకృత దుష్కృతాలు ఆయాజీవుల పూర్వజన్మ సుకృతమే తప్ప మరొకటికాదు. గత జన్మసేతు బంధనం అంటే ఇదేమరి.

ఈ కర్మభూమిలో జన్మించి పాపాలకు, శాపాలకు తావులేని జీవనం గడపడమే ధ్యేయంగా పెట్టుకోండి. ఈ భూమిలో జన్మించినందుకు పాపాలకు తావివ్వటం, ఆ తరువాత విచారించటం సరికాదు. పూర్వజాన్మకారణంగా మానవుడిగా జన్మించి ఇహలోక

సౌఖ్యాలకే ప్రాముఖ్యం ఇస్తున్నందుకు పశ్చాత్తాపమే ప్రాయశ్చిత్తమని గ్రహించండి. పశ్చాత్తాపమే సకల పాపహరణమని మహాపురుషులు చెబుతారు. చేసిన పనులకు పశ్చాత్తాపం చెందకపోతే ఉత్తమగతులు లభింపవు.

ప్రతి వ్యక్తినీ మోహబంధాలు పెనవేసి అనూహ్య పరిస్థితుల్ని కల్పిస్తాయి. అరిషడ్వర్గాలను అందించే మోహావేశుల్ని ఇహం వైపు తప్ప పరం వైపు దృష్టి వెళ్ళనివ్వదు. అహంకారం ఆవరిస్తే ఉచ్చనీచాలు మరచిపోవటం సహజం. మనిషిని అథఃపాతాళానికి తీసుకెళ్ళేది అహంకారమే. అహంకారం ఒక్కసారి ఆవరిస్తే మనిషి దిగజారటం మొదలైనట్టే. మనిషికి కావలసిన నిధి ప్రేమ, కరుణ మాత్రమే. అది తెలుసుకుంటే అహంకారికి, ప్రేమైక జీవికి ఉన్న వ్యత్యాసం స్పష్టమవుతుంది.

ఇదంతా నా వీలునామాలో ఎందుకు ఉదహరిస్తున్నానంటే ఇకనైనా నా దేశ ప్రజలంతా శాంతిసౌభాగ్యాలతో, కలిసిమెలసి ఐకమత్యంతో మెలుగుతూ ఒకరి సంక్షేమాన్ని మరొకరు కాంక్షిస్తారన్న భావంతో ఈ చరమదశలో ఈ నిర్ణయం తీసుకుని నా భావాలను, ఆశయాలను ఈ వీలునామా రూపంలో నా తరువాత తరానికి అందిస్తున్నాను.

ఎటువంటి వ్యక్తికైనా యవ్వనంలో పరమాత్ముడు గుర్తుకు రావటం అరుదు. వార్ధక్యంలో, జీవిత చరమాంకంలోనే జీవిత విలువలు తెలుస్తాయి. కచ్చితంగా ప్రతి ఒక్కరూ తమ జీవన విధానంలోని మంచీ చెడుల సింహావలోకనం చేసుకోవటం కూడా ఆ వయసులోనే. అందుకే మనిషి జీవితాన్ని కొన్ని దశలుగా విభజించారు. బాల్యయవ్వన వార్ధక్యం, వర్ణాశ్రమాల్లో వార్ధక్యమే మనిషిని పరిపూర్ణుడిగా చక్కదిద్దుకునే  అవకాశం కల్పిస్తుంది.

ఇదే మానవజీవన సౌభాగ్యం. ఇదే మనిషిని ఉన్నత మార్గంలోకి పయనింపచేసే సమయం.

ఉన్నతిని కలిగించే మార్గాన్ని వదిలి మనిషి ఎందుకిలా ఆక్షేపణీయ పథాన్ని అనుసరిస్తాడు?

సంపాదన అంటే సంపద పెంచుకోవడమేనా? మానవత్వంపై దృష్టి పెట్టనక్కర్లేదా?

మనిషికి, జంతువుకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కూడా గమనించలేని స్థితిలో మనిషెందుకు పడిపోతున్నాడు?

ఏ ప్రాణికి లేని విచక్షణా జ్ఞానాన్ని మనిషికి పరమాత్ముడు ఇచ్చాడు. దాన్ని ఎందుకు వినియోగించటం జీవితాల్లోని సత్యాసత్యాలను వెల్లడించాను. ఆ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సత్యం బాటపట్టుకుని నడిచి బ్రతుకు పండించుకోమని నా సలహా.

నా సలహా పాటిస్తారు కదూ.

ఈ వీలునామాలో మీలో చైతన్యం రగిల్చి మీ జన్మసార్థకతకు మార్గాన్ని సుగమం చేసుకోండి.

పూర్వీకుల అనుభవాలను పరిగణనలోకి తీసుకోవడం తప్పనిసరని ప్రస్తుత మానవ జీవితపరిణామాలు సూచిస్తున్నాయి. అహంకారం, అజ్ఞానం, క్రోధం, భయం - ఇవన్నీ మనిషిని అథఃపాతాళానికి తోసేస్తాయి. ఇది గమనించి నడుచుకునే మానవుడే ఆదర్శనీయుడు. మనసు పరిపక్వత చెందితే పరిణితి లభిస్తుంది. చేసిన తప్పుల్ని సరిదిద్దుకుంటూ తెలివితో సరైన మార్గాన్ని ఎంచుకోవడం ప్రతి ఒక్కరి ధర్మం. మనిషి మనిషి  చేయి కలిపి నడిచే బాటలో పరమాత్ముడు కనబడతాడు. మా'నవ' జీవితానికి నాంది పలుకుతాడు.

ఓ పరమాత్మా!

ఎక్కడ భయ సంకోచాలకు తావుండదో

ఎక్కడ అవినీతి అన్యాయాల ఊసు కనిపించదో

ఎక్కడ మోసం అధర్మం తాండవించదో

ఎక్కడ స్వార్థం అక్రమాల నీడపడదో

ఎక్కడ ధర్మం సత్యం అహింసలు పరిఢవిల్లుతాయో

ఎక్కడ మానవ సంబంధాలు బలపడతాయో

ఎక్కడి మనిషి మరో మనిషి చావు కోరుకోడో

ఎక్కడ మనిషిని అథఃపాతాళానికి తీసుకెళ్ళే

క్రోధం హింస అశాంతి పదాలు వినిపించవో..

అక్కడ సంచరించేలా ఈ మనుషుల్ని దీవించు. అదే వీరికి స్వరంగా కనిపించేలా చేయి. సన్మార్గం, సదాచారపరాయణత తప్పకుండా నడుచుకునేలా దీవించు.

పారమార్థిక చింతన కరువై పరమాత్మ మాట వినని అజ్ఞానుల చర్యల ఫలితం ఇప్పుడు అనుభవంలోకి వచ్చింది. భావితరాలకు మా జీవితాలు అందించే గుణపాఠం ఇదే

"అన్నా! ఆగు నేనొస్తాను...." అంటున్న నన్ను చూచి ధర్మజుడు చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వులో ఎన్నోవేల అర్థాలు నిండు జీవితాన్ని అనుభవించిన అనుభవశాలి కనబడ్డాడు. ఆయనలోని అజాతశత్రువు, కష్టనష్టాల్లో సైతం ధర్మాన్ని తు.చ తప్పకుండా ఆచరించిన మా సోదరుడు కనబడ్డాడు. ధర్మాన్ని నమ్ముకున్న వారికి నా జీవితమే ఉదాహరణగా నిలుస్తుందన్న విజయదరహాసం అది.

"తమ్ముడా! నువ్వు భోజనప్రియుడవు. కేవలం భుజ బలముందన్న అహంకారంతో వ్యర్థప్రేలాపనలతో గడిపేవాడు. అందుకే నీకీ దుస్థితి." అన్నగారి మాటలింకా పూర్తికాలేదు. నేలపై ఒరిగిపోయాను.

అంతే... ఇక మాటలు లేవు. చేతలెప్పుడో ఆగిపోయాయి. నా నోటి నుంచి వచ్చిన చివరి మాటలివే

ధర్మో రక్షితి రక్షితః!

సర్వేజనా సుఖినోభవంతు!!